www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 15-9-2024 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 151 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 6.12 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శ్రవణం రా. 6.49 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 10.26-11.53; దుర్ముహూర్తం: సా. 4.36-5.25; అమృతఘడియలు: ఉ. 9.09-10.38; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.13 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆపరేషన్ బుడమేరు

- వరదకు శాశ్వత విరుగుడు దిశగా అడుగులు
- అటు ఆక్రమణల తొలగింపు.. ఇటు గట్ల బలోపేతం
- ఈ దిశగా మొదలవనున్న బుడమేరు విస్తరణ పనులు
- డీపీఆర్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు
- గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిర్ణయం
- ఇప్పటికే గండ్లు పూడ్చివేత..
- గట్ల ఎత్తు పెంచిన సర్కారు
- ఇప్పుడిక.. మరిన్ని దిద్దుబాట్లకు రంగం సిద్ధం
- జలవనరుల శాఖకు ఆదేశాలు

37 వేల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా పటిష్ఠం

అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బుడమేరుకు విజయవాడ దుఃఖదాయని అని పేరు. ఇటీవల ఈ వాగు పగ.మేరుగా మారి విజయవాడను వణికించిన తీరు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. దీంతో రాష్ట్రంలో 'ఆపరేషన్ బుడమేరు'కు అడుగులు పడుతున్నాయి. బుడమేరు పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించడంతోపాటు ఈ వాగు గట్లను బలోపేతం చేయడం ఈ ఆపరేషన్ లక్ష్యం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. బుడమేరుకు మూడు చోట్ల గండ్లు పడటంతో వరద నీరు విజయవాడను ముంచెత్తి బీభత్సం సృష్టించింది. యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక

మిగతా 11వ పేజీలో...

ఖర్చు చేశారు.. తాళాలు వేశారు!





1, 2: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చినపుల్లేరులోని ప్రాథమిక పాఠశాల ఇది. జగన్ సర్కారు నాడు-నేడు పథకం ఫేజ్-1లో రూ.10.41 లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేసింది. తర్వాత పాఠశాలలోని 3,4,5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేశారు. దీంతో విద్యార్థుల్లేక మూణ్నెల్ల క్రితం ఈ పాఠశాల మూతపడింది. పై చిత్రం.. విలీనానికి ముందు విద్యార్థులతో కళకళలాడుతున్న దృశ్యం.

'నాడు-నేడు' పనులు చేశాక 73 స్కూళ్లు మూత

జగన్ ప్రభుత్వ అడ్డగోలు చర్యలతో విచిత్ర పరిస్థితి

- ఆ స్కూళ్లపై రూ.5 కోట్లకు పైగా ఖర్చు.. ఆ తర్వాత తరగతుల విలీనం
- ఫలితంగా మిగిలిన పిల్లలూ వెళ్లిపోయిన వైనం.. బడుల మూతతో శిథిలావస్థలోకి

నాడు- నేడు పథకంతో బడుల రూపురేఖలు మారుస్తామన్నారు.. ఆ బడులు కార్పొరేట్ స్కూళ్లతో పోటీ పడతాయని ప్రచారం చేశారు.. చాలాచోట్ల పైపై పూతలతో సరిపెట్టారు. కొన్నిచోట్ల నిధులు ఖర్చుచేసి మెరుగులు దిద్దారు. కానీ అంతా చేశాక తరగతుల విలీనం పేరుతో ఆ బడుల్లోని 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలకు తరలించారు.. దీంతో ఆ బడుల్లో మిగిలిన 1, 2 తరగతుల్లో పిల్లల్ని చేర్పించడానికి తల్లిదండ్రులు ఇష్టపడలేదు. ఇలా ఏకంగా 59 ప్రాథమిక పాఠశాలలు ఒక్క విద్యార్థీ లేక మూత పడ్డాయి. 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలలు కూడా ఇలాగే మూతపడ్డాయి. ఒక్కో పాఠశాలకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశాక.. గత వైసీపీ సర్కారు అనాలోచితంగా తీసుకున్న విలీన నిర్ణయంతో ఈ దుస్థితి తలెత్తింది. దీంతో ఇప్పుడు ఆ బడులను ఏంచేయాలో కూడా ప్రభుత్వానికి అంతుపట్టడం లేదు!!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం నాడు- నేడు పేరుతో ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉద్దేశం మంచిదే అయినా.. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఎడాపెడా ఖర్చు చేసింది. బడులను మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆలోచించారా అంటే అదీ లేదు. పనులన్నీ చేశాక 2022-23లో అనాలోచితంగా తరగతుల విలీనం చేశారు. కిలోమీటరు పరిధిలో ఉన్నత పాఠశాల ఉంటే ఆ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 4200 ప్రాథమిక

మిగతా 12వ పేజీలో...

ప్రతిమ ఇన్‌ఫ్రాకు 18.7 కోట్లు జరిమానా

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ



అనకాపల్లి జిల్లా గబ్బాడ డిపోలో ప్రతిమ ఇన్‌ఫ్రా నిల్వ చేసిన ఇసుక

- అనుమతి లేకుండానే రాజమండ్రి రీచ్‌లో తవ్వకాలు
- అనకాపల్లిలోని గబ్బాడ డిపోకు తరలింపు.. నిల్వ
- స్పీకర్ చొరవతో కదిలిన మైనింగ్ శాఖ

నర్సీపట్నం, సెప్టెంబరు 14: పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు రూ.18.7 కోట్లు జరిమానా విధించారు. పర్యావరణ అనుమతులు రాకుండానే ఈ సంస్థ రాజమహేంద్రవరం రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరిపింది. దీనిపై గత నెల ఎనిమిదో తేదీన అనకాపల్లి మైనింగ్ అధికారులు నోటీసు ఇచ్చారు. దీనికి ప్రతిమ ఇన్‌ఫ్రా ఇచ్చిన సమాధానం వారికి సంతృప్తి కలిగించలేదు. దీంతో గత గురువారం ఆ సంస్థకు డిమాండ్ నోటీసు పంపారు. గత వైసీపీ ప్రభుత్వం 2019 సెప్టెంబరులో ఏపీఎండీసీ ద్వారా ఇసుక సరఫరాకు నిర్ణయం (జీవో 71) తీసుకుంది. ఆ తర్వాత 2020 నవంబరులో జైప్రకాశ్ పవర్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు ఇసుక కాంట్రాక్టును

మిగతా 12వ పేజీలో...

సాక్ష్యాధారాల ధ్వంసంపై ఆర్జీ కర్ మాజీ ప్రిన్సిపాల్ అరెస్టు



- కోల్‌కతా మెడికో హత్యాచారం కేసులో అదుపులోకి తీసుకున్న సీబీఐ
- విచారణను తప్పుదోవ పట్టించినందుకూ అభియోగాలు నమోదు
- వీటితోపాటు ఎఫ్ఐఆర్ ఆలస్యంపై తలా రాణా ఎస్‌హెచ్‌వో అరెస్టు
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ముందుకుసాగని మెడికోల చర్చలు
- ప్రత్యక్ష ప్రసారానికి పట్టుబట్టిన వైద్యులు.. ఒప్పుకోని ముఖ్యమంత్రి
- రెండు గంటల అనంతరం కన్నీరు పెడుతూ వెళ్లిపోయిన వైద్యులు

కోల్‌కతా, సెప్టెంబరు 14: దేశాన్ని కుదిపేస్తున్న కోల్‌కతా ఆర్జీ కర్ వైద్య కళాశాల విద్యార్థిని హత్యాచార కేసులో ఆ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరోసారి అరెస్టు చేసింది. సాక్ష్యాధారాల ధ్వంసంతో పాటు విచారణను తప్పుదోవ పట్టించేందుకు

మిగతా 2వ పేజీలో...



బెజవాడ నుంచి త్వరలో సింగపూర్, దుబాయ్‌కు విమానాలు

- విమానాల పెంపుతో లక్షకు చేరిన ప్రయాణికుల సంఖ్య: మంత్రి రామ్మోహన్
- విజయవాడ విమానాశ్రయంలో నూతన గ్రాండ్ ఎంట్రన్స్ వే ప్రారంభం
- బెజవాడ-ఢిల్లీ ఇండిగో సర్వీసు ప్రారంభం

3

స్నేహపూర్వక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

11

- పోడియం తొలగింపు.. కుర్చీ ఎత్తు తగ్గింపు
- ప్రజలకు సౌకర్యవంతంగా కుర్చీలు
- అందుబాటులో తాగునీరు... కుదిరితే కాఫీ/టీ
- పన్నులు కడుతున్న ప్రజలకు గౌరవ మర్యాదలు
- మెమో జారీ చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

అరుదైన వ్యాధుల ఔషధాలకు 900 కోట్లతో ప్రాజెక్టు

2

- ఔషధాల ధరలు తగ్గించేలా ప్రపంచ ఫార్మా కంపెనీలతో కేంద్రం చర్చలు
- రోగుల గుర్తింపునకు 12 కేంద్రాలు

అవినీతి దందాకు ఆయనే దాదా

అనంతంగా సాగిన గనుల వెంకటరెడ్డి అక్రమాలు



'ఆంధ్రజ్యోతి' వార్తలు అక్షరసత్యాలని తేలిన వైనం

- ఆ శాఖను సొంత రాజ్యంగా మలుచుకున్నారు
- ఖజానాకు టోకరా ఇచ్చి కంపెనీలకు మేలు
- ప్రైవేటు సంస్థ ప్రతినిధి అన్నట్టు ప్రవర్తన
- ఇసుక కాంట్రాక్టులో 2,566.82 కోట్ల అవినీతి
- ఏసీబీ విచారణలో సంచలన విషయాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి గనుల గుట్టు బయటపడింది. ఇసుక అమ్మకాల కాంట్రాక్టు పేరిట వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రయోజనాల పరిరక్షణ కన్నా ప్రైవేటు కంపెనీలకు మేలు చేయడమే పరమావధిగా పనిచేశారు. ప్రైవేటు కంపెనీలతో కలిసి నేరపూరిత కుట్రలుచేసి ప్రభుత్వ ధనాన్ని కంపెనీలకు దోచిపెట్టారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ సొమ్మును కంపెనీలకు వెళ్లిపోయేలా కుయుక్తులు పన్నారు...ఇవన్నీ 'ఆంధ్రజ్యోతి' చెప్పిన మాటలు కావు. గనుల వెంకరెడ్డి ఇసుక లీలలపై విచారణ జరిపిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన నివేదికలో పొందుపరిచిన వాస్తవాలివి. గతంలో వెంకటరెడ్డి హయాంలో జరిగిన ఆర్థిక అక్రమాలు, అరాచకాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస వార్తలు ప్రచురించింది. 'ఆంధ్రజ్యోతి'కి జగన్ సర్కారు అంటే గిట్టక తప్పుడు వార్తలు రాస్తోందని వెంకటరెడ్డి సహా జగన్ ప్రభుత్వ పెద్దలు అప్పట్లో

మిగతా 12వ పేజీలో...



చైనా కంపెనీల్లో సెబీ చీఫ్ పెట్టుబడులు

- ఆ దేశంతో ఘర్షణ నెలకొన్న వేళ మాధవి బుచ్ ఆర్థిక లావాదేవీలు
- లిస్టెడ్ సెక్యూరిటీల్లో రూ. 36.9 కోట్లు
- సెబీ నియమావళికి ఇది పూర్తి విరుద్ధం
- అఘోరా అడ్వైజరీ కంపెనీలో ఇప్పటికీ మాధవికి 99% వాటా ఉంది
- సెబీ దర్యాప్తు జరుపుతున్న కంపెనీలతో ఆమెకు వ్యాపార సంబంధాలు: కాంగ్రెస్

2

అంతిమ ఘడియల్లో కశ్మీర్ ఉగ్రవాదం

- వారసత్వ రాజకీయాలు సుందర కశ్మీర్‌ను దెబ్బతీశాయి
- ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తాం
- మేమొచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలను జరిపాం
- అభివృద్ధికి పాటుపడిన యువతకు నా సెల్యూట్
- కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



జమ్మూ, సెప్టెంబరు 14: కలా? నిజమా? అన్నంతగా జమ్మూకశ్మీర్‌లో పదేళ్లలో అద్భుత ప్రగతిని సాధించామని.. దీంతో ఈ ప్రాంతంలో ఉగ్రవాదం అంతిమ ఘడియల్లో ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గతంలో సైన్యంపైనా, పోలీసులపైనా విసిరిన రాళ్లు ఇప్పుడు నయా కశ్మీర్ నిర్మాణంలో పునాదిరాళ్లుగా మారాయని పేర్కొన్నారు. దీని వెనుక

మిగతా 2వ పేజీలో...



పోలీసు విచారణకు హాజరైన ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ నేత దేవినేని అవినాశ్

తెలియదు.. సంబంధం లేదు.. గుర్తులేదు

- పోలీసు విచారణలో వైసీపీ నేతల సమాధానాలు
- ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, రఘురాంతో పాటు జోగి రమేశ్, దేవినేని అవినాశ్ హాజరు
- దర్యాప్తు అధికారికి పాస్‌పోర్టులు అప్పగింత
- రాత్రి వరకు కొనసాగిన విచారణ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి వైసీపీ నేతలు, ఎమ్మెల్సీలు శనివారం పోలీసు విచారణకు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు నివాసం, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుల్లో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి,

మిగతా 12వ పేజీలో...

జెత్వానీ ఫిర్యాదుతో విద్యాసాగర్‌పై కేసు

- ఏ1గా చేర్చిన ఇబ్రహీంపట్నం పోలీసులు
- వైసీపీ నేతపై 11 సెక్షన్లు నమోదు
- ఐపీఎస్‌లు పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్‌గున్నీపైనా ముంబై నటి ఫిర్యాదు



విజయవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో రెండో అడుగు పడింది. ఇప్పటికే ఇద్దరు పోలీసు అధికారులపై వేటు వేయగా.. తాజాగా కాదంబరి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీసులు వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఏ1గా కుక్కల విద్యాసాగర్‌ను

మిగతా 11వ పేజీలో...

పన్నుల వాటాలో అన్యాయంపై కొత్త వ్యూహం

» రాష్ట్రాల సీఎంలకు సిద్దరామయ్య లేఖ

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పన్నుల వాటా పంపిణీలో రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో పోరాటానికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఈ నెల 11న ఆయన.. అధికాదాయం ఉన్న 8 రాష్ట్రాల (ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్, హరియాణ, కేరళ) సీఎంలకు లేఖలు పంపారు. వీరితో ఆర్థిక సమాఖ్య వాదంపై బెంగళూరులో ఓ సదస్సు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఇటీవల 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుల ముందు కూడా ఆయన.. కేంద్ర ఖజానాకు కర్ణాటక నుంచి వెళ్లే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి ఇస్తోందని ఆరోపించారు.

జీఎస్టీ లోపాలు చెబితే అవమానిస్తారా: స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో ఇటీవల జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో జీఎస్టీ లోపాలను ఎత్తిచూపిన హోటల్ యజమాని పట్ల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల వైఖరి గర్హనీయమని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీ అమలు కఠినంగా ఉందని, ఆ పన్నుల విధానాన్ని సులభతరం చేయాలని కోరిన కోయంబత్తూరు అన్నపూర్ణా హోటల్ అధినేత శ్రీనివాసన్‌ను పిలిపించుకుని బలవంతంగా క్షమాపణలు చెప్పించుకోవడం సిగ్గుచేటని స్టాలిన్ ధ్వజమెత్తారు.

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న అరెస్ట్

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బీబీఎంపీ) కాంట్రాక్టర్ చలువరాజ్‌ను బెదిరించి, కులం పేరుతో దూషించిన కేసుల్లో కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నను పోలీసులు కోలార్‌లో శనివారం అరెస్టు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ప్రాణాలు తీస్తామని బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న బెదిరిస్తున్నారని కాంట్రాక్టర్ చలువరాజ్ అంతకుముందు బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. కాంట్రాక్టర్‌తో మునిరత్న మాట్లాడినట్లు ఉన్న ఆడియోలు వైరల్‌గా మారాయి.

సాక్ష్యాధారాల ధ్వంసంపై ఆర్జీ కర్ మాజీ ప్రిన్సిపాల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించారని అభియోగాలు మోపింది. వీటితో పాటు, ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం చేసినందుకు కేసును తొలుత విచారించిన తలా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అభిజిత్ మండల్‌ను కూడా అరెస్టు చేసింది. మండల్‌ను కొన్ని గంటల పాటు విచారించిన సీబీఐ.. ఆయన నుంచి సరైన జవాబులు రాకపోవడంతో అదుపులోకి తీసుకుంది. 8 సార్లు ప్రశ్నించినా.. ప్రతిసారీ వేర్వేరు సమాధానాలు ఇచ్చారని పేర్కొంది. ఈ కేసులో 17వ తేదీ నాటికి కోల్‌కతా హైకోర్టుకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. మరో ఇద్దరు కోల్‌కతా పోలీసులపైనా సీబీఐ నజర్ పెట్టినట్లు సమాచారం. కాగా, సీబీఐ.. సందీప్ ఘోష్‌పై హత్యాచారం అభియోగాలను నమోదు చేసినట్లు కథనాలు వచ్చాయి. అవి నిర్ధారణ కాలేదు. మరోవైపు మెడికోపై హత్యాచారం కేసులో సందీప్ ఇప్పటికే సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై ఆయనను దర్యాప్తు సంస్థ ఈ నెల 2న అరెస్టు కూడా చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఆగస్టు 9న యువ వైద్యురాలు హత్యాచారానికి గురయ్యారు. హాల్‌లోకి వెళ్లి బయటకు వస్తున్నట్లుగా ఉన్న సీసీ టీవీ దృశ్యాల మేరకు వాలంటీర్ సంజయ్ రాయ్‌ను సీబీఐ అరెస్టు చేసింది. పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. నార్కో టెస్టు చేయాలనుకున్నా.. అతడు ఒప్పుకోకపోవడంతో సాధ్యం కాలేదు.

వైద్యులతో సీఎం చర్చలపై ప్రతిష్టంభన

బెంగాల్ వైద్యులు, సీఎం మమతా మధ్య చర్చలపై ప్రతిష్టంభన వీడలేదు. బాధిత మెడికో కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నెల రోజులకు పైగా నిరసనలు చేస్తున్న వైద్యులు.. శనివారం సీఎంతో చర్చలకు సిద్ధమయ్యారు. అయితే, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయాలని పట్టుబట్టారు. విషయం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున ఇది సాధ్యం కాదని మమతా స్పష్టం చేశారు. అంగీకారం కుదిరిన డిమాండ్లపై నిమిషాల్లో సంతకం చేస్తానని కూడా చెప్పారు. దీనికిముందు ఆమె వైద్యుల దీక్షా శిబిరానికి వెళ్లారు. సీఎం ఆహ్వానం మేరకు ఆమె ఇంటికి వెళ్లినప్పటికీ.. ప్రత్యక్ష ప్రసారానికే పట్టుబట్టడంతో చర్చలు సాగలేదు. 2 గంటల తర్వాత వైద్యులు కన్నీరుపెడుతూ వెళ్లిపోయారు. అయితే, తనను పదే పదే అవమానించ వద్దని.. ఇప్పటికే మూడుసార్లు ఇలా చేశారని మమత అసహనం వ్యక్తం చేశారు.

అంతిమ దశకు కశ్మీర్ ఉగ్రవాదం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నది తాను కాదని, కశ్మీర్ ప్రజలేనని కొనియాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్-ఎన్సీ-పీడీపీ, కశ్మీర్ యువతకు మధ్య పోరాటమని.. ఓవైపు కుటుంబ పార్టీలు, మరోవైపు కలలను నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉన్న తన చెల్లెళ్లు, కుమార్తెలు ఉన్నారని ప్రధాని అన్నారు. ఉగ్రవాదం, వారసత్వ రాజకీయాలు సుందర కశ్మీర్‌ను దారుణంగా దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం దోడా జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత 42 ఏళ్లలో ఇక్కడ పర్యటించిన తొలి ప్రధానిగా ఆయన ప్రత్యేకంగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో కశ్మీరీ భాషలో ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు భవిష్యత్‌ను నిర్దేశించేవని పేర్కొన్నారు. ఇకపై ఈ ప్రాంతంలో కర్ఫ్యూలు ఉండవన్నారు. స్వాతంత్ర్యం వస్తూనే కశ్మీర్‌పై విదేశీ శక్తులు కన్నేశాయని, తర్వాత కుటుంబ పార్టీలు ప్రజలను వంచించాయని విమర్శించారు. వెనుకబాటు పాపం ఆ మూడు పార్టీలదేనని, అవినీతి, భూకబ్జాలను ప్రోత్సహించి ప్రజల హక్కులను హరించాయని



ఢిల్లీలోని తన అధికారిక నివాసం ఆవరణలో ఇటీవలే పుట్టిన ఆవుదూడతో ఆడుకుంటున్న ప్రధాని మోదీ. ఈ దూడ పేరు 'దీపజ్యోతి' అని మోదీ ఎక్స్‌లో తెలిపారు.

ధ్వజమెత్తారు. 2000 సంవత్సరం నుంచి నిలిచిపోయిన పంచాయతీ, బ్లాక్, జిల్లా డెవలప్‌మెంట్ కౌన్సిల్స్ ఎన్నికలు నిర్వహించి కొత్త తరాన్ని ప్రోత్సహించామని, తద్వారా 35 వేలమంది యువత పదవులు చేపట్టారని మోదీ చెప్పారు. కాంగ్రెస్ హయాంలో శ్రీనగర్ లాల్‌చౌక్ వద్దకు కేంద్ర హోంమంత్రి కూడా వెళ్లలేకపోయారన్నారు.

విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించారు..

కాంగ్రెస్ రాజ కుటుంబం దేశంలోనే అత్యంత అవినీతి రాజ కుటుంబం అని, అత్యంత అవినీతి పార్టీ కాంగ్రెస్ అని, అధికారం కోసం అవసరమైతే ఎన్నికలను తారుమారు చేస్తుందని ప్రధాని ధ్వజమెత్తారు. సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని తాను హెచ్చరిస్తే.. తప్పుబట్టారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న హిమాచల్‌లో ఏం జరుగుతోందో గమనించాలని సూచించారు. రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఉండగా, ఆయన పాల్గొన్న కార్యక్రమంలో భారత జర్నలిస్టుపై దాడి జరిగిందని ఆరోపించారు. మొహబ్బత్ కా దుకాణ్, వాక్ స్వాతంత్ర్యం గురించి మాట్లాడేవారు.. విదేశీ గడ్డ మీద భారత్‌ను అవమానించారని మండిపడ్డారు. తాము గనుక 20 సీట్లు అదనంగా గెలిస్తే బీజేపీ వాళ్లను జైలుకు పంపేవారమన్న ఖర్గే వ్యాఖ్యలను మోదీ ప్రస్తావిస్తూ.. అధికారం కావలనుకుంటోంది ప్రజల అభివృద్ధికా? వారిని జైలుకు పంపేందుకా? అని నిలదీశారు. కాగా, కశ్మీర్‌లో కిష్త్వాడ్, దోడా, రాంబన్, దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని 24 నియోజకవర్గాల్లో ఈ నెల 18వ తేదీన తొలి విడత పోలింగ్ జరగనుంది.

అల్విదా కామ్రేడ్!

» ముగిసిన ఏచూరి అంతిమయాత్ర

» ఎయిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

» సోనియా, పవార్, అఖిలేశ్ నివాళులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంతిమయాత్ర ముగిసింది. వామపక్షాల అగ్రనేతలు, నాయకులు, వేలాది కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొని, అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన ఎర్రసూరీడు ఏచూరికి చివరి వీడ్కోలు పలికారు. శనివారం మధ్యాహ్నం పార్టీ ప్రధాన కార్యాలయం ఏకే గోపాలన్ భవన్ నుంచి ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన 14-అశోకారోడ్(సీపీఎం మాజీ కేంద్రకార్యాలయం) వరకు జరిగిన అంతిమయాత్ర.. అక్కడి నుంచి ఎయిమ్స్ వరకు కొనసాగింది. ఏచూరి భౌతికకాయాన్ని వైద్య బోధన, పరిశోధనల కోసం ఎయిమ్స్ అధికారులకు అప్పగించారు. సహచర కామ్రేడ్‌కు అంతిమ వీడ్కోలు పలుకుతూ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరాట్, మాణిక్ సర్కార్, పినరయి విజయన్, బృందాకరాట్, బీవీ రాఘవులు, సుభాషిణీ అలీ తదితరులు అంతిమయాత్రను ముందుండి నడిపించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆ పార్టీ నేతలు బి.మధు, తమ్మినేని వీరభద్రం, శ్రీనివాసరావు, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, టి.సాగర్, డీజీ నర్సింహారావు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



అగ్రనేతల నివాళులు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ.. ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించి, ఏచూరి భార్య సీమాచిస్తీ, కుమార్తె అఖిలను ఓదార్చారు. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, చిదంబరం, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, కపిల్ సిబ్బల్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, డీఎంకే నేతలు కనిమొళి, బాలు, బంగ్లాదేశ్, నేపాల్ వామపక్ష నేతలు.. ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా ప్రజాస్వామ్య వాదులకు తీరని నష్టమని బీవీ రాఘవులు అన్నారు. ఏచూరి స్ఫూర్తితో వామపక్ష ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.



అరుదైన వ్యాధుల ఔషధాలకు

900 కోట్లతో కేంద్రం ప్రాజెక్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: అరుదైన వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా ఔషధాలను అందించేందుకు కేంద్రప్రభుత్వం రూ.900 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే.. ఈ కోవలోని రోగులకు చేయూతనందించేందుకు రూ.50 లక్షల దాకా నేరుగా వారి ఖాతాలకు నగదు బదిలీ చేస్తుండగా.. ఇప్పుడు ఖరీదైన ఔషధాల ధరలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. గౌచర్ డిసీజ్(జన్యుపరమైన లోపాలతో కాలేయం, ప్లీహం వంటి ప్రాంతాల్లో కొవ్వు పేరుకుపోయి.. అవయవాల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది), డుచెన్ కండరాల బలహీనత, సిస్టిక్ ఫైబ్రోసిస్(ఒక జన్యువు మ్యుటేషన్ కారణంగా ఊపిరితిత్తులు, క్లోమం, ఇతర అవయవాలు దెబ్బతినడం), వెన్నెముక కండరాల క్షీణత వంటి 13 రకాల రుగ్మతలను అరుదైన వ్యాధులుగా పరిగణిస్తారు. భారత్‌లో అరుదైన వ్యాధులతో సతమతమవుతున్న వారి సంఖ్య 19 కోట్ల వరకు ఉంటుందని కేంద్ర ఆరోగ్య శాఖ అంచనా.

లోకం తీరు



చైనా కంపెనీల్లో

సెబీ చీఫ్ పెట్టుబడులు

» కాంగ్రెస్ సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: చైనాకు భారత్‌కు మధ్య ఘర్షణ పరిస్థితులు నెలకొన్న సమయంలో, ఆ దేశానికి చెందిన పలు కంపెనీల్లో సెబీ చెయిర్ పర్సన్ మాధబి పురీ బుచ్ పెట్టుబడులు పెట్టారని కాంగ్రెస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా శనివారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2021-24 మధ్య కాలంలో మాధబి అమెరికాలో పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారన్నారు. వీటిలో వాన్‌గార్డ్ టోటల్ స్టాక్‌మార్కెట్ ఈటీఎఫ్, ఏఆర్‌కే ఇన్నొవేషన్ ఈటీఎఫ్‌లతోపాటు చైనా కంపెనీలు.. గ్లోబల్ ఎక్స్ ఎంఎస్‌సీఐ చైనా కన్స్యూమర్, ఇన్‌వెస్కో చైనా టెక్నాలజీ ఈటీఎఫ్ వంటివి కూడా ఉన్నాయన్నారు. 'ఓవైపు చైనా దురాక్రమణకు పాల్పడుతున్నా.. అలాంటిదేమీ లేదని చైనాకు ప్రధాని మోదీ క్లీన్‌చిట్ ఇస్తుంటారు. అదే దారిలో సెబీ చెయిర్ పర్సన్ ఆ దేశ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు' అని పవన్ ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. 2017-23 మధ్య కాలంలో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా, చెయిర్ పర్సన్‌గా మాధబి బుచ్ రూ.36.9 కోట్ల విలువైన లిస్టెడ్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టారని, సెబీ సభ్యుల ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్‌కు 6కు ఇది పూర్తి విరుద్ధమన్నారు. దీంతోపాటు, 2017-21 మధ్య ఆమె.. విదేశాల్లో ఆస్తులను కలిగి ఉన్నారని తెలిపారు. వీటి గురించి ప్రభుత్వంలో ఏ విభాగానికైనా ఆమె సమాచారం అందించారా? అని ప్రశ్నించారు. తనకు 99% వాటా ఉన్న అఘోరా అడ్వైజరీ కంపెనీ కార్యకలాపాలు.. తాను సెబీలో చేరగానే నిలిచిపోయాయని మాధబి అబద్ధం చెప్పారని పవన్ ఖేరా ఆరోపించారు. ఇప్పటికీ, ఆ కంపెనీలో ఆమెకు 99 శాతం వాటా ఉందన్నారు.



వరద బాధితులకు వస్త్రాలు అందజేస్తున్న కేసీపీ సిమెంట్ సంస్థ సీనియర్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ

కేసీపీ సిమెంట్ దాతృత్వం

ధర్నాచౌక్, సెప్టెంబర్ 14: కేసీపీ సిమెంట్ ఆధ్వర్యంలో నగరంలోని వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేసీపీ సిమెంట్ సంస్థ సీనియర్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ మాట్లాడుతూ కేసీపీ సంస్థల చైర్మన్ ఇందిరా దత్ పిలుపు మేరకు సర్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేసీపీ సిమెంట్ సంస్థ తమ వంతు సాయం బాధితులకు అందిస్తుందన్నారు. సంస్థ ఏజీఎం హేమంత్, సంస్థ ప్రతినిధులు నరేష్, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

'బ్యారేజీ' ఘటనపై సీబీఐ విచారణ చేయాలి

పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు మాదిగ

ధర్నాచౌక్, సెప్టెంబర్ 14: ప్రకాశం బ్యారేజీని భారీ పడవలు ఢీకొట్టిన ఘటనపై సీబీఐతో విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దీని వెనుక ప్రతిపక్ష నేతల పాత్ర ఉందని వస్తున్న ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు విమర్శించుకోవడం సహజమన్నారు. కాని వరదల సమయంలో బ్యారేజీని ధ్వంసం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

కూల్‌డ్రింక్ షాపు మూసివేత

వన్‌టౌన్, సెప్టెంబరు 14 : కనక దుర్గమ్మ గుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్న కూల్ డ్రింక్స్ షాపును ఆలయ ఈవో కె.ఎస్.రామారావు ఆదేశాల మేరకు అధికారులు మూసివేశారు. శనివారం ఓ భక్తుడు అమ్మవారి దర్శనం అనంతరం కొండదిగువన మహామండపం ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్స్ షాపునకు వెళ్లి వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. షాపులో ఉన్న వారు రూ.30 చొప్పున వసూలు చేశారు. దీనిపై భక్తుడు ప్రశ్నించగా సిబ్బంది అసభ్యకరంగా దూషించారు. భక్తుడు ఈవోకు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఆయన ఆదేశాల మేరకు లీజు అండ్ లీగల్ ఏఈవో వెంకటరెడ్డి తమ సిబ్బందిని వెంటబెట్టుకుని షాపు వద్దకు వెళ్లి షాపును మూసివేయించారు.

తొలి తెలుగు జాతి రత్నం మొల్ల

▫ మంత్రి కొల్లు రవీంద్ర

▫ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ

వన్‌టౌన్, సెప్టెంబరు 14: తొలి తెలుగు జాతి రత్నం కవయిత్రి మొల్ల అని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ తెలుగు జాతికి విలువైన రత్నం కవయిత్రి మొల్ల అని అన్నారు. నన్నయ్య ఆది కవి అయితే ఆమె ఆది కవయిత్రి అని కొనియాడారు. తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రామాయణాన్ని అచ్చతెలుగులో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆమె అనువదించారన్నారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని బాలికలు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. మొల్ల మన తెలుగు కవయిత్రి



సభలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, మైసూరు మహారాజు, ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు

కావటం మన అదృష్టమన్నారు. మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన మైసూరు మహారాజు, ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ మాట్లాడుతూ ఎన్నో శతాబ్దాల నుంచి కన్నడ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. తెలుగు కవయిత్రి మొల్ల ఒక ధీర వనిత అని కొనియాడారు. ఆనాటి కాలంలో రాజ ఆస్థానాల అండ లేకుండా ఎవరూ కూడా కావ్యం రాయలేరని, మొల్లం మాత్రం ఎవరి అండా లేకుండా అచ్చ తెలుగులో రామాయణం రచించి ఆ శ్రీరాముడికే అంకితం ఇచ్చారన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి రెండు రాష్ట్రాల మధ్య మంచి మైత్రి కొనసాగు తుందన్నారు. తెలుగు రాష్ట్రంలో కుమ్మరి శాలివాహన సంఘం అభివృద్ధికి ఐలాపురం వెంకయ్య విశేషకృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీలు దువ్వాడపు రామారావు, కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, గద్దే రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, కుమ్మరి శాలి వాహన సంఘ ప్రముఖులు తమ తమ ప్రసంగాల్లో మొల్ల కీర్తిని గురించి మాట్లాడారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర అతిథులను ఘనంగా సత్కరించారు.

రాజీనే రాజమార్గం

హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ జి.నరేందర్

విజయవాడ లీగల్, సెప్టెంబరు 14 : కోర్టుల్లోని కేసుల పరిష్కారంలో రాజీ ఒక్కటే రాజ మార్గమని హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా పోర్టు ఫోలియో న్యాయ మూర్తి జస్టిస్ జి.నరేందర్ అన్నారు. విజయవాడ సిటీ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో రాజీ అయిన భార్యభర్తల కేసులో (498ఎ) కలిసి కాపురం ఉంటామని రాజీ పత్రాన్ని న్యాయమూర్తి చేతుల మీదుగా భార్యభర్తలు అందుకున్నారు. అనంతరం భార్య, భర్తలను న్యాయమూర్తి అభినందించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులకు అప్పీలు ఉండదని నరేందర్ తెలిపారు. 200 చెల్లని చెక్కు కేసుల పరిష్కారానికి కృషి చేసిన బ్యాంకు అధికారులను న్యాయమూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ చేతులమీదుగా రాజీపత్రాన్ని అందుకుంటున్న భార్య, భర్తలు



జస్టిస్ నరేందర్‌ను సత్కరిస్తున్న బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్ (రాజా)

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు, రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ మెంబర్ సెక్రటరీ బబిత, విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద, బెజ వాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు ఎ.చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్ తదితరు లు న్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తిని బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్ర సాద్ దుశ్శాలువాతో సత్కరించారు.

2,043 కేసులు పరిష్కారం

సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ వారి అధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 2,043 కేసులు పరిష్కారం అవగా, అందులో 1,862 క్రిమినల్ కేసులు పరిష్కరించి రూ.8,63,24,336, మోటార్ యాక్సిడెంట్ కేసులు 45 పరిష్కరించి రూ.2,66,07,000, ఇతర సివిల్ కేసులు 41 పరిష్కరించి రూ.2,05,47,204, ప్రీలిటిగేషన్ కేసులు 95 పరిష్కరించి రూ.42,41,791 పరిహారంగా బాధితులకు అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో

మంత్రి నారాయణ పర్యటన

వన్‌టౌన్, సెప్టెంబరు 14: వరద ముంపు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. బాధితులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కారించాలంటూ అధికారులకు ఆదేశాలు చేశారు. మంత్రి శుక్రవారం రాత్రి వరద ముంపునకు గురైన 64వ డివిజన్ పరిధి మీనాక్షినగర్ కట్ట, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించి బాధితులను పరామర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. శనివారం ఉదయం కండ్రిక, బోసునగర్, జర్నలిస్టు కాలనీ, ఇతర ముంపు ప్రాంతాల్లో బైక్ నడుపుకుంటూ పర్యటించారు. వరదనీరు ప్రాంతంలో శరవేగంగా శానిటేషన్ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జర్నలిస్టు కాలనీలో నిల్వ ఉన్న వరద నీటిని భారీ మోటార్‌లతో బయటకు పంపింగ్ చేస్తున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మట్లాడుతూ విజయవాడ నగరంలో దాదాపు వరద నీరు తగ్గిపోయిందన్నారు. 32 డివిజన్‌లు సాధారణ స్థితికి వచ్చాయన్నారు. వరద నీటి వలన నివాసాలు బురదమయంతో ఉన్నాయని చెప్పారు. అన్ని వీధులలో ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేసి శుభ్రం చేయిస్తున్నామన్నారు.



కండ్రిక వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

అర్బన్ కంపెనీ సాయంతో బాధితులకు సేవలు

విజయవాడ లీగల్, సెప్టెంబరు 14 : వరద బాధితులకు మెప్మా, అర్బన్ కంపెనీ సంయుక్తంగా పలు సేవలు అందిస్తున్నట్లు మెప్మా డైరెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ముంపు బాధితులకు అందించే సేవలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ తేజ్ భరత్ శనివారం మెప్మా ఆర్పీలు, యూడీసీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకు సేవలందించేందుకు సింగ్‌నగర్, వాంబేకాలనీ, భవానీపురం, పాయకాపురం, కండ్రిక, రాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రా లను ఏర్పాటు చేసి మెప్మా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుసంధానంతో అర్బన్ కంపెనీ యాప్ ద్వారా వివిధ సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రూ.6.49 కోట్ల విలువైన విదేశీ సిగరెట్ల స్వాధీనం

విజయవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ అధికారులు రూ.6.49 కోట్ల విలువ చేసే విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. కామినేని నగర్‌లో ఒక ఇంట్లో మూడు గదుల్లో విదేశీ సిగరెట్లు ఉన్నాయని సమాచారం రావడంతో అదనపు కమిషనర్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. ఇందులో 64,99,340 సిగరెట్లు ఉన్నట్టు గుర్తించారు. 649 బాక్సుల్లో ఈ సిగరెట్లు ఉన్నట్టు గుర్తించారు. వాటి విలువ రూ.6.49 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

నగర మేయర్ భాగ్యలక్ష్మి రాజీనామా చేయాలి

వన్‌టౌన్, సెప్టెంబరు 14: విజయవాడ నగరానికి అప్రతిష్ఠ తెచ్చిన నగర మేయర్ భాగ్యలక్ష్మి తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, టీడీపీ నాయకుడు కొట్టేటి హనుమంతరావు డిమాండ్ చేశారు. శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 32 డివిజన్లలో పెద్ద ఎత్తున వరద ముంపునకు గురై బాధితులు ఆవేదన చెందుతుంటే మేయర్ భాగ్యలక్ష్మి ఇంటిలో కూర్చొన్నారని ఆరోపించారు. నగరపాలక సంస్థకు ఆదాయం ఉన్నా కూడా నగరపాలక సంస్థ తరపున ఒక్క రూపాయి కూడా బాధితుల కోసం వ్యయం చేయలేదని విమర్శించారు.

బుద్దా వెంకన్నపై పోతిన ఆరోపణలు సరికాదు

వన్‌టౌన్, సెప్టెంబరు 14: టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నపై వైసీపీ నాయకుడు పోతిన మహేష్ చేసిన ఆరోపణలు సరికాదని 52వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) అన్నారు. శనివారం మల్లికార్జునపేటలోని బుద్దా వెంకన్న కార్యాలయంలో ఆయన మాజీ కార్పొరేటర్ కొట్టేటి హనుమంతరావు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దుర్గగుడి పార్కింగ్, షాపుల లీజుల వ్యవహారంలోనూ బుద్దా వెంకన్నకు ఎటువంటి ప్రమేయం లేదని తెలిపారు. మహేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మరోసారి ఇటువంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

జక్కంపూడి బాధితులకు వైద్య సేవలు

వన్‌టౌన్, సెప్టెంబరు 14: జక్కంపూడి వైఎస్‌ఆర్ కాలనీ 46వ డివిజన్‌లో స్పెషలిస్టు డాక్టర్లతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి నారాయణ చొరవతో నెల్లూరు నుంచి ప్రత్యేక వైద్యుల బృందం ఇక్కడకు వచ్చింది. 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతపురం జిల్లా టీడీపీ వైద్యుల విభాగం అధ్యక్షురాలు పత్తి హిమబిందు ఈ కార్యక్రమంలో పాల్గొని రూ.40 వేల విలువైన మందులను తన సొంత నిధులతో పంపిణీ చేశారు.

మినిమం టైంస్కేల్ అమలు చేయాలి

వన్‌టౌన్, సెప్టెంబరు 14: పాఠశాల విద్యా సమగ్ర శిక్షా విభాగంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ వృత్తి విద్యా ఉపాధ్యాయుల యూనిట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైకం శివకుమారి రెడ్డి, శంకర్ నీలు భాగవతుల డిమాండ్ చేశారు. శనివారం గవర్నర్‌పేటలోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో జరిగిన అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్రస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.

దుర్గమ్మ సేవలో సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న

వన్‌టౌన్, సెప్టెంబరు 14 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను సీఎం చంద్రబాబు కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న శనివారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కొల్లు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభు

థాంక్యూ సీఎం సార్!

- సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను ఏకీకరణ చేయడంపై ఉద్యోగుల హర్షం
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి), విజయవాడ లీగల్, భీమవరం క్రైం: సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను తిరిగి ఏకీకరణ చేయడంపై ఆ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం శాఖను ఒక్కటిగా చేసినందుకు 'థాంక్యూ సీఎం సార్' పేరుతో శనివారం రాష్ట్రవ్యాప్తంగా 208 స్టేషన్లు, ఎక్సైజ్ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు విజయవాడలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వం 70 శాతం సిబ్బందిని సెబ్‌లోకి పంపి రెండు శాఖలను నిర్వీర్యం చేసిందన్నారు. గుంటూరులో ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోటయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. సెబ్‌ను అంతమొందించేందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు రాష్ట్ర ఎక్సైజ్ విభాగం ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షులు బీ.నరసింహులు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటు చేసి ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేసిందని పశ్చిమ గోదావరి జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభుకుమార్ అన్నారు. భీమవరంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కాఫీ పొడి అనుకొని.. గుళికల పొడి తాగి వృద్ధ దంపతుల మృతి



అప్పయమ్మ, గోవిందు(ఫైల్)

రాజానగరం, సెప్టెంబరు 14: కాఫీ పొడి అనుకుని గుళికల పొడితో కాఫీ కాచుకుని తాగి వృద్ధ దంపతులు మృతిచెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం పల్లకడియంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెలుచూరి గోవిందు (70), అప్పయ్యమ్మ(64) రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. వయోభారంతో ఇద్దరికీ కంటిచూపు మందగించింది. రెండు రోజుల కిందట ఇంటి వద్ద జామచెట్టు కింద ఒక కోతి తెచ్చి పడేసిన గుళికల పౌడర్ ప్యాకెట్‌ను కాఫీ పొడిగా భ్రమించి ఇంట్లో దాచుకున్నారు. శుక్రవారం దాంతో కాఫీ కాచుకుని తాగారు. అస్వస్థతకు గురై మంచంపై పడుకుని నురగలు కక్కుతున్న ఆ వృద్ధ దంపతులను స్థానికులు, కుమార్తె వెంకటలక్ష్మి గమనించి, రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి వృద్ధులిద్దరూ చనిపోయారు.

బెజవాడ నుంచి త్వరలో సింగపూర్, దుబాయ్‌కు విమానాలు



విమానాల పెంపుతో లక్షకు చేరిన ప్రయాణికుల సంఖ్య: మంత్రి రామ్మోహన్ నాయుడు

- విజయవాడ విమానాశ్రయంలో నూతన గ్రాండ్ ఎంట్రన్స్ వే ప్రారంభం
- బెజవాడ, ఢిల్లీ మధ్య ఇండిగో సర్వీసు ప్రారంభం
- ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులపై కేంద్ర మంత్రి సమీక్ష
- జూన్, 2025 నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ

విజయవాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ విమానాశ్రయం నుంచి సింగపూర్, దుబాయ్‌లకు అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా నిర్మించిన గ్రాండ్ ఎంట్రన్స్ వేను, విజయవాడ - ఢిల్లీ ఇండిగో సర్వీసును ఆయన ప్రారంభించారు. విజయవాడ విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం కొలువు తీరిన మూడు నెలల్లోనే విజయవాడ నుంచి ముంబాయికి రెండు, బెంగళూరు, ఢిల్లీకి ఒక్కోటి చొప్పున అదనంగా విమాన సర్వీసులను ప్రవేశపెట్టాం. ఈ చర్యలతో ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి నెలకు లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రపంచ వ్యాప్తంగా విమాన సర్వీసులు నడిపేందుకు దశల వారీగా చర్యలు తీసుకోనున్నాం. దీనికి కావాల్సిన ద్వైపాక్షిక ట్రాఫిక్ రైట్స్ కోసం కృషి చేస్తాం. 2025 జూన్ నాటికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులను పూర్తి చేయాలన్నది లక్ష్యం. టెర్మినల్ పనులు ఇప్పటి వరకు 52 శాతం జరిగాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పనులు కొంత మేర మందగించాయి. మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విజయవాడ విమానాశ్రయంపైనే ఎక్కువ దృష్టి సారించా. అక్టోబరులో విజయవాడ - విశాఖపట్నం మధ్య మరో కొత్త విమాన సర్వీసును ప్రారంభిస్తున్నాం. రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయటం ద్వారా పెట్టుబడులను ఆకర్షించటంపై దృష్టి పెట్టాం. ఏ దేశంలో లేనివిధంగా మన దేశంలో ప్రధాని మోదీ సారథ్యంలో పదేళ్ల కాలంలో 74 నుంచి 157 విమానాశ్రయాలను నిర్మించాం. వికసిత్ భారత్ - 2047 లక్ష్యంగా రానున్న పదేళ్లలో మరో 200 విమానాశ్రయాలను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం విమానయాన రంగం అభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విమానయాన రంగం పూర్తిగా పడకేసిందని విమర్శించారు. విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎంపీ యదువీర్ వడియార్‌తో పాటు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఎయిర్ పోర్టు జీఎం రామాచారి, ఎయిర్ పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నుంచి ఢిల్లీకి ఇండిగో

విజయవాడ నుంచి ఢిల్లీకి తొలి ఇండిగో విమాన సర్వీసు శనివారం బయలుదేరింది. మొత్తం 180 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ విమానంలో 130 మంది ఇక్కడి నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ ఇండిగో తొలి విమాన ప్రయాణికుడు శ్రీ కృష్ణకు కేంద్రమంత్రి బోర్డింగ్ పాస్‌ను అందించారు.



నూతన గ్రాండ్ ఎంట్రన్స్ వే బోర్డు వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ తదితరులు

పేరు మార్పు శుభపరిణామం

- పోర్ట్ బ్లెయిర్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందన

అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును "శ్రీ విజయపురం"గా మార్చడం శుభపరిణామమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పోర్టు బ్లెయిర్ పేరును మారుస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. భావితరాలపై వలసవాద విధానాల ప్రభావం పడకుండా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భావిస్తున్నాను' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన పోస్టులో పేర్కొన్నారు.

వరద బాధితులకు రూ.40 లక్షల విలువైన మందులు

- సమకూర్చిన డీడీ రెమిడీస్ సంస్థ.. జనసేన పార్టీ ద్వారా పంపిణీ

భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపునకు స్పందనగా వివిధ ప్రజాసంఘాలు, ప్రముఖులు, వ్యాపారస్తులు మేము సైతం అంటూ సహాయక కార్యక్రమాలు చేపడుతున్నారు. విజయవాడ ప్రాంతానికి చెందిన డీడీ రెమిడీస్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ వరద బాధితుల సహాయార్థం రూ.40 లక్షలు విలువ చేసే ఎమర్జెన్సీ మందుల కిట్లు పంపిణీ చేసేందుకు ముందుకొచ్చింది. మందులతో కూడి మెడికల్ వ్యాన్‌ను శనివారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడలోని వైద్య శిబిరాల్లో ఈ కిట్లను అందుబాటులో ఉంచనున్నట్లు డీడీ రెమిడీస్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

భవిష్యత్తు కాపు సామాజికవర్గానిదే: గంటా

విశాఖపట్నం, సెప్టెంబరు 14: యువత చురుగ్గా పనిచేస్తున్నందున భవిష్యత్తు కాపు సామాజికవర్గానిదేనని విశాఖపట్నం జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్ల సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు టీచర్ల సంఘం చేసే ప్రతి కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అడిగినవన్నీ నెరవేర్చేందుకు కృషిచేస్తున్నామని, బలమైన శక్తిగా ఎదుగుదామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఫణీంద్రకుమార్, వ్యవస్థాపకులు నారాయణరావు, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి మాధవరావు పాల్గొన్నారు.

మడకశిరకు పారిశ్రామికవాడ

- ఏపీ సీఎం అభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తున్నారు: కుమారస్వామి



కేంద్రమంత్రి కుమారస్వామితో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి భరోసా ఇచ్చారు. బెంగళూరు నగరలోని జేడీఎస్ కార్యాలయంలో శనివారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఏపీ, కర్ణాటక సరిహద్దులోని వెనుకబడిన శిర, మధుగిరి, హిరియూరు, పావగడ, మడకశిర ప్రజలకు అనుకూలంగా ఉండేలా పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి, ఉద్యోగాలు మెరుగవుతాయన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు అభివృద్ధి లక్ష్యం కలిగినవారని, విశాఖ ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 12 ఏళ్ల పాటు లాభాల బాటలో సాగిన విశాఖ ఉక్కు ప్రస్తుతం నష్టాల్లోకి చేరిందని, పరిశ్రమకు పునర్వైభవం తీసుకొస్తామని చెప్పారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రఘువర్మ: ఏపీటీఎఫ్

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేరును ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ప్రకటించింది. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల నేతృత్వంలో శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం ఈమేరకు ప్రకటన చేసింది. గత ప్రభుత్వంలో విద్యారంగంలో జరిగిన సంక్షోభాలు, సమస్యల పరిష్కారం జరగాలంటే ఏపీటీఎఫ్ గెలుపు అనివార్యమని పేర్కొంది.

సరియా జలపాతం వద్ద ఇద్దరు గల్లంతు

అనంతగిరి/దేవరాపల్లి, సెప్టెంబరు 14: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో ఉన్న సరియా జలపాతంలో శనివారం సాయంత్రం ఇద్దరు పర్యాటకులు గల్లంతయ్యారు. విజయనగరం బాబామెట్టకు చెందిన లంకా సాయికుమార్ (32) ఇద్దరు స్నేహితులతో కలిసి జలపాతాన్ని తిలకించేందుకు వచ్చాడు. సాయికుమార్ జలపాతం వద్ద స్నానం చేస్తూ లోతైన ప్రదేశంలో మునిగిపోతుండడంతో విశాఖకు చెందిన దీపక్ కుమార్ (27) రక్షించేందుకు యత్నించాడు. అందరూ చూస్తుండగా ఇద్దరూ జలపాతంలో గల్లంతయ్యారు. ఈ ఘటనపై అనంతగిరి పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సాయికుమార్ పైడిభీమవరం ప్రాంతంలోని ఒక ప్రైవేటు కంపెనీలో, దీపక్ నేవీలో పనిచేస్తున్నట్టు చెబుతున్నారు. కాగా.. సరియా జలపాతం మృత్యుకుహరంగా మారింది. ఇప్పటివరకూ సుమారు 40 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు.

నా అనేవారు లేక తండ్రీకొడుకు బలవన్మరణం

- బంధువులు రాకపోవడంతో ఖననం చేసిన పూనూరు గ్రామస్థులు

యద్దనపూడి (మార్టూరు), సెప్టెంబరు 14: వయస్సు మీద పడి ఒకరు, తీవ్ర అనారోగ్యంతో మరొకరు.. పలకరించే బంధువులు, స్నేహితులు ఎవరూ లేరు! ఇక జీవించడం ఎందుకులే అనుకున్నారో ఏమో.. తండ్రీ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పూనూరులో శనివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు(85), ఆయన కుమారుడు సుధాకర్ (59) అద్దె ఇంట్లో ఉంటున్నారు. సుధాకర్ తల్లి గతంలోనే చనిపోగా, భార్య కొన్ని కారణాలతో పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో కొన్ని సంవత్సరాలుగా తండ్రీకొడుకు మాత్రమే ఉంటున్నారు. వెంకటేశ్వర్లు వయోభారంతో పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్నారు. సుధాకర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. అదే సమయంలో మద్యానికి బానిసయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల సమయంలో వారి ఇంట్లో అలికిడి లేకపోవడంతో అనుమానంతో ఇరుగుపొరుగువారు తలుపులు తెరిచి చూశారు. వారికి తండ్రీకొడుకు ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. వారి పక్కనే రెండు మద్యం సీసాలు, పురుగుమందు డబ్బా ఉండడంతో వారిద్దరూ పురుగుమందును మద్యంలో కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకొని ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు. అనంతరం సుధాకర్ భార్య తరపు వారికి కబురుచేశారు. వారెవ్వరూ రాకపోవడంతో గ్రామస్థులే మృతదేహాలను శ్మశానవాటికకు తరలించి ఖననం చేయించారు.

ఒక్క రోజే 45,989 కేసుల పరిష్కారం

- లోక్ అదాలత్‌లకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన



లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చిన దంపతులను అభినందిస్తున్న జస్టిస్ జి.నరేందర్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే 45,989 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీ ద్వారా మొత్తం రూ.64.72 కోట్లను పరిహారంగా అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరి మార్గదర్శకంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో 377 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. మరోవైపు ఏపీ హైకోర్టు న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న 175 కేసులు పరిష్కరించి రూ. 2.90 కోట్ల పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌ల విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

దంపతులను కలిపిన లోక్ అదాలత్..

విభేదాలతో విడివిడిగా ఉంటున్న దంపతులను లోక్ అదాలత్ కలిపింది. విజయవాడకు చెందిన వీరికి 2008లో వివాహమైంది. ఇద్దరు ఆడపిల్లలు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య 2022లో పటమట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. తాజాగా కేసు పరిష్కారం కోసం ఇరువురు లోక్‌అదాలత్‌ను ఆశ్రయించడంతో విడాకుల వల్ల ఎదురయ్యే సమస్యలను మధ్యవర్తులు వివరించి రాజీ కుదిర్చారు. ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్ రాజీపత్రం అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్(అడ్మిన్) శ్రీనివాసశర్మ, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి మాలతి, కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉపకార్యదర్శి అమరరంగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఏజీకి సహాయకులుగా జీపీలు, ఏజీపీల నియామకం

హైకోర్టులో అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివప్రతాప్‌కు ఆయా కేసుల్లో సహాయసహకారాలు అందించేందుకు పలువురు ప్రభుత్వ న్యాయవాదులు, ప్రభుత్వ సహాయ న్యాయవాదులను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొండవీటి కీర్తితేజ, ఎం.డిల్లీబాబులను జీపీలుగా, ఆకుల వెంకటసాయి జగదీష్, ఆర్. వెంకట సురేంద్రనాథ్ వర్మను ఏజీపీలుగా నియమించింది.

పువర్తి పోలీసు క్యాంపుపై మావోయిస్టుల మెరుపు దాడి

- గ్రెనైడ్లు, తుపాకులతో విరుచుకుపడ్డ వైనం
- సుక్మా జిల్లా జేగురుగొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

చింతూరు, సెప్టెంబరు 14: పువర్తి పోలీసు క్యాంపుపై మావోయిస్టులు మెరుపు దాడికి దిగారు. గ్రెనైడ్ లాంచర్లతో విరుచుకుపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడితో ఉలిక్కిపడ్డ జవాన్లు తేరుకుని ఎదురు కాల్పులకు దిగారు. ఈ దాడిలో ఇరుపక్షాలకూ ఎలాంటి నష్టమూ జరగలేదని సమాచారం. ఛత్తీస్‌గఢ్, సుక్మా జిల్లా, జేగురుగొండ పోలీసుస్టేషన్ పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలోని గ్రామం పువర్తి. యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా ఈ మధ్య కాలంలో ఇక్కడ క్యాంపు ఏర్పాటు చేశారు. దీనిలో 500 మంది వరకూ జవాన్లు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి మొదలైన కాల్పులు సుమారు రెండు గంటలపాటు జరిగినట్లు సమాచారం. పువర్తి పోలీసు క్యాంపు సమీపానికి మావోయిస్టులు భారీగా తరలివచ్చినట్లు తెలుస్తోంది. అన్ని దిక్కుల నుంచీ చుట్టుముట్టిన మావోయిస్టులు ఏకకాలంలో ఆయుధాలతో దాడికి దిగారు. ముందుగా యూబీజీఎల్ (అండర్ బారెల్ గ్రెనైడ్ లాంచర్)లతో దాడికి పాల్పడి ఆ తరువాత కాల్పులకు దిగినట్టు అక్కడ లభించిన ఆనవాళ్లు స్పష్టం చేస్తున్నాయి. సుమారు 15 నుంచి 20 రౌండ్ల కాల్పుల అనంతరం మావోయిస్టులు వెనక్కి మళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు.

పువర్తి ప్రత్యేకత



పువర్తిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా తల్లితో మాట్లాడుతున్న జవాన్లు (ఫైల్)

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మా స్వగ్రామం పువర్తి. ఈ గ్రామంలో కూరగాయల సాగు, పాఠశాలల నిర్వహణ, వైద్య సేవలు వంటివన్నీ మావోయిస్టుల నిర్వహణలోనే ఉండేవి. హిడ్మా నేతృత్వంలో వ్యూహాలు రచించేందుకుగాను అక్కడ ఓ కుటీరం కూడా ఏర్పాటు చేశారు. గడచిన 40 ఏళ్లలో ఆ గ్రామంలో జాతీయ జెండా ఎగురవేసే సాహసమే ఎవరూ చేయలేదు. అంతటి పట్టు ఉన్న పువర్తి గ్రామానికి యాంటి నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో జవాన్లు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆ సమయంలో హిడ్మా తల్లితో మాట్లాడిన జవాన్లు ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. చికిత్స అందించారు. మావోయిస్టులు నిర్మించిన కుటీరాన్ని స్వాధీనం చేసుకొని అక్కడే అత్యంత పటిష్ఠంగా క్యాంపును ఏర్పాటు చేశారు. జాతీయ జెండా ఎగురవేశారు. యాంటి నక్సల్స్ ఆపరేషన్లు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు ఆ క్యాంపుపై దాడికి దిగడం గమనార్హం. దీంతో ఆ ప్రాంతంలో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఏసీఎం కోసా మృతి

ఛత్తీస్‌గఢ్, సుక్మా జిల్లా తమల్వాడ్ అటవీ ప్రాంతంలో శనివారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు ఒకరు మృతి చెందారు. చింతగుప అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారంతో జవాన్లు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కుంట ఏరియా కమిటీ సభ్యుడు కోసా అని పోలీసులు తెలిపారు. ఆయన తలపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృత దేహంతోపాటు పేలుడు సామగ్రి, వైర్‌లెస్ సెట్, తుపాకీ తదితర సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలను, జీవన ప్రమాణాలను పెంచాలి. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గే విధానాలను అవలంబించాలి. అవినీతి నిర్మూలన నిజాయితీగా జరగాలి. దృఢ సంకల్పంతో సమ్మిళిత అభివృద్ధికి పాటుపడితేనే.. దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామానికి అర్థం, పరమార్థం ఉంటుంది.

సంపన్న భారత్‌లో.. పెరుగుతున్న పేదరికం

రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉన్న 1985–89 మధ్య కాలంలో దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపిస్తున్నట్లు తరచుగా చెప్పేవారు. దీనిపై అప్పట్లో ఓ ప్రముఖ దిన పత్రిక ఓ వ్యంగ్య కార్టూన్ ప్రచురించింది. ప్రధాని రాజీవ్ గాంధీ కొంతమందిని వెంటబెట్టుకొని ఓ ప్రదేశానికి వెళతారు. అక్కడో వృద్ధుడు మినహా అంతా ఖాళీగా, నిర్మానుష్యంగా ఉంటుంది. రాజీవ్‌గాంధీ ఆశ్చర్యంగా 'ఇక్కడెవరూ లేరేమిటి? ఎక్కడికి వెళ్లారు?' అని అడుగుతారు. అప్పుడా వృద్ధుడు.. 'మీరు చాలా ఆలస్యం చేశారు.. అందరూ 22వ శతాబ్దంలోకి వెళ్లిపోయారు' అని సమాధానం ఇస్తాడు.

అభివృద్ధిపథంలో భారత్ వేగంగా అడుగులు వేస్తూ ఉండొచ్చు.. కానీ, ప్రపంచంలోని చాలా దేశాలు మనకంటే వడివడిగా దూసుకుపోవడం అన్నది ఓ వాస్తవం. అప్పుడు రాజీవ్‌గాంధీ విషయంలోనైనా, ఇపుడు ప్రధాని నరేంద్ర మోదీ కాలంలోనైనా జరుగుతున్నది ఇదే. రాజకీయ నాయకులు సహజంగానే ఆకర్షణీయమైన నినాదాలు ఇస్తుంటారు. ప్రజలలో స్ఫూర్తి రగిలించడానికి అవి అవసరం. కానీ, వాస్తవాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నప్పుడు ప్రజలను ఏమార్చడం సాధ్యం కాదు. భారత్ త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాని పదే పదే నమ్మకంగా చెబుతున్నారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన 2014 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ 10వ స్థానంలో ఉంది. దశాబ్దకాలంలో 3.7 ట్రిలియన్ల డాలర్లతో 5వ స్థానానికి చేరుకొన్నమాట నిజమే. అయితే, ఆర్థిక గణాంకాలు దేశ వాస్తవ ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తాయా అన్నదే ప్రశ్న. ఇటీవల 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్–2024' ప్రకటించిన తాజా నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశంలో 534 మంది బిలియనీర్లు ఉన్నారు. ఒక్క ఏడాది



వ్యవధిలోనే భారతదేశంలో 75 మంది బిలియనీర్లు పెరిగారు. దేశంలో రూ.1000 కోట్లు పైబడి సంపద ఉన్న వారి సంఖ్య 1,539. ఇందులో 5,000 కోట్ల సంపద గలిగిన వారు 534. కాగా, నల్లధనాన్ని పరిగణనలోకి తీసుకొంటే, అనధికార లెక్కల ప్రకారం దేశంలో రూ.1000 కోట్లు సంపద గలిగినవారి సంఖ్య 5,000 దాటుతుంది. ఇందులో రియల్టర్లు, పారిశ్రామికవేత్తలు, సినీనటులు, స్టార్టప్ ప్రమోటర్లు.. ఇలా 20 రంగాలకు చెందిన వారున్నట్లు 'హురున్ ఇండియా' నివేదిక తెలిపింది.

ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు దేశం ఆర్థికంగా బలోపేతం అయినట్లు కనబడుతుంది. దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నకొద్దీ.. దేశ ప్రజల తలసరి ఆదాయం అదే దామాషాలో పెరుగుతుంది. గత దశాబ్ద కాలంలో భారత్ తలసరి ఆదాయం 95శాతం పెరిగినట్లు ఐఎంఎఫ్ నివేదిక తెలిపింది. 2014లో 5,187 డాలర్లుగా ఉన్న భారత్ తలసరి ఆదాయం 2024 మార్చి చివరి నాటికి 10,123 డాలర్లకు పెరిగింది. ఈ గణాంకాల ప్రకారం అదానీ, అంబానీ తదితర దేశ బిలియనీర్ల సగటు తలసరి ఆదాయం 10,123 డాలర్లుగా లెక్కిస్తే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, దేశంలో 143 కోట్ల మందిలో 30శాతంగా ఉన్న పేదల సగటు ఆదాయం అంతే ఉందని చెప్పినపుడు కూడా నవ్వు కాదు, బాధ కలుగుతుంది.

2030 నాటికి 7 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తే మంచిదే. కానీ, ఒకవైపు సంపద పెరుగుతున్నా దేశంలో పేదరికం పెరగడం చూసినపుడు మనం అనుసరిస్తున్న విధానాలలో ఎంత లోపం ఉన్నదో అర్థమవుతున్నది. 2022 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 191 దేశాల జాబితాలో భారత్ స్థానం 127. దేశంలో ప్రజల మధ్య పెరిగిపోతున్న ఆర్థిక అంతరాలను, పేదరికాన్ని తగ్గించనంతవరకు.. దేశం ఆర్థిక ప్రబలశక్తిగా ఎదిగినా ప్రయోజనమేమీ ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకొనే రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు.. భారతదేశం మూడవ ఆర్థికశక్తిగా రూపాంతరం చెందినా పేద దేశంగానే ఉంటుందని తేటతెల్లం చేశారు. అలాగే బ్రిక్స్, జీ–20 దేశాలన్నింటిలోను భారత్ పేద దేశంగా ఉందని ఆర్థికరంగ నిపుణులు పేర్కొంటున్నారు. 143 కోట్ల జనాభా గల భారత్‌లో వస్తు, ఆహార వినిమయం అధికం కనుక సహజంగానే ఆర్థిక వ్యవస్థ పెద్దదిగా ఉంటుంది.

ఇక, దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గాలంటే.. పేద, మధ్య తరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడిన వ్యవసాయం, ఉత్పత్తిరంగాలు, అసంఘటిత రంగాలలో ఆదాయాలు పెరగాలి. ఆదాయాలు పెరిగితేనే పేదరికం తగ్గుతుంది. మరి ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయా? ప్రస్తుతం దేశంలో ఏటా సగటున 330 మిలియన్ల టన్నుల ఆహారధాన్యాలు పండుతున్నాయి. ఇందులో వరి, గోధుమ 80శాతం ఆక్రమిస్తున్నాయి. ఈ రెండు పంటలు పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. అంటే, 80శాతం రైతాంగం ఆదాయం పెరగకపోగా.. నష్టాలతోనే సాగు చేస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

అభివృద్ధి చెందిన అమెరికా, చైనాలతోపాటు ఫ్రాన్స్, బ్రెజిల్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో సేవల రంగంతో పాటు ఉత్పత్తి రంగం సమాంతరంగా అభివృద్ధి చెందుతుండగా, భారత్‌లో ఉత్పత్తి రంగం వాటా 2023 నాటికి జీడీపీలో 17శాతంకు పడిపోయింది. కానీ, సేవల రంగం మాత్రం 55శాతంకు విస్తరించింది. అయితే, కోవిడ్ కాలంలో మూడేళ్లపాటు సేవల రంగం కుదేలయింది. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసి సేవలరంగాన్ని నమ్ముకొంటే.. జరిగే అనర్థాలేమిటో తెలిసొచ్చినా.. ఉత్పత్తి రంగాన్ని పునరుజ్జీవింపజేసే చర్యలు చెప్పుకోదగ్గవిగా లేవు. ముఖ్యంగా దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల్ని బతికించుకొంటే తప్ప.. దానిపై ఆధారపడిన ప్రజల ఆదాయాలు మెరుగుపడవు.

ఇక, దేశంలో 40శాతంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగకల్పన ద్వారానే వారి ఆదాయాల్ని మెరుగుపర్చడం సాధ్యపడుతుంది. నూతనంగా ఉద్యోగాలను సృష్టించే రంగాలకు ఊతం ఇవ్వడంతోపాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఉద్యోగులకు ఇచ్చే జీతభత్యాలు భారం అవుతుందనే ఉద్దేశంతో ఖాళీలు భర్తీ చేయకపోతే, ప్రజలకు అందే సేవలు నాసిరకంగా ఉంటాయి. ఇప్పటికే విద్య, వైద్యం వంటి కీలకరంగాలలో తగినంత మంది సిబ్బందిలేక ప్రజలు ఖరీదైన ప్రైవేటు రంగ సేవలు వినియోగించుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా, ఉపాధిరంగంలో అవకాశాలు పొందడానికి యువతకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడం ఎంతో ముఖ్యం. తగిన నైపుణ్యాలు లేనందువల్ల తక్కువ వేతనంతో పనిచేయించుకొంటున్న పరిస్థితి దేశంలోని అన్ని రంగాలలో కనబడుతుంది. నైపుణ్యలేమి వల్ల యువత తీవ్రంగా నష్టపోతున్నారు. అరకొర ఆదాయం అందే ఉద్యోగాలతో సరిపెట్టుకొంటున్నారు. నైపుణ్యాలను అందించే శిక్షణ కార్యక్రమాలు దేశమంతటా అందుబాటులోకి వస్తే.. యువతకు మేలు జరిగి, వారి ఆదాయాలు మెరుగవుతాయి.

2030 నాటికి భారత్ 7 ట్రిలియన్ల వ్యవస్థగా మారుతున్నదని ఘనమైన అంచనా వేస్తున్నారుగానీ, ఈ ఆరేళ్లలో జనాభా పెరుగుదల ఎంత ఉంటుంది? పెరుగుతున్న జనాభాకు ఉపాధి రంగాలలో ఎన్ని ఉద్యోగాలు అవసరం అవుతాయి? అందుకు అనుగుణంగా ఎటువంటి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి? అనే అంశాలపై దృష్టి పెట్టాలి. ఇటీవల భారత్‌లో పర్యటించిన ఐఎంఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ గీతా గోపీనాథ్ తెలిపిన అంచనా ప్రకారం 2030 నాటికి భారత్‌లో కొత్తగా 14.8 కోట్ల ఉద్యోగాలను కల్పించాలి.

ప్రజల ఆదాయాలు మెరుగుపడితేనే ఆర్థిక అంతరాలు తగ్గుతాయి. అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించే నమూనా అదే. అభివృద్ధి చెందిన దేశాలలో అసంఘటిత రంగంలో కూడా ఉద్యోగులకు మెరుగైన జీతభత్యాలను పటిష్ఠవంతమైన కార్మికచట్టాల ద్వారా అమలు చేస్తున్నారు.

ఇక, దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతి.. అభివృద్ధి ఫలాలను ప్రజలకు దూరం చేస్తోంది. గత ఐదేళ్లలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు లక్షన్నర కోట్ల ప్రజా సంపదను నాటి పాలకులు కొల్లగొట్టారన్న వాస్తవాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. సహజ వనరులు దుర్వినియోగం అయితే దేశ సంపద పెరగదు. ప్రధాని నరేంద్రమోదీ గత పదేళ్లలో చాలావరకు అవినీతిని అరికట్టగలిగారు. అయితే దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలను, జీవన ప్రమాణాలను పెంచాలి. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గే విధానాలను అవలంబించాలి. అవినీతి నిర్మూలన నిజాయితీగా జరగాలి. దృఢ సంకల్పంతో సమ్మిళిత అభివృద్ధికి పాటుపడితేనే.. పెరిగే దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామానికి అర్థం, పరమార్థం ఉంటుంది. లేకుంటే దేశంలో సంపదా పెరుగుతుందీ, పేదరికమూ పెరుగుతుంది.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

సంపూర్ణ భారతీయ జ్ఞాని

నేను అమితంగా అభిమానించే భారతీయ విద్వజ్జుడు ప్రొఫెసర్ ఆంద్రే బెతెయిల్. నేడు ఆ గురు శ్రేష్ఠుని 90వ పుట్టిన రోజు. బెంగాల్‌లో పుట్టి పెరిగిన బెతెయిల్ కలకత్తా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసమనంతరం ఢిల్లీకి వచ్చి, తదాది అక్కడే నివసిస్తున్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఢిల్లీ విశ్వవిద్యాలయ సామాజికశాస్త్ర విభాగంలో బోధకుడుగా ఉన్నారు. అనేక పుస్తకాలు రాయడంతో పాటు వార్తా పత్రికలలో మరెన్నో వ్యాసాలు రాశారు. విశ్రాంత జీవితంలోకి ప్రవేశించిన తరువాత అశోకా యూనివర్శిటీ తొలి ఛాన్సలర్‌గా ఉన్నత విద్యా రంగానికి విశిష్ట సేవలు అందించారు. అనితరసాధ్యమైన వైదుష్యంతో కూడిన పుస్తకాలు వెలయించడాన్ని కొనసాగిస్తూ తన యవ్వనకాల సమ్మోహక స్మృతులు, విద్యాభ్యాస విజ్ఞానదాయక అనుభవాల గురించి ఒక స్ఫూర్తిదాయక స్వీయ చరిత్రాత్మక కథనాన్ని కూడా మనకు అందించారు.

ఆంద్రే బెతెయిల్ సగం ఫ్రెంచ్, సగం బెంగాలీ, సర్వ సంపూర్ణంగా భారతీయుడు. బెంగాలీ మేధావులకు అరుదైన రీతిలో ఆయన తన దేశాన్ని ప్రేమించారు. కొత్త భావాలు, ఇతర సంస్కృతులు, భిన్న ప్రజల గురించి తెలుసుకోవడంలో బెంగాలీలు ఆసక్తి చూపకపోరు. అయితే ఇతర దేశాలు, ప్రజల జీవన సంస్కృతులలో వారు తమకు తాముగా ఆసక్తి చూపినప్పుడు, అది సాధారణంగా తోటి భారతీయుల గురించి మాత్రం అయివుండదు. ప్రముఖ బెంగాలీలు అందరూ రెండు జాతీయతలు ఉన్నవారేనని నేను ఇదే కాలమ్‌లో ఒకప్పుడు ఛలోక్తి విసిరాను. నీరద్ సి చౌధురి బెంగాలీ, ఆంగ్లేయుడు; సత్యజిత్ రే బెంగాలీ, ఫ్రెంచ్; జ్యోతి బసు బెంగాలీ, రష్యన్; చారు మజుందార్ బెంగాలీ, చైనీస్. ఈ హాస్యోక్తికి ఇలా ముక్తాయింపు నిచ్చాను : బెంగాలీ, భారతీయుడు రెండూ అయిన చివరి విఖ్యాత బెంగాలీ బహుశా రవీంద్రనాథ్ టాగోరే కావచ్చు.

రవీంద్రుడు వలే బెతెయిల్ కూడా విశాల ప్రపంచం, ఇతర భారతీయుల గురించి కూడా తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న విద్వజ్జుడు. ఆయన తన డాక్టొరల్ క్షేత్ర పరిశోధనను తమిళనాడు నడిబొడ్డున ఉన్న తంజావూరులో చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో పరిశోధన చేసిన వారిలో ముంబైకి చెందిన బెంగాలీ, జంషెడ్‌పూర్ నుంచి వచ్చిన తమిళుడు, లద్దాఖ్‌లో పనిచేసిన కన్నడిగుడు, కర్ణాటక వాసి అయిన పంజాబీ మొదలైనవారు ఉన్నారు. మార్క్స్, వెబర్‌ను ఆయన సమగ్రంగా అధ్యయనం చేశారు. అలాగే ఈవాన్స్–ప్రిట్చర్డ్, లెవి స్ట్రాస్‌ను బాగా ఆకళింపు చేసుకున్నారు. నెహ్రూ, అంబేడ్కర్‌ను నిశితంగా చదివారు. నా పుస్తకం 'Democrats and Dissenters'లో సామాజిక శాస్త్రంలో బెతెయిల్ వైదుష్యం గురించి వివరంగా రాశాను. ఆయన పరిశోధనల ప్రాశస్త్యాన్ని వివరించాను. ఆయనతో నా వ్యక్తిగత, మేధో అనుబంధం గురించి రాసేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను.

బెతెయిల్‌ను నేను మొట్టమొదట 1988లో కలిశాను. తదాది మా మధ్య సంబంధాలు సన్నిహితంగా కొనసాగుతున్నాయి. ఆయన రచనలు, మా సంభాషణలు నా ఆలోచనలు, మేధో దృక్పథాన్ని తీర్చిదిద్దాయి. 'భారతీయ ప్రాజ్ఞుడు'గా బెతెయిల్‌ను నేను ఒకసారి అభివర్ణించాను. అది నేను ఆయన గురించి నిరాలోచనగా ఏర్పరచుకున్న అభిప్రాయం. పదప్రయోగం సైతం రెండు హెచ్చరికలు చేస్తుంది: భారత్‌లో ఒక ప్రాజ్ఞురాలు కూడా ఉండవచ్చు; ప్రాజ్ఞుడైన భారతీయుడు ఒకరు విదేశాల్లో నివసిస్తుండవచ్చు. బెతెయిల్ పట్ల నా గౌరవాభిమానాలు స్వతస్సిద్ధమైనవి. మరి ఆయన నాపట్ల ఎందుకు అంత ప్రేమాస్పదంగా ప్రతిస్పందించారు? బహుశా, నా మేధో ప్రస్థానం ఆయనకు పూర్తిగా భిన్నమైనది కావడం వల్లేనని అనుకుంటున్నాను. మేము మొదటిసారి కలుసుకున్నప్పుడే ఆయన అప్పుడున్న ఉద్యోగంలోనే మూడు దశాబ్దాలు ముగించుకున్నారు. నేను అప్పటికి ఏడు సంవత్సరాలలో నాలుగో ఉద్యోగంలో ఉన్నాను. నేను చాలా ఉద్విగ్నుడినయ్యాను, లెక్కలేనితనంతో అభిప్రాయాలు వ్యక్తం చేసేవాణ్ణి. ఆయన చాలా ప్రశాంతంగా ఉండేవారు. స్థితప్రజ్ఞుడు. ఒక ప్రశ్నను బహుముఖంగా తరచిచూసి తన అభిప్రాయాన్ని తెలిపేవారు. సహచరులతో వాదోపవాదాలు చేసే స్వభావం నాది. రచనల్లో గానీ, సంభాషణల్లో గానీ ఆయన సదా సంయమనం చూపేవారు.

ఇప్పటికి చాలా సంవత్సరాలుగా నా పుస్తకాలలో బెతెయిల్ ప్రచురిత రచనలను ప్రస్తావిస్తున్నాను; నా కాలమ్స్‌లోను, ప్రసంగాలలోను మా సంభాషణల నుంచి ఉటంకింపులు చేస్తున్నాను. నెహ్రూ మరణానంతర మాన్యత బైబిల్ ప్రవచించిన ఒక సుప్రసిద్ధ సూక్తిని తలకిందులు చేసిందని ఆయన ఒకసారి నాకు చెప్పారు. తండ్రి పాపాలు అతడి పిల్లలకు, వారి సంతానానికి చుట్టుకుంటాయన్నది బైబిల్ సుభాషితం. అయితే నెహ్రూ విషయంలో కుమార్తె, మనవడి పాపాలు ఆయన్ని చుట్టుకున్నాయి! మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య నిర్మాణానికి నెహ్రూ అందించిన మహోన్నత సేవలు, ఆయన కుటుంబ వారసుల రాజకీయాల మూలంగా అర్థరహితమయి, భ్రష్టత్వం పాలయ్యాయన్నది బెతెయిల్ వ్యాఖ్యకు అర్థం. ఆయన చేసిన ఈ వివేకశీల, నిశిత వ్యాఖ్యను నేను ఇప్పటికి కనీసం డజన్‌కు పైగా నా బహిరంగ ఉపన్యాసాలలో ఉటంకించాను, ప్రతిసారీ దాని కర్తృత్వాన్ని బెతెయిల్‌కు ఆపాదిస్తూనే సుమా!



■ రామచంద్ర గుహ



> **ఆంద్రే బెతెయిల్ సగం ఫ్రెంచ్, సగం బెంగాలీ, సర్వ సంపూర్ణంగా భారతీయుడు. దేశ రాజధానిలో దశాబ్దాలుగా నివసిస్తున్న బెతెయిల్ ఢిల్లీలోని ఇతర మేధావుల మాదిరిగా అధికార ప్రాభవ ప్రాబల్యాలు ఉన్న వ్యక్తులతో పరిచయాలకు ఏ మాత్రం ఆరాటపడరు. పరిశోధన, రచన, బోధన మాత్రమే తన విధ్యుక్తధర్మంగా భావిస్తారు. తనకుతాను ఏదో ఒక రీతిలో రాజగురుగా చెలామణి అయ్యేందుకు ప్రయత్నించరు. ఏ అమాత్యుడికి గానీ లేదా ప్రతిపక్ష నాయకుడికి గానీ సలహాలు ఇచ్చేందుకు ఉబలాటపడరు.**

సామాజిక శాస్త్రంలో అపార వైదుష్యం, పరిశోధనానుభవం నిర్దిష్ట ప్రభుత్వ విధానాలను సహేతుకంగా విమర్శించగల సాధికారతను ఆయనకు సమకూర్చాయి. అయితే బెతెయిల్ ఎప్పుడూ తన సొంత ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించలేదు. అర్థశాస్త్ర స్వభావం దృష్ట్యా ఆర్థికవేత్తలు విధాన రూపకల్పనలోను, విధాన నిర్దేశంలోను చురుగ్గా పాల్గొంటున్నారు. కొంత మంది సమాజ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు కూడా ఆర్థికవేత్తల వలే వ్యవహరించేందుకు ఆరాటపడుతున్నారు. అధికారంలో ఉన్న, లేని రాజకీయవేత్తల మద్దతుతో తమ ప్రత్యామ్నాయ విధానాలను నిర్దేశిస్తున్నారు. ఇటువంటి వ్యవహారాలకు బెతెయిల్ చాలా దూరం. అప్పుడప్పుడు విధాన విశ్లేషణలో పాల్గొన్నా ఎప్పుడూ ఏ విధంగాను విధాన నిర్దేశానికి ఆయన పూనుకోనే పూనుకోరు.

బెతెయిల్ దశాబ్దాలుగా దేశ రాజధానిలో నివశిస్తున్నారు. అయితే ఢిల్లీ వాసులు అయిన ఇతర మేధావుల మాదిరిగా అధికార ప్రాభవ ప్రాబల్యాలు ఉన్న వ్యక్తులతో పరిచయాలకు, వారిని ప్రభావితం చేసేందుకు ఆయన ఏ మాత్రం ఆరాటపడరు. పరిశోధన, రచన, బోధన మాత్రమే తన విధ్యుక్త ధర్మంగా భావించేవారు, పాటించేవారు. తనకుతాను ఏదో ఒక రీతిలో రాజగురుగా చెలామణి అయ్యేందుకు ప్రయత్నించరు. ఏ అమాత్యుడికి గానీ లేదా ప్రతిపక్ష నాయకుడికి గానీ సలహాలు ఇచ్చేందుకు ఉబలాటపడరు.

బెతెయిల్ తన స్వభావరీత్యా నేను ప్రజా రంగంలో మితిమీరిన స్థాయిలో చురుగ్గా ఉంటున్నానని భావించేవారు. నిత్యం ఉపన్యాసాలు వెలువరిస్తున్నానని, టీవీ కార్యక్రమాలలో కనిపిస్తున్నానని, నిష్ఫల వివాదాల్లో పాల్గొంటున్నానని ఆయన అనేవారు. 2012 వేసవిలో నేను ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాను. నెలల తరబడి పడక మీదే గడపాల్సివచ్చింది. ఇది తెలిసిన బెతెయిల్ నాకు ఒక లేఖ రాశారు : 'నీ ప్రమాద ఘటన ఒక ఊహించని మేలు అని భావిస్తున్నాను. నీ బాధాకర పరిస్థితి నీ రచనా వ్యాసంగాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని నేను అనుకోవడం లేదు. నిజానికి అదొక ప్రయోజనకర లబ్ధి. నీ సన్నిహిత బంధువు (ఆర్థిక చరిత్రవేత్త ధర్మకుమార్) నాతో తరచు మీకు మేధో క్రమశిక్షణ బాగా ఉన్నదిగానీ భావనాశక్తి తక్కువగా ఉన్నదని అంటుండేవారు. నీకు నీ చింతన, రచనలో మరింత క్రమశిక్షణ అవసరమని నేను నిజంగా భావిస్తున్నాను. మరి ఒకచోట స్థిమితంగా కూర్చున్నప్పుడే చింతన, రచన సుసాధ్యమవుతాయి'.

ఇప్పుడు ఆయనకు నేను రాసిన ఒక లేఖ నుంచి ఉటంకింపు చేస్తాను : 'బీబీసీ విలేఖరిగా వృత్తి జీవితమంతా ఉపఖండంలో గడిపిన మార్క్ టుల్లీని కొన్ని సంవత్సరాల క్రితం బెంగళూరులో కలిశాను. మీకు ఆంద్రే బెతెయిల్ తెలుసా అని ఆయన నన్ను అడిగారు బెతెయిల్‌ను తాను ఒకసారి బీబీసీ కోసం ఇంటర్వ్యూ చేశానని చెప్పారు. నిజమైన విద్వజ్జుడుగా మిమ్ములను టుల్లీ గుర్తు చేసుకున్నారు. రేడియో జర్నలిజం ప్రింట్ జర్నలిజం కంటే తక్కువ స్థాయికి చెందినదని, ప్రింట్ జర్నలిజం విద్యావిషయిక విద్వత్ వ్యాసంగం కంటే అధమ స్థాయికి చెందినదనేది మీ అభిప్రాయమని టుల్లీ చెప్పారు. ఈ రెండు విషయాలలోను మీ అభిప్రాయం సరైనదని అనడానికి నేను సంకోచించను'.

బెతెయిల్‌కు ఒకే ఒక్క అధ్యయన అంశం ఉన్నదని ఆయన విమర్శకులు అనడం కద్దు. అయితే అది చాలా విశాలమైనది, బహుశా చాలా ముఖ్యమైనది కూడా. సామాజిక అసమానతలే ఆ అధ్యయన అంశం. ఒక తమిళ గ్రామంలో కుల వ్యవస్థ గురించి, వ్యవసాయ రంగంలో వర్గ నిర్మాణం గురించి, ప్రాచ్య పాశ్చాత్య దేశాలలోని అసమానతల తుల్య విశ్లేషణ, వెనుకబడిన వర్గాల ఉత్థానం, సామాజిక న్యాయ డిమాండ్లు– సంస్థల న్యాయవర్తన గురించి విస్తారంగా రాశారు సామాజిక స్తరీకరణను కేవలం ఆర్థిక కారకాల ప్రాతిపదికన కాకుండా సాంఘిక హోదా ప్రాముఖ్యత, అధికార ప్రభావశీలత కోణాల నుంచి కూడా ఆయన పరిశీలించారు. బెతెయిల్ రచనలకు శాశ్వతమైన ప్రాసంగికత ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

(నేడు ఆంద్రే బెతెయిల్ 90 వ పుట్టిన రోజు)

ఎలుక కాదు, ఎలుగు!

'ఎలుక తోలు తెచ్చి యేడాది ఉతికినా
నలుపు నలుపే గాని తెలుపు రాదు'

అని ప్రారంభమయ్యే పద్యం 'వేమన శతకం'లో చాలా ప్రసిద్ధి చెందిన పద్యాలలో ఒకటి. పుట్టుకతో వచ్చిన సహజమైన చెడు గుణం, లేదా శారీరకమైన అవలక్షణాన్ని వదిలించాలని ఎంత కష్టపడి ప్రయత్నించినప్పటికీ అది వదిలేది కాదు అనే అర్థంలో ఈ పద్యం చెప్పబడింది. చెప్పదలుచుకున్న లోకనీతి, వివేకవంతమైన మంచి విషయం పిల్లలకు (పెద్దలకు కూడా!) సులభంగా అర్థం కావాలనే ఉద్దేశంతో ఇలాంటి పోలికలు చేసి పద్యంగా మలచడం జరిగిందని అనుకున్నప్పటికీ, ఇందులో పోలిక కోసం తీసుకున్న 'ఎలుక తోలు' నిజానికి వేమన ఉద్దేశించినది కాదని పూర్వులు వ్రాసి పెట్టుకున్న తాళపత్ర పుస్తకాలలోని పద్యాన్ని చూసినప్పుడు అర్థమౌతుంది. ఏనాటిదో తెలియని ఒక తాళపత్ర పుస్తకంలో ఈ పద్యానికి పాఠం ఇలా ఉంది:



ఆ. ఎలుగు తోలు తెచ్చి యందాక నుతికిన
నలుపు గాక యేల తెలుపు గలుగు
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన గుణియౌనె
విశ్వదాభిరామ వినురవేమ!

ఉతకడం అనే క్రియకు సరిపోయేదిగా వేమన 'ఎలుక తోలు' అనే మాట కంటె 'ఎలుగు తోలు' అనగా ఎలుగుబంటి చర్మాన్ని ఉదాహరణగా చేసుకుని చెప్పాడని ఊహించడానికి పెద్దగా సందేహించనక్కర లేదు. ఒకవేళ సందేహపడినా, పరిమాణంలో కనీసం నాలుగు వేళ్ళ మధ్యకు కూడా అమరని ఎలుక తోలును ఉతకడం, అదీ ఏడాది పాటు ఉతకడానికి వీలయ్యేపనేనా? అని ఒక్కసారి ఆలోచన చేస్తే, అందులోని అసంభావ్యత కళ్ళ ముందు మెదిలి వెంటనే సందేహ నివృత్తి జరుగుతుంది. అదేగాక 'యందాక' (ఎంతగా కష్టపడి ఉతికినా అనే అర్థంలో చెప్పబడిన) మాటకు బదులుగా 'యేడాది' అని చేర్చడం కూడా 'ఎలుక'తో పాటుగా చేసిన మార్పు అనేది అర్థంచేసుకోగలిగినదే! అయితే, ఆ మాటలతోనే ఈ పద్యం ప్రసిద్ధమైనది కాబట్టి అందులోని అసంభావ్యతలకు సమాధానపడి సరిపెట్టుకోవడమే మంచిది అనే అభిప్రాయానికి చెప్పగలిగిన అభ్యంతరం నా దగ్గర ఏదీ లేదు. కాని, వేమన ఉద్దేశించిన పోలిక ఇదేనా? అని ప్రశ్నించుకున్నప్పుడు మాత్రం పద్యంలోని ఆ 'తప్పు పాఠాలను' ఎప్పటికైనా సరి చెయ్యకుండా వదిలెయ్యడం సరైనది కాదేమో అని తప్పకుండా అనిపిస్తుంది. వేమన శతకంలోని ఈ పద్యం మాట అటుంచితే, తెలుగునాట బహుళ ప్రసిద్ధి పొందిన మొదటి నీతిశతకమైన 'సుమతీ శతకం'లో కూడా ఇటువంటి 'తప్పు పాఠాలు' కొన్ని కనపడి చదువుతున్నప్పుడు పంటి కింద పడ్డ రాళ్ళలాగా అడ్డుపడుతూ ఇబ్బంది కలిగిస్తుంటాయి. ఉదాహరణకు ఈ క్రింది పద్యం:

కం. రూపెంచి సతిని బొందకు
ప్రాపగు చుట్టంబు కెగ్గు బల్కకు మెపుడున్
కోపించు రాజు గొల్వకు
పాపపు దేశంబు బోకు పాటుర సుమతీ!

ఇప్పటికీ లభ్యమౌతున్న ఒక తాళపత్రప్రతిలోని పాఠం ఇది. పద్యం సరళంగా 'సుమతీశతకం'లోని పద్యాల ధారకు, భాషకు సరిపోయి చదవడానికి సాఫీగా సాగిపోతుంది. మధ్యలో ఎక్కడా నట్టు పడదు. భావం సుబోధకమే! ఈ పాఠానికి బదులుగా ఇప్పుడు ముద్రణలో లభ్యమౌతున్న 'సుమతీశతకం' ప్రతులలో ఈ పద్యం ఈ క్రింది పాఠంతో కనపడుతుంది:

కం. రూపించి పలికి బొంకకు
ప్రాపగు చుట్టంబు నెగ్గు పలుకకు మదిలోఁ
గోపించు రాజు గొల్వకు
పాపపు దేశంబు సొరకు పదిలము సుమతీ!

మొదటి పాదంలోని భావం పూర్తిగా మార్చివేయబడింది. 'రూపించి పలికి' అబద్ధం చెప్పడం అంటే ఏమిటో అర్థం చెప్పుకోవడానికి కష్టపడాల్సిందే తప్ప సులభంగా అయ్యేది కాదు. కంటికి కనిపించే అందానికి ప్రాధాన్యతను ఇవ్వవద్దు అని ఉద్దేశించిన మాటలను ఇలా మార్చడం ఎందుకు జరిగిందనే ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. రెండవ పాదం చివరన 'మదిలో' అని అన్వయానికి సరిపోని అపపాఠం చేరింది. నాల్గవ పాదంలోనూ ఇదే విధమైన మార్పు చేయబడింది. 'చాలా కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది సుమా!' అనే అర్థంలోని 'పాటుర' అనే మాటకు బదులుగా 'జాగ్రత్త వహించు' అని అర్థాన్ని సూచించే 'పదిలము' అనే మాట చేరింది. పైన ఇచ్చినవి రెండు శతకాలలో నుండి రెండు ఉదాహరణలు మాత్రమే. రెండు శతకాలలోనూ ప్రసిద్ధమైన పద్యాలలో ఇటువంటి అపపాఠాలు మరికొన్ని ఉన్నాయి. తెలిసిన తరువాత వీటిని సరి చేయకుండా వదిలేసి కొనసాగించడం సరైనదేనా? అన్నది ఇప్పుడు బాధించే ఆలోచన.

○ భట్టు వెంకటరావు

వరదల్లోనూ బురద రాజకీయం

గత నెల 31న ఉమ్మడి కృష్ణా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తోడు కృష్ణా ఉపనదులైన మున్నేరు, పాలేరు నదుల నుంచి రికార్డు స్థాయిలో 11 లక్షల 43 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరింది. మరోవైపు బుడమేరు వాగుకు మూడు చోట్ల పెద్దగండ్లు, 16 చోట్ల చిన్నగండ్లు పడడంతో విజయవాడలోని సింగ్‌నగర్ సహా 16 డివిజన్లలోని కాలనీలు జలదిగ్బంధం అయ్యాయి. 2.76 లక్షల మంది ప్రజానీకం నిర్వాసితులుగా మారారు. ఈ రెండూ విజయవాడ పరిసర ప్రాంతాలకు ఏకకాలంలో సంభవించిన వేర్వేరు విపత్తులు. ఈ విపత్తుల బారి నుంచి ప్రజలను రక్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అధికార యంత్రాంగం, కేంద్ర సహాయక బృందాలు, పోలీసు యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు... అందరూ ఏకతాటిపైకి వచ్చి నిర్విరామ కృషి చేయడంతో ప్రాణనష్టం తగ్గింది. బాధితులకు ఆహారం, త్రాగునీరు, పాలు, మందులు సరఫరా చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది.

ఇదిలావుంటే... కరకట్టపై ఉన్న చంద్రబాబు ఇంటిని రక్షించేందుకే అర్ధరాత్రి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 లాక్‌లు ఎత్తివేశారని, బుడమేరు వరదను మళ్లించి విజయవాడను ముంచేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది ముమ్మాటికీ మ్యాన్ మేడ్ ఫ్లడ్స్ అని కూడా సెలవిచ్చారు. జగన్‌రెడ్డి అవగాహన రాహిత్యానికి, అజ్ఞానానికి ఆయన చేసిన వ్యాఖ్యలే మచ్చుతునక. విజయవాడ నగరానికి ఒకవైపు బుడమేరు ఉంటే, మరో వైపున కృష్ణా నది ప్రవహిస్తుంది. వాటి ప్రవాహ మార్గాలు వేర్వేరు. బుడమేరు అనేది కృష్ణానదికి ఉపనది కాదు. బుడమేరు పరివాహక ప్రాంతానికి, కృష్ణానది పరివాహక ప్రాంతానికి సంబంధం లేదు. 'కృష్ణానదికి గరిష్ఠంగా 11.43 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. బుడమేరుకు వచ్చిన వరద 35 వేల క్యూసెక్కులే. అంటే 35 వేల క్యూసెక్కులను ఆపితే కృష్ణానదికి వచ్చే వరదంతా ఆగిపోతుందా' అని అందరూ ఆశ్చర్యపోయారు.

ఇదే సమయంలో వైసీపీకి చెందినవారే పనిగట్టుకుని రాజధాని అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. సచివాలయం, హైకోర్టు, ఎమ్మెల్యే క్వార్టర్స్, ఐఏఎస్ అధికారుల నివాస సముదాయాలు నీట మునిగాయని, ఈ ప్రాంతం రాజధానికి అననుకూల ప్రాంతం అని జగన్‌రెడ్డికి చెందిన నీలి మీడియా, కూలి మీడియా అసత్య కథనాలు వండి వార్చింది. వాస్తవానికి వచ్చిన వరద వచ్చినట్టు కొండవీటి వాగు ఎత్తిపోతల ద్వారా కృష్ణానదిలోకి వెళ్ళిపోయింది. ఎక్కడా నీరు నిలవలేదు. కేవలం ఇది అమరావతి ప్రాంతంపై పనిగట్టుకు చేసిన తప్పుడు ప్రచారం తప్ప మరొకటి కాదు. అదేవిధంగా 'రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? సాయం అందించడంలో ఇంత చేతకానితనమా?' అంటూ ఎక్స్ వేదికగా జగన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నిజానికి

> **విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రతిపక్ష వైసీపీ లేనిపోని అపోహలు సృష్టించి, ప్రజలను భయాందోళనలో ముంచెత్తడం గర్హనీయం. వరద బాధితులకు ఏ విధమైన సహాయం చేయకపోగా, విపత్తు నుంచి ప్రజలను రక్షించడానికి నిర్విరామ కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లడం క్షమార్హం కాని నేరం.**



అనుభవజ్ఞుడైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగానే ఇంత పెద్ద విపత్తులు ఏకకాలంలో సంభవించినా యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలు కారణంగా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జగన్‌రెడ్డే కానీ ఈ సమయంలో ముఖ్యమంత్రిగా ఉండివుంటే అతని అనుభవరాహిత్యానికి కృష్ణా జిల్లా మొత్తం ఈపాటికి కొల్లేటిలో కలిసిపోయేదనేది వాస్తవం. గతంలో కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు అధికార యంత్రాంగం ముందస్తు హెచ్చరికలు చేసినా తగు చర్యలు తీసుకోకుండా ప్రకాశం బ్యారేజీ వద్ద పడవ అడ్డుపెట్టి చంద్రబాబు ఉంటున్న నివాసం మునిగిందా, లేదా అని డ్రోన్ కెమెరాలతో పరీక్షించిన విషయం అందరికీ తెలిసిందే. అటువంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి ఇప్పుడు మళ్ళీ అధికారంలో ఉండివుంటే జరిగే విపత్తు ఊహించడానికి కూడా సాధ్యం అయ్యేది కాదు.

నిజానికి బుడమేరు అనేది వాగు అన్నది కూడా జగన్‌రెడ్డికి తెలియదు. బురద చల్లడం తప్ప బుడమేరు చరిత్ర ఆయనకి తెలియదు. బుడమేరు వాగు అనేది కొల్లేరు సరస్సులో కలిసే అతిపెద్ద వాగు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని జమ్ములవోలు కొండలలో ప్రారంభమై ఈ వాగు మైలవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు మండలాల్లోని కొండవాగు, కోతులవాగు, పులివాగు, భీమ్‌వాగు, లోయవాగు, దొర్లింతల వాగులతో పాటు విస్సన్నపేట, తిరువూరు నుంచి వచ్చే కొన్ని ఏరులను కూడా కలుపుకుని ముందుకు సాగుతుంది. ఇవన్నీ కలిసాక, వెలగలేరు మీదుగా విజయవాడ శివారులోని సింగ్‌నగర్, గూడవల్లి, గన్నవరం, బాపులపాడు, గుడివాడ వైపు సాగి చివరకు కొల్లేరులో కలుస్తుంది. ఈ వాగు మొత్తం పొడవు 113 కిలోమీటర్లు. పరివాహక ప్రాంతం 1,880 చదరపు కిలోమీటర్లు. బుడమేరు గరిష్ఠ నీటి సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు మాత్రమే. దీని ఉధృతి తగ్గించేందుకు 1960ల్లో నాటి ప్రభుత్వం జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద హెడ్ రెగ్యులేటర్‌ను నిర్మించింది. దీని ద్వారా కిందకు వరద ప్రవాహాన్ని నియంత్రించేవారు. తరువాత దీని నుంచి డైవర్షన్ ఛానెల్ తవ్వారు. ఈ కాలువ సామర్థ్యం 7,500 క్యూసెక్కులు. అధికంగా వచ్చే వరద ఈ ఛానెల్ ద్వారానే ప్రవహించి, ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. బుడమేరుకు వరద వచ్చిన ప్రతీసారీ వెలగలేరు వద్ద 40 వేల క్యూసెక్కులకు పైన నీటి ప్రవాహం ఉంటుంది. అందువలన డైవర్షన్ ఛానెల్ సామర్థ్యం సరిపోక విజయవాడను తరచూ ముంచుతోంది. 1991లో వరద నియంత్రణ ప్రాజెక్టులో భాగంగా డైవర్షన్ ఛానెల్ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు పెంచారు. 2006లో బుడమేరుకు సుమారు 70 వేల క్యూసెక్కుల వరద పోటెత్తి విజయవాడను ముంచెత్తింది. 1903 నుంచి ఇప్పటివరకు బెజవాడ పదిహేడుసార్లకు పైగా వరద ముంపునకు గురయ్యింది. ఈ వరదలు పెద్దఎత్తున ఆస్తినష్టాలకు కారణమయ్యాయి. వరదను అరికట్టాలంటే మళ్లింపు కాలువ విస్తరణే మార్గమని నిపుణులు ప్రతిపాదించారు. అందుకు పోలవరం కుడికాలువకు బుడమేరుతో అనుసంధానం చేశారు. ఆ విధంగా పోలవరం నుంచి వచ్చే నీటిని కృష్ణానదిలో కలిపేందుకు ప్రణాళిక చేశారు. పోలవరం కుడికాలువను 37,500 క్యూసెక్కులతో డిజైన్ చేయగా, ప్రస్తుత సామర్థ్యం 8,500 క్యూసెక్కులు మాత్రమే. 1970ల్లో ఎన్టీపీఎస్ వచ్చింది. ఈ సంస్థ అభ్యంతరాల వల్ల కాలువ సామర్థ్యం పెంచలేదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. 1964లో బుడమేరుకు రికార్డు స్థాయిలో వరదలొచ్చినప్పుడు విజయవాడ మునగడంతో అప్పటి కేంద్ర జలసంఘం ఏసీ మిత్రా నేతృత్వంలో నిపుణుల కమిటీ వేసింది. నదీ ప్రవాహంలో మలుపులు సరిచేయాలని, బ్రహ్మయ్యలింగం చెరువు నిల్వ సామర్థ్యం పెంచాలని, కొన్ని రిజర్వాయర్లు నిర్మించాలని మిత్రా కమిటీ సూచించింది. అనేక కారణాలతో ఇవేమీ ఆచరణరూపం దాల్చలేదు.

ఇక బుడమేరు ఆక్రమణలకు గురి కావడంతో అది సహజంగా కొల్లేరులో కలిసే మార్గాలు మూసుకుపోయాయి. కొల్లేరులో 42 శాతం అక్రమ చేపల చెరువులు, మరో 9 శాతం వ్యవసాయ భూములు ఉన్నాయని అంచనా. గత ముప్ఫై ఏళ్లగా కొల్లేరులో అక్రమ ఆక్రమణలు సాగుతూనే ఉన్నాయి. ఇవే బుడమేరు విజయవాడను ముంచెత్తడానికి దారి తీస్తున్నాయి. ఇదీ బుడమేరు చరిత్ర. జగన్‌రెడ్డికి ఈ చరిత్ర తెలియకపోవడంతో ఏం మాట్లాడాలో అర్థంకాక ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు.

ఒకవైపు కూటమి ప్రభుత్వం వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటూనే బుడమేరుకు పడిన మూడు గండ్లను ఆర్మీ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ విభాగం సాయంతో యుద్ధప్రాతిపదికన పూడ్చివేసింది. భవిష్యత్తులో మరోసారి ఇటువంటి ప్రమాదం తలెత్తకుండా ఉండేందుకు బుడమేరు వాగు, కొల్లేరు సరస్సులలో అక్రమ నిర్మాణాలను తొలగించడం, ఉపనదుల కరకట్టల ఎత్తు పెంచడం, అవసరమైన చోట రక్షణ గోడల నిర్మాణం చేపట్టడం, కాలువ సామర్థ్యం పెంచడం, మురుగునీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడం లాంటి శాశ్వత ప్రణాళికలపై దృష్టి సారించింది. మరోవైపు ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రతిపక్ష వైసీపీ లేనిపోని అపోహలు సృష్టించి, ప్రజలను భయాందోళనలో ముంచెత్తడం గర్హనీయం. రెండుసార్లు వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన జగన్‌రెడ్డి ఏ విధమైన సహాయం చేయక పోగా, విపత్తు నుంచి ప్రజలను రక్షించడానికి నిర్విరామ కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురదచల్లడం క్షమార్హం కాని నేరం. అధికారానికి దూరం చేసిన ప్రజలు రాజకీయాలకు కూడా అనర్హులుగా చేయకమునుపే జగన్‌రెడ్డి హుందాతనంగా వ్యవహరిస్తే మేలు. లేకపోతే ప్రజలే శాశ్వతంగా రాజకీయ సమాధి కడతారు.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి



తడి ఆరని పుస్తకాలు : వైఎస్సార్ కాలనీలో..



గుట్టలుగా.. : కండ్రికలో పేరుకుపోయిన చెత్త

కలకలం

బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రచారం

- చాలాచోట్ల ఇళ్లను ఖాళీ చేసిన జనం
- వదంతులు నమ్మొద్దని పోలీసుల ప్రచారం
- పూర్తిగా అవాస్తవం : కలెక్టర్, మేయర్

విజయవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బుడమేరుకు వరద వస్తోందన్న వదంతులు శనివారం రాత్రి నగరంలో కలకలం సృష్టించాయి. ఇప్పటికే భయాందోళన నడుమ బతుకుతున్న బాధితులు ఒక్కసారిగా ఇళ్లను ఖాళీ చేశారు. జక్కంపూడి కాలనీలో ఉన్నవారు సామాన్లు తీసుకుని రోడ్లపైకి వచ్చారు. అంబాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్‌లోనూ ఈ ప్రచారం జరిగింది. చివరికి పోలీసులు స్పందించి.. ఎలాంటి వరద రావడం లేదని మైకుల్లో ప్రకటించినా బాధితులు పట్టించుకోలేదు. బుడమేరుకు ఎగువ భాగంలో గండి పడిందని కొందరు ప్రచారం చేశారు. అయితే, ఇంకా చాలా ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ఉంది. ఈ నీరును బుడమేరులోకి పంపడానికి పలుచోట్ల గండ్లు కొట్టారు. ఆ నీరంతా కాల్వలోకి రావడంతో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఇదే వరద ప్రచారానికి కారణమని అధికారులు గుర్తించారు. కాగా, దీనిపై జలవనరుల శాఖ అధికారులు స్పందిస్తూ బుడమేరుకు ప్రస్తుతం 700 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందన్నారు. వదంతులపై స్పందించిన కలెక్టర్ సృజన.. బుడమేరుకు ఎక్కడా గండ్లు పడలేదని, కొంతమంది సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుడమేరు కట్ట మళ్లీ తెగిందనేది పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రచారాలు నమ్మ వద్దన్నారు. నగరవాసులు ఈ వదంతులను నమ్మొద్దని మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

వరద విలయాన్ని సృష్టించి రెండు వారాలవుతున్నా ప్రజా జీవనం ఇంకా కుదుట పడలేదు. ఇప్పుడిప్పుడే వరద తాకిడి నుంచి బయట పడుతున్న ఇళ్లను శుభ్రం చేసుకుంటూ, సమస్యలతో సహవాసం చేస్తూ బాధితులు ఇంకా దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సర్వం కోల్పోయి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కుటుంబమంతా కలిసి ఇళ్లను, సామాన్లను శుభ్రం చేసుకుంటున్నా పనులు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో దాతల దాతృత్వం ఊరట కలిగిస్తోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

కలవరం



ఊ'రొద' : పాయకాపురంలో ఇల్లు శుభ్రం చేసుకుంటూ..

నాడు



చెరువులా వైఎస్సార్ కాలనీకి వెళ్లే రహదారి


నేడు



రోడ్డుగా మారి..



జీవనోపాధి.. సర్వం సమాధి : సింగ్‌నగర్‌లో పాడైన రిక్షా, సామాన్లు



కదలదు.. వదలదు : రాజీవ్‌నగర్‌లో పరిస్థితి ఇలా..

'బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను.. బంగారు పంటలే పండుతాయి.. మురిపాల ముత్యాలు దొర్లుతాయి..' అని మనం చదువుకున్నాం. కానీ, ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అటు కృష్ణానది, ఇటు బుడమేరు సృష్టించిన విలయానికి కృష్ణాడెల్టా కకావికలమైంది. బంగారు పంటలు బీడుగా మారాయి. పాడిపంటలు పాడైపోయాయి. రైతుల ఆశలు మోడై పోయాయి. పెనువిపత్తు సృష్టించిన ఈ ప్రకంపనలు డెల్టా రైతులను దారుణంగా దెబ్బతీశాయి. ఖరీఫ్‌లో ఈ బీభత్సానికి భారీగా నష్టపోయిన కృష్ణాజిల్లాలోని 11 మండలాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం శనివారం పొలంబాట చేపట్టింది. అవనిగడ్డ మండలంలోని ఎడ్లంక నుంచి ప్రారంభమైన ఈ పరిశీలన పెనమలూరు మండలం పెదపులిపాక వరకూ, అక్కడి నుంచి నందివాడ మండలం పుట్టగుంట వరకూ, అక్కడి నుంచి బాపులపాడు మండలం మీదుగా గన్నవరం మండలం వరకూ సుమారు 168 కిలోమీటర్లు సాగింది. వరితో పాటు ముఖ్యమైన ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేస్తూ సాగిన ఆంధ్రజ్యోతి బృందానికి రైతులు తమ గోడు చెప్పుకొన్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయామంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఎటుచూసినా ఎండిన పంటలు.. నీటమునిగి నాశనమైన వరిపొలాలతో అన్నదాతల ఆక్రందనలు నింగినంటాయి. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

ఆంధ్రజ్యోతి పొలంబాట

కన్నీటి వరద..!

వర్షాలు, వరదలకు తుడిచిపెట్టుకుపోయిన కృష్ణాడెల్టా



నందివాడ మండలం పెదలింగాలలో ఇంకా నీటిలోనే నానుతున్న వరిని చూపిస్తున్న రైతు

ఇంకా నీటిలోనే వరి.. నాశనమైన కంద, పసుపు, మొక్కజొన్న, అరటి

- కోలుకోలేని దెబ్బతిన్న జిల్లా రైతులు
- రూ.లక్షల్లో పెట్టిన పెట్టుబడి వరదార్పణం
- ఇప్పట్లో వరినాట్లు వేసే అవకాశం శూన్యం
- రెండు నెలల తర్వాతే వాణిజ్య పంటల సాగు
- పసుపు, కంద విత్తనం దొరకడం గగనమే..

కృష్ణాతీరంలో 'ఆంధ్రజ్యోతి' పొలంబాటలో కన్నీటి కథలు

కృష్ణాజిల్లావ్యాప్తంగా 168 కిలోమీటర్లు తిరిగిన బృందం

- నిండామునిగి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం

- కథనాలు 6లో

పర్యాటకానికి ఆటంకం



పూర్తిగా నాశనమైన జెట్టీ యూనిట్

నిండామునిగిన భవానీ ఐల్యాండ్, బరం పార్కు

రూ.5 కోట్ల వరకు నష్టం

కృష్ణానదికి పోటెత్తిన వరద భవానీ ద్వీపాన్ని నిండాముంచింది. బరం పార్కు పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. రూ.5 కోట్ల మేర నష్టం సంభవించినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భవానీ ద్వీపం, బెరం పార్కుల్లోకి అడుగు పెట్టే పరిస్థితి లేకపోవడంతో రోజుకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

- ద్వీపాన్ని ఇప్పట్లో పునరుద్ధరించటం కష్టమే
- రోజుకు రూ.3 లక్షల ఆదాయానికి గండి
- బరం పార్కులో చెత్త తొలగింపు పనులు
- ద్వీపంలోకి వెళ్లే అవకాశమే లేదు

భవానీ ద్వీపంలో భయంభయం

కృష్ణానదికి వరద తగ్గినా.. భవానీ ద్వీపంలోకి ప్రవేశించటం కష్టసాధ్యంగా మారింది. లోపలికి వెళ్లి వచ్చిన సిబ్బంది.. ద్వీపంలోని దారుణమైన పరిస్థితిని చూసి భయపడిపోతున్నారు. మట్టి మూడు నుంచి నాలుగు అడుగుల మేర కమ్మేసింది. తీవ్ర దుర్గంధం వ్యాపించింది. ధైర్యం చేసి ద్వీపంలోకి అడుగు పెట్టలేని పరిస్థితి. ఇక కాటేజీల్లోకి మూడు అడుగుల మేర బురద మట్టి కొట్టుకొచ్చింది. పరుపులు, ఖరీదైన ఫర్నీచర్, మంచాలు, ఏసీలు, టీవీలు నాశనమయ్యాయి. రోబోటిక్ పార్క్ చాలావరకు వరదలో కొట్టుకుపోయింది. మేజ్ గార్డెన్ పూర్తిగా దెబ్బతింది. లాన్, పాత్‌వేలు, సెల్ఫీ పాయింట్లన్నీ నాశనమయ్యాయి. వరద రావడానికి ముందే ఇక్కడి కాటేజీలను ఆధునీకీకరించారు. ద్వీపం ఒక్క దానికే రూ.2 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

బరం పార్కు పరిస్థితి ఘోరం

బరం పార్కు పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఘాట్లలోకి పెద్ద ఎత్తున చెత్తాచెదారం చేరింది. వీటి తొలగింపు పనులు చేపట్టారు. కాటేజీల్లోకి వరద రావటంతో రెండున్నర అడుగుల మేర బురద నిండిపోయింది. పార్కుకు రూ.1.75 కోట్ల నష్టం వచ్చినట్టుగా ఏపీటీడీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. బోటింగ్ యూనిట్‌కు కూడా భారీగా నష్టం జరిగింది. వరదలో కొట్టుకుపోకుండా బోట్లను కాపాడు కున్నా ప్రవాహం వల్ల అవి తిరగబడటంతో ఈ నష్టం వాటిల్లింది. బోటింగ్ యూనిట్‌కు రూ.1.50 కోట్ల నష్టం వచ్చినట్లు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకుంటేనే..

భవానీ ఐల్యాండ్, బరం పార్కుల పునరుద్ధరణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. బోట్ల మరమ్మతులు, కాటేజీల ఆధునికీకరణ, పర్యాటక ఆకర్షణలకు రూ.25 కోట్ల మేర అయినా ఆర్థిక సాయం చేయాల్సిన అవసరముంది. అయితే, గత వరదల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని భవానీ ఐల్యాండ్, బరం పార్కుల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు ఇన్సూరెన్స్ చేయించారు. దీనివల్ల కొంతమేర నష్ట నివారణ చేసుకునే అవకాశం ఉంది.

కోల్పోయిన ఆదాయం

భవానీ ఐలాండ్, హరిత బరం పార్కులు వరద వల్ల దెబ్బతినడంతో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాటేజీలు, రెస్టారెంట్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, బార్, బోటింగ్ వంటి కార్యకలాపాల ద్వారా సగటున రోజుకు ఈ ఆదాయం సమకూరేది.



విజయలో ఉత్పత్తి బంద్

బుడమేరు వరదతో ప్లాంటుకు తీవ్రనష్టం

* నెలరోజులపాటు మూసివేత * రూ.70 కోట్ల ఆస్తి నష్టం
* ఆదుకున్న 'ప్రాజెక్టు కామధేను'
* ప్రస్తుతానికి ఇక్కడి నుంచే పాలు, పెరుగు ఉత్పత్తి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద ప్రభావం లక్షలాది మంది రైతులకు ఉపాధినిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్‌పై పడింది. యూనియన్ ప్రారంభమైన సుమారు ఆరు దశాబ్దాల్లో తొలిసారి నెలరోజులు ప్లాంట్ మూతపడే పరిస్థితి ఏర్పడింది. వరద తాకిడికి చిట్టినగర్‌లోని కృష్ణామిల్క్ యూనియన్‌లో సుమారు ఐదారు అడుగుల మేర నీరు చేరింది. వారం పాటు నీరు నిల్వ ఉండిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారు. మోటార్లు నీటమునగడంతో పాటు రూ.కోట్ల విలువైన యంత్రాలు సైతం వారం పాటు నీటిలో ఉండిపోయాయి. వరద తగ్గాక చాలావరకు - మిగతా 6లో

విగ్రహావిష్కరణ



తొలి తెలుగు కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నష్ట అంచనాపై నేడు ప్రభుత్వానికి నివేదిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారీ వర్షాలు, కృష్ణా, బుడమేరు వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల జరిగిన నష్ట అంచనాపై తుది నివేదికను కలెక్టర్ సృజన ఆదివారం ప్రభుత్వానికి అందించనున్నారు. శాఖలవారీగా నష్ట నివేదికలను ఇప్పటికే సిద్ధం చేశాయి. నగరంలోని నాలుగు మండలాలు, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో జరిగిన వరద నష్టానికి సంబంధించి ఫ్లడ్ ఎన్యూమరేషన్ నిర్వహించారు. ప్రభుత్వానికి స్పష్టమైన లెక్కను అందించేందుకు వీలుగా శనివారం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. దీంతో ఆదివారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం సహాయం ప్రకటించే అవకాశం ఉంది.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రైతులు బాధల్లో ఉన్నారు. ఎవరిని పలకరించిన కన్నీటి పర్యంతమవుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టగా మొత్తం వరదపాలైంది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే తొలిదశ పొట్ట మీద ఉండగా ఈ భారీ వర్షాలు, వరదలకు మొత్తం పోయింది. కృష్ణాజిల్లాల్లో పంట నష్టపోయిన గ్రామాల్లో ఆంధ్రజ్యోతి బృందం శనివారం పర్యటించి రైతుల బాధలు తెలుసుకుంది. కృష్ణాజిల్లా మేర పర్యటించి వరద తాకిడికి ఎండిపోయిన పంట పొలాలు, బుడమేరు వరద కారణంగా నీట మునిగిన వరిపొలాలను పరిశీలించారు. ఏ రైతును కదిలించినా కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికే నిండా మునిగిపోయామని, ప్రభుత్వం ఆదుకుంటేనే తమకు మరో జీవితమంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణాతీరమంతా ఎడారే..!

తుడిచిపెట్టుకుపోయిన కంద, పసుపు, మొక్కజొన్న, అరటి తోటలు

ఆంధ్రజ్యోతి పొలంబాట

- ఇంకా నీటిలోనే వరి పైరు
- ఇప్పట్లో వరి నాట్లకు అవకాశం లేదు
- 2 నెలల తర్వాతే వాణిజ్య పంటల సాగుకు అవకాశం
- పసుపు, కంద విత్తనం దొరికే దారేదీ..!
- కౌలు రైతులకు మరింత నష్టం
- ఆంధ్రజ్యోతి పొలంబాటలో అన్నదాతల కష్టాలు

పంటల బీమా వస్తేనే రైతు బతికేది

ప్రస్తుతం జిల్లాలో సుమారు 45వేల హెక్టార్లలో వరిపైరు, 4500 హెక్టార్లలో వాణిజ్య పంటలు దెబ్బతిన్నట్లుగా జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. వరిసాగుకు రూ.385 కోట్లు, వాణిజ్య పంటలకు రూ.108 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం పంట నష్టపరిహారం జాబితాల తయారీ ప్రక్రియలో గ్రామ స్థాయి సిబ్బంది ఉన్నారు. ఈక్రాప్ నమోదు ఈనెలాఖారులోగా పూర్తికావాల్సి ఉంది. ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేస్తేనే పంట నష్టపరిహారం, బీమా వచ్చే అవకాశం.



వరదల కారణంగా పాడైపోయిన పసుపు పంటను చూపిస్తున్న వల్లూరు పాలెంకు చెందిన రైతు కాట్రగడ్డ సాయి

ఇంకని వరద నీరు.. ఆగని రైతు కన్నీరు

● కుళ్లి ఎరుపురంగులోకి పొలాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: భారీ వర్షాలు, వరదలతో నీట మునిగిన పొలాల్లో పంటలన్నీ కుళ్లిపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, ఓగిరాల, రంగయ్యప్పారావుపేట, రామన్నగూడెం, వైకుంఠలక్ష్మీపురం, తదితర 8 గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల పంటలు ముంపునకు



వరద ముంపుతో కుళ్లి, ఎర్రబారిన వరిపొలాలు

గురయ్యాయి. 15 రోజులు దాటినా వరద నీరు ఇంకకపోవడంతో వరిపంట మొత్తం కుళ్లిపోయిందని చెబుతున్నారు. నాట్ల నుంచి కలుపుతీత, ఎరువులు తదితర సస్యరక్షణ చర్యలకు ఎకరాకు రూ.20వేలపైనే అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, తీర పంటలన్నీ వరదపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడకుంటే ముంపు నీరు ఎండేందుకు వారంపైనే పడుతుందని, మళ్లీ పంట వేసేందుకు సమయం సరిపోదన్నారు. ప్రభుత్వం సాగునీరిస్తే నవంబరు నెలాఖరు నుంచి వరి వేస్తామని లేకుంటే అపరాలు సాగుచేస్తామని తుమ్మల బ్రహ్మాజీ అనే రైతు వివరించారు. బాపులపాడు మండలంలోని 8 గ్రామాల పరిధిలో సుమారు 5వేల ఎకరాల పైగా వరిపంట నీటమునిగి కుళ్లి ఎందుకూ పనికిరాకుండా పోయిందన్నారు. అధికారులు గ్రామకార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనాలను రూపొందించాలని రైతులు కోరుతున్నారు. అన్నదాత నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని వ్యవసాయరంగాన్ని బతికించాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పంట నష్టపరిహారం, బీమా ఇవ్వాలి: పెదర్ల యామినీ ప్రసాద్



ఆరుగొలనులో పదెకరాలకు పైగా స్వంతంగా వ్యవసాయం సాగు చేస్తున్నా. పంట మొత్తం ముంపునకు గురై కుళ్లింది. వరదలకు దెబ్బతిన్న పంటలన్నింటికీ నష్టపరిహారంతో పాటు బీమా అమలు చేయాలి.

కౌలు రైతులను ఆదుకోవాలి: సుబ్రహ్మణ్యం



పదేళ్లుగా పొలాలు కౌలుకు చేస్తూ జీవిస్తున్నా. ఇటువంటి విపత్తు గతంలో ఎన్నడూ చూడలేదు. పెట్టుబడి కోసం అప్పు చేశా. కౌలు రైతులకు నష్టపరిహారం అందిస్తే అప్పులు తీరతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం అంటనే భయం వేస్తోంది.



మోపిదేవి మండలం బొబ్బర్లంకలో పాడైపోయిన అరటితోట



ముస్తాబాదలో కుళ్లిపోయిన పంటను చూపుతున్న రైతులు

మచిలీపట్నం/చల్లపల్లి/మోపిదేవి/అవనిగడ్డ/తోట్లవల్లూరు/పెనమలూరు/గుడివాడ/నందివాడ: అన్నదాతలకు తీరని కష్టం వచ్చిపడింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వాణిజ్య పంటలు సాగుచేసిన రైతులను కృష్ణానదికి వరద రూపంలో వచ్చిన విపత్తు నిలువునా ముంచేసింది. బుడమేరు ఉగ్రరూపం దాల్చి వరిపొలాలను ముంచెత్తటంతో 10 రోజులుగా పైరు నీటిలోనే ఉండి కుళ్లిపోతోంది. సెప్టెంబరులో మళ్లీ వరిసాగు చేయాలా వద్దా అనే మీమాంసలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు. వరినాట్లు వేయాలన్నా నారు ఎక్కడి నుంచి తీసుకురావాలంటూ ఆవేదన చెందుతున్నారు. వాణిజ్య పంటలకు పెట్టింది పేరైన లంక భూములు, నదీపరీవాహక ప్రాంతాలు వరద బీభత్సానికి నిలువునా మునిగాయి. నీరు తగ్గాక పొలాల్లోకి వెళ్లి చూస్తే లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టిన కంద, పసుపు, అరటి, మొక్కజొన్న, కూరగాయల తోటలు పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకూ పుడమితల్లికి పచ్చకోకలా ఉన్న పైర్లు నేడు పూర్తిగా ఎండిపోయి ప్రకృతి విపత్తుకు సాక్ష్యంగా నిలిచాయి. ఎండిన పైరును చూసి రైతులు లోలోపలే కుమిలిపోతున్నారు. మళ్లీ కోలుకోవాలంటే ఎన్నేళ్ల సమయం పడుతుందోనని బెంబేలెత్తిపోతున్నారు. అవనిగడ్డ మండలం ఎడ్లంక నుంచీ ఆంధ్రజ్యోతి బృందం పొలంబాట చేపట్టింది. మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, తోట్లవల్లూరు, పెనమలూరు, గుడివాడ, నందివాడ మండలాల్లో 140 కిలోమీటర్ల మేర ఆంధ్రజ్యోతి బృందం పర్యటించగా వరద తాకిడికి ఎండిపోయిన పంటలు, బుడమేరు వరద కారణంగా నీటమునిగిన వరిపొలాలు కనిపించాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు కోల్పోయినట్లేనని ప్రతిచోటా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పసుపు పంటకు తీరని నష్టం

లంక భూములు, కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో 5వేల ఎకరాల్లో ఈ ఏడాది జూన్‌లో పసుపు సాగు చేపట్టారు. ప్రస్తుతం పసుపు పైరు దుంప ఊరే దశలో ఉంది. ఈ తరుణంలో కృష్ణానదికి భారీ వరదలు వచ్చి వారానికి పైగా పసుపు పంట నీటిలోనే మునిగి ఉంది. నీరు తగ్గినకొద్దీ నీటితోపాటే నేలవాలిపోయింది. నిజామాబాద్, దుగ్గిరాల ప్రాంతాల నుంచీ పసుపు విత్తనం ఒక పుట్టు (250 కిలోలు) రూ.13వేలకు కొనుగోలు చేశారు. ఎకరానికి 20 నుంచీ 23 పుట్టులు విత్తనం పట్టిందన్నారు. విత్తనానికే ఎకరాకు రూ.3లక్షలు ఖర్చుపెట్టాల్సి వచ్చిందనీ, సాగు యాజమాన్యానికి మరో రూ.50 నుంచీ రూ.60 వేలు ఖర్చవుతుందనీ, కౌలు పొలమైతే అడ్వాన్స్ కౌలు మరో రూ.50వేలు అదనమని రైతులు చెబుతున్నారు. పంట చేతికివస్తే కనీసంగా రూ.5 నుంచి 6 లక్షలు వస్తుందనీ, మోసు తొడిగే దశలోనే చనిపోవటంతో పెట్టుబడి కోల్పోయామని వాపోతున్నారు.

కంద రైతుల కన్నీటిగాథ

కృష్ణానదీతీరం, లంకభూముల్లో అధికశాతం కంద పంటను ఈఏడాది సాగుచేశారు. పుట్టు కంద రూ.13 వేల నుంచీ రూ.15వరకు ధర పలుకుతుండటంతో ఈ ఏడాది రైతులు పోటీపడి మరీ కంద సాగును చేపట్టారు. 20 పుట్టుల కంద విత్తనాన్ని కొనుగోలు చేసేందుకు రూ.2లక్షల వరకూ ఖర్చుచేశారు. నవంబరు నుంచీ కంద తీసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది కంద పైరుకు డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారీ చేశారని, ఎకరానికి 70 నుంచీ 100 పుట్లు దిగుబడి వస్తుందని ఆశించామనీ, ఈలోగానే వరద రావటంతో పంట మొత్తం రోజుల తరబడి నీటిలోనే ఉండటంతో కుళ్లిపోతోందని వారు ఆవేదన చెందుతున్నారు.

నేలవాలుతున్న అరటితోటలు

లంక భూముల్లో సాగుచేసిన అరటితోటలు క్రమేపీ పసుపు రంగంలోకి మారి చెట్లు నేలవాలిపోతున్నాయి. పిలక తోటలు, గెలలు తొడిగే దశలో ఉన్న అరటి చెట్ల మొవ్వలోకి నీరు వెళ్లిపోతుండటంతో కాండం కుళ్లిపోయే దశకు చేరుకుని బలహీనపడిపోతోంది. ఇప్పటికే ఎకరానికి రూ.50వేలకు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు. కొన్ని గ్రామాల్లో అరటి గెలలు దిగే దశలో ఉన్నాయి. ఎకరానికి 800 నుంచీ 1000 మొక్కలు నాటగా, వాటిలో 100 గెలల వరకూ తయారుకాగా వాటిని విక్రయించామనీ, మిగిలినవి తయారయ్యే దశలో వరద రావటంతో చెట్లన్నీ చనిపోతున్నాయని దీంతో పెట్టుబడి మొత్తం కోల్పోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. చనిపోయిన చెట్లను తొలగించేందుకు మరో రూ.20వేలకు పైగా ఖర్చవుతుందన్నారు.

అలాగే మొక్కజొన్న, కూరగాయల తోటలు పూర్తిగా నీటిలో మునిగిపోవటంతో అవి నామరూపాల్లేకుండా ఎండిపోయాయి. మొక్కజొన్నకు ఎకరానికి పెట్టుబడిగా రూ.35వేలు పెట్టుబడి పెట్టామనీ, ఈ పెట్టుబడి మొత్తం నీటిలో కలిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంగ, బీర, దొండ, తమలపాకు తోటలు నీటిలో మునిగి చనిపోవటంతో మళ్లీ తోటలు వేయాల్సిందేనని రైతులు చెబుతున్నారు.


వెలివోలు లంకలో మల్బరీ తోటలు, పట్టుపురుగుల షెడ్లలో పట్టుగూళ్లు నీటిలో మునిగి రైతులు నష్టపోయారు. మల్బరీ మొక్కలు చనిపోయి మొదళ్లకు మట్టి పేరుకుపోయింది. చనిపోయిన మొక్కలు నరికి, మొదళ్ల వద్ద మట్టిని తొలగిస్తే మళ్లీ పిలకతొడుతుందనీ, మొక్కలు పెరగటానికి కనీసంగా 2నెలలైనా పడుతుందనీ, అప్పటి వరకూ పట్టుపురుగుల పెంపకం చేపట్టేందుకు అవకాశం లేదని రైతులు వివరించారు.

నీటిలోనే వరిపొలాలు

చల్లపల్లి మండలం మాజేరులో వర్షపునీటిలో మునిగిన అనంతరం బయటపడిన వరిమొక్కలు పూర్తిగా చనిపోయాయి. నందివాడ మండలం చినలింగాల, పెదలింగాల గ్రామాల్లోని పొలాల్లో నడుమలోతున నీరుంది. వరి మునిగిపోవటంతో చనిపోయింది.

పసుపు, కంద పంటలను పూర్తిగా కోల్పోయా

గద్దె శ్రీహరి, రైతు, మోపిదేవి



ఆరెకరాల్లో పసుపు, మరో ఆరెకరాల్లో కంద సాగుచేశా. విత్తనానికే ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఖర్చుచేశా. కంద పంట మరో 2 నెలల్లో చేతికొచ్చేది. వరదలు రావటంతో పంట మొత్తం దెబ్బతింది. పసుపు పంటదీ అదే పరిస్థితి. ప్రభుత్వం పంట బీమా పథకాన్ని అమలుచేసి రైతులను ఆదుకోవాలి. వచ్చే సీజన్‌కు సబ్సిడీపై విత్తనాలందించాలి.

రంగుమారి అరటి చెట్లు పడిపోతున్నాయి.

రాజులపాటి జగదీష్, రైతు, పురిటిగడ్డ



ఎకరంలో సాగుచేసిన అరటి తోట కోతదశకు వచ్చింది. 40 గెలలను కోసి విక్రయించా. ఈలోగా వరద రావటంతో అరటిచెట్లు నీటిలో మునిగిపోయాయి. బయటపడిన తర్వాత చెట్ల ఆకులు పసుపురంగులోకి మారి చెట్లు పడిపోతున్నాయి. సొంతపొలం కావటంతో పనులు చేసుకుంటూ రూ.50వేలకుపైగా పెట్టుబడి పెట్టా. మొత్తం నీటిలో పోసినట్టయింది. అరటిచెట్లను పూర్తి గా తొలగించేందుకు మరో రూ.20వేలు ఖర్చుచేయాలి.

రైతుల బాధ వర్ణనాతీతం

● వేల ఎకరాల్లో పంట నష్టం ● దుఃఖ సాగరంలో రైతన్నలు

గన్నవరం, సెప్టెంబరు 14: అన్నదాతకు కన్నీరే మిగిలింది. సముద్రమంతా దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కౌలు రైతుకు అపార నష్టం వాటిల్లింది. మరో 60 రోజుల్లో పంట చేతికి వస్తుందన్న సంతోషం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు, కౌలు రైతులున్నారు. ఎకరానికి రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టారు. వరితో పాటు పత్తి, వేరుశనగ, చెరుకు, కూరగాయ పంటలు భారీగా దెబ్బతిన్నాయి. రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉండటంతో పంట అంతా కుంగిపోయింది. నియోజకవర్గంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్‌లోని పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలో పంట నష్టపోయిన గ్రామాల్లో ఆంధ్రజ్యోతి బృందం శనివారం 93 కిలోమీటర్లు పర్యటించి రైతుల బాధలు తెలుసుకుంది. వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మండలంలో ముస్తాబాద పేడ చెరువు కింద 2,300 ఎకరాలు పూర్తిగా పంటపోగా 500 ఎకరాల్లో పాక్షికంగా దెబ్బతింది. సావరగూడెం, కేసరపల్లి, పురుషోత్తపట్నం గ్రామాల్లో ఎక్కువ పంట నష్టం జరిగింది. ఈ ఒక్క గ్రామంలో వందల ఎకరాల పంట వరద పాలైంది. మండలంలో వరి 2421.69 హెక్టార్లు, పత్తి 219.91 హెక్టార్లు, వేరుశనగ 29.72 హెక్టార్, చెరకు 11.31 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం అపరాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరాతున్నారు.

40ఎకరాలు పంట నష్టం

పాలడుగు రత్నారావు, కౌలు రైతు, ముస్తాబాద



70 ఎకరాలు కౌలు చేస్తున్నా. 40 ఎకరాల పంట వరదపాలైంది. ఇప్పటి వరకూ రూ.11.30 లక్షలు పెట్టుబడి పెట్టా. అంతా అప్పే. మరో 60 రోజుల్లో కోతకోయటమే అనుకున్నా. ఇంతలోనే భారీ వర్షాలు, వరద వచ్చింది. ఇలాంటి వరద ఎన్నడూ చూడలేదు. బుడమేరు దెబ్బకు పంట మొత్తం కొట్టుకుపోయింది. పశుగ్రాసం లేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

విజయలో ఉత్పత్తి బంద్

(5వ పేజీ తరువాయి)

పనిచేసేందుకు మొరాయిస్తున్నాయి.

ఆదుకున్న 'ప్రాజెక్టు కామధేను'

వరద వంటి విపత్కర సమయంలో బాపులపాడు మండలం వీరవల్లిలోని అత్యాధునిక డెయిరీ ప్రాసెసింగ్ ప్లాంట్ 'ప్రాజెక్టు కామధేను' ఆదుకుంది. ఇప్పుడు ఈ ప్లాంటే మిల్క్ యూనియన్ పాలిట ఆపద్బంధువైంది. ప్రస్తుత పరిస్థితుల్లో నెలరోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోతే కృష్ణా మిల్క్ యూనియన్ ఉనికికే ప్రమాదం వాటిల్లేది. దీంతో యూనియన్‌ను నమ్ముకున్న లక్షలాది మంది రైతులతో పాటు వేలాది మందికి ఉపాధి లేకుండా పోయేది. వీరవల్లిలో 28 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో నిర్మించిన ప్లాంటులో నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యంతో పాలు, పెరుగును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. అవసరాన్ని బట్టి ఈ ప్రాజెక్టును 6 లక్షల లీటర్ల వరకు విస్తరించుకునే సౌలభ్యం ఉంది. ఇప్పుడు ఇదే కృష్ణా మిల్క్ యూనియన్‌కు వరంగా మారింది. అయితే, పాల ఉత్పత్తుల వరకు కొన్ని రోజులపాటు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు.

వరద నష్టం ఇదీ..

ప్రాసెస్డ్ మిల్క్ 4.20 లక్షల లీటర్లు, ప్యాకింగ్‌కు సిద్ధంగా ఉన్న పాలు 1.50 లక్షల లీటర్లు, లక్ష కేజీల పెరుగు ప్యాకెట్లు, బకెట్లు, 1,200 కేజీల ప్యాకేజ్డ్ బట్టర్, 18 వేల కేజీల ప్యాకేజ్డ్ నెయ్యి, 600 కేజీల ప్యాకేజ్డ్ పన్నీర్. ఇవికాకుండా విక్రయించడానికి సిద్ధంగా ఉన్న బట్టర్ 600 మెట్రిక్ టన్నులు, భారీ యంత్ర సామాగ్రి నీటమునిగిపోవడంతో చాలావరకు పనికిరాకుండా పోయాయి. వీటి మొత్తం విలువ రూ.70 కోట్లు ఉంటుందని మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు తెలిపారు.

వరదలో పంటల నాశనంతో రైతుల దిగాలు

పెనమలూరు: మండలంలో కృష్ణా కరకట్టవెంబడి వరద ఉధృతిలో నాశనమైన తమ పంటను చూసి రైతులు దిగాలు పడుతున్నారు. చోడవరానికి చెందిన రైతు కలపాల శ్రీధర్ మాట్లాడుతూ 4ఎకరాల్లో పసుపు, ఎకరంలో కంద, ఐదెకరాల్లో అరటి సాగు చేశానని, కృష్ణా వరదతో తన పెట్టుబడి షుమారుగా 20లక్షలను పూర్తిగా కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రైతు బండా కోటేశ్వరరావు, మాట్లాడుతూ రెండున్నర ఎకరాల్లో అరటిని సాగు చేశానని, పెట్టుబడి రూ.5 లక్షలయిందని, మొత్తం వరద పాలయిందని వాపోయాడు. మానికొండ నరేష్ అనే రైతు మాట్లాడుతూ ఈ ఏడాది ఎకరంలో మొక్క జొన్న, రెండున్నర ఎకరాల్లో పసుపు, ఎకరన్నరలో అరటి సాగు చేశానని, పెట్టుబడి మొత్తం రూ.6లక్షలు ఖర్చయిందని, వరదల్లో మొత్తం కొట్టుకుపోయిందని వాపోయాడు. పెదపులిపాకకు చెందిన రైతు కుర్రా వీరకుమార్ మాట్లాడుతూ మూడెకరాల్లో కంద సాగు చేశానని, ఎకరానికి కౌలుతో కలిపి రూ.4లక్షలు ఖర్చయిందని, మొత్తం పెట్టుబడి రూ.13లక్షలూ వరద నీటి పాలయ్యాయని వాపోయాడు. ఈ రైతులందరూ వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టగా ఈ అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

10 రోజులుగా నీటలోనే వరి చేలు

నందివాడ: ఎటు చూసిన నీళ్లే మనిషి లోతు నీళ్లలో వరి చేలు. బుడమేరు వరద నందివాడ రైతులను నట్టేట ముంచింది. వరి పూర్తిగా కుళ్లి పనికి రాకుండా పోయింది. రైతులు బాధ వర్ణనాతీతం. పెదలింగాలకు చెందిన తాతినేని మురళీ అనే రైతు మాట్లాడుతూ ఎకరాకు రూ.25వేలు ఖర్చు పెట్టానని, బుడమేరు వరదతో వరి నీటిపాలైందన్నారు. చినలింగాల మరో రైతు దాసం రాంబాబు మాట్లాడుతూ వరి పంట దాదాపుగా కుళ్లిపోయిందన్నారు. ఒక్కో రైతు ఆర్థికంగా చితికి పోయాడని, ఎకరాకు రూ.20వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, చిల్లి గవ్వ వచ్చే ఆశ లేదన్నారు. ఈ ఏడాది వరిపంటపై ఆశలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యాపారులూ.. నష్టం వివరాలివ్వండి!

● దరఖాస్తులు స్వీకరించిన విజయవాడ చాంబర్

వన్‌టౌన్, సెప్టెంబరు 14: ఇటీవల వరదలకు నగరంలోని 32 డివిజన్లలోని వర్తకులు, వ్యాపారులు, కిరాణ దుకాణదారులు, చిరు వ్యాపారుల నుంచి నష్టం వివరాలపై దరఖాస్తులు స్వీకరించినట్టు శనివారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు గద్దం బాల వెంకట రవికుమార్ తెలిపారు. నష్టంపై సీఎం చంద్రబాబుకు ఒక నివేదిక సమర్పించి, సాయం పొందేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. సుమారు 300 మంది చాంబర్ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్, చాంబర్ మేనేజర్ వంకాయలపాటి కామేశ్వరరావుకు తన నేతృత్వంలో దరఖాస్తులు అందించినట్టు రవికుమార్ తెలిపారు. వీటిని కూలంకషంగా పరిశీలించి నివేదికను అందజేస్తామన్నారు.



వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి శ్రీకాంత్

రూ. 35.42 లక్షల రికవరీకి ప్రభుత్వ ఆదేశం

● వైసీపీ హయాంలో పూర్వ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి.. అడ్డగోలుగా నీటి వినియోగ చార్జీల డబ్బుల వినియోగం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ సర్కిల్ ఈఈగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈగా వ్యవహరించిన డీ సాయినాథ్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఏసీబీ, లోకాయుక్తకు ఫిర్యాదులు అందాయి. సాయినాథ్ వ్యవహారాలపై అనేక విచారణలు నడుస్తున్నాయి. ప్రధానంగా ఆయనపై అందిన ఫిర్యాదులు చూస్తే నీటి వినియోగ చార్జీలను సొంతానికి ఉపయోగించటం, దుర్వినియోగం చేయటాన్ని నిర్ధారించిన ప్రభుత్వం అతడి నుంచి రూ.35,42,878 రికవరీకి చర్యలు తీసుకుకోవాలని ఆదేశించింది. ప్రస్తుతం సాయినాథ్ పదవీ విరమణ చెంది ఉన్నారు. అయినప్పటికీ ప్రభుత్వానికి తీవ్రంగా నష్టం కలిగించినందున అయన నుంచి ఆ మేరకు రికవరీ చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

స్లైడ్ డోర్స్ ఉన్న ఇళ్లే టార్గెట్

విజయవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్లైడ్ డోర్స్ కిటికీలు ఉన్న ఇళ్లే అతడి టార్గెట్. ఎలాంటి ఆయుధాలు లేకుండా లోపలకు వెళ్లడానికి ఇదే మంచి మార్గమన్నది అతడి భావన. ఇలా స్లైడ్ డోర్ ఉన్న కిటికీ నుంచి లోపలకు వెళ్లి చోరీ చేసిన నిందితుడ్ని మాచవరం పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో డాక్టర్ వెనిగళ్ల చంద్రశేఖర్ నివాసం ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన ఒక బెడ్‌రూం కిటికీ స్లైడ్‌డోర్‌ను వేసుకోకుండా నిద్రపోయారు. విశాఖపట్నానికి చెందిన పొగతోటి గంగాధరరావు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించి ఈ ఇంట్లోకి ప్రవేశించాడు. స్లైడ్‌డోర్ వేయని కిటీలో నుంచి లోపలకు వెళ్లాడు. దేవుడి గదిలో ఉన్న వెండి దేవతా విగ్రహాలను దొంగిలించాడు. రైలులో విశాఖపట్నం పారిపోవడానికి రైల్వేస్టేషన్‌లో ఐదో నంబరు ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నాడు. అతడ్ని గమనించిన జీఆర్పీ కానిస్టేబుల్ అనుమానంతో తనిఖీ చేశాడు. వాటిని వదిలేసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకున్నారు. 13వ తేదీన చంద్రశేఖర్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, అతడు రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్టు తేలింది. ఈ కేసును చేధించిన మాచవరం హెచ్‌సీలు రాజేష్, మల్లికార్జునలకు సీపీ రాజశేఖరబాబు నగదు రివార్డును అందజేసి అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగించిన హోంగార్డు

విజయవాడ: ఓ మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కమిషనరేట్‌లో హోంగార్డు భద్రంగా అప్పగించాడు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న హోంగార్డు జనార్ధన్ విధులకు వస్తుండగా రోడ్డుపై పడి ఉన్న మొబైల్‌ను గుర్తించాడు. దాన్ని తీసి ఎవరైనా వస్తారని గంటపాటు వేచి ఉన్నాడు. ఎవరూ రాకపోవడంతో ఆఫీసుకు బయలుదేరాడు. తర్వాత డాక్టర్ లక్ష్మి అనే మహిళ ఫోన్ చేసి ఆ ఫోన్ తనదేనని చెప్పింది. పోలీసు కమిషనరేట్‌కు వచ్చి తీసుకోవాలని చెప్పి జనార్ధన్ ఆమెకు ఫోన్‌ను అప్పగించాడు. దీనికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

కోరం లేక హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా

గొల్లపూడి: గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. సొసైటీ అధ్యక్షుడు అడ్డాల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి సంఘ సభ్యులు హాజరు కానందున, కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ లే అవుట్‌లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు సుబ్బారావు

స్వచ్ఛంద సంస్థల సాయం అభినందనీయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



2వ డివిజన్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, సెప్టెంబరు 14: స్వచ్ఛంద సంస్థలు వరద బాధితులకు అండగా నిలవడం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ అన్నారు. 2వ డివిజన్ పార్టీ కార్యాలయంలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మచిలీపట్నంకు చెందిన బెరాకా మినిస్ట్రీస్ వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్‌లను పంపిణీ చేసేందుకు ముందుకు రావడం గర్వించదగిన విషయం అన్నారు. బియ్యం, గోధుమపిండితో పాటు 11 రకాల నిత్యావసర సరుకుల కిట్‌ను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, ముత్యాల కృష్ణ, తిరుమాని వెంకటేశ్వరరావు, అనుమోలు పూర్ణచంద్రరావు, వెల్లంకి సుధాకర్, డానియేలు, ఎలిశెల సురేష్‌బాబు, బట్టు శ్యామ్, నాళం నరేంద్రరావు, అజీజ్, వలివేటి వంశీ, వేమినేని రవికుమార్, నాగుల్ మీరా, కోళ్ళ తారక్, విఠల్, పర్వతనేని రత్నశ్రీ పాల్గొన్నారు.

బాధితులకు వస్త్రాల పంపిణీ

మొగల్రాజపురం: తూర్పు పరిధి 8వ డివిజన్ పిటింగేల్ పేట చర్చిలో శనివారం వరద బాధితులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రారంభించారు. కొమ్మినేని వాణి-వేణు,కొత్తపల్లి నాగమౌనికలు రెండు వందల కుటుంబాలకు దుప్పట్లు, కండువాలు, చీరలు, లుంగీలు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షుడు జాస్తి లక్ష్మీపతి, కార్యదర్శి మల్లెల రామకృష్ణ, నారు రామారావు, మెరకనపల్లి నాగేశ్వరరావు, తంగిరాల పౌలు, మల్లవరపు జ్యోతి, దేవపొంగు కృపారావు, జంతిక నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

భారతీనగర్: మూడవ డివిజన్‌లోని నాగార్జున నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ రోడ్డులో వరద ముంపు బాధితులకు తానా, అక్షయ పాత్రవారు అందించిన నిత్యావసర సరుకులను శనివారం టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యలమంచలి రాజేష్, చలసాని శ్రీనివాస్, కాలనీ పెద్దలు, పాల్గొన్నారు.

బియ్యం వితరణ

వన్‌టౌన్: సింగ్‌నగర్‌లో వరద ముంపునకు గురైన పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ స్వీపర్లకు శనివారం బియ్యం వితరణ కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట డిపో మేనేజర్, సిబ్బంది వెయ్యి కిలోల బియ్యంను వరద బాధితుల సహాయార్థం పంపించారు. ఈ బియ్యాన్ని జిల్లా డీపీటీవో ఎం.వై.దానం ఆధ్వర్యంలో బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ధర్నాచౌక్: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రామ సర్వేయర్ల బృందం సహకారంతో టీడీపీ నేతలు పరుచూరి ప్రసాద్, సురవరపు నాగరాజు ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ శనివారం జరిగింది. 64వ డివిజన్ కండ్రిలోని సుమారు 500 మంది బాధితులకు సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వీటిని అందజేశారు. ఆర్. రామకృష్ణ, అయ్యప్ప, పి.సాయి రామ్, కే.నాగేంద్ర కుమార్, అబ్దుల్ సర్దార్, మహ్మద్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.



బస్‌స్టేషన్ స్వీపర్లకు బియ్యం అందిస్తున్న ఎంవై దానం, బాధితులకు సరుకులు ఇస్తున్న బొండా

అమెరికన్ ఆస్పత్రి దగ్గర యూటర్న్ ఉండేలా చూస్తా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, సెప్టెంబరు 14 : కృష్ణలంక జాతీయ రహదారిపై అమెరికన్ ఆసుపత్రి దగ్గర మూసివేసిన యూ టర్న్‌ను తెరిపించేలా నేషనల్ హైవే, మున్సిపల్, పోలీస్, ఆర్టీఏ అధికారులతో తాను మాట్లాడతానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం ఉదయం కృష్ణలంక 20వ డివిజన పరిధిలోని జాతీయ రహదారిపై అమెరికన్ ఆస్పత్రి వద్ద వున్న యూ టర్న్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ట్రాఫిక్ ఏసీపీ ఎస్.ఆర్.వంశీధర్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీవీ రమణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతంగా వుండేందుకు, ప్రమాదాలు జరగకుండా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారన్నారు. అమెరికన్ ఆస్పత్రి దగ్గర వున్న యూ టర్న్‌ను మూసివేయడం వల్ల కృష్ణలంక వాసులు చాలా దూరం వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇక్కడ యూ టర్న్ మూసివేశారని చెప్పారు. అమెరికన్ ఆసుపత్రి దగ్గర వున్న వంతెన విస్తరించడంతో పాటుగా రోడ్డు విస్తరించడం వల్ల ప్రమాదాలు జరగకుండా చూడవచ్చునని తెలిపారు. స్థానికులు ఇక్కడ రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. రోడ్డు విస్తరణ గురించి అధికారులతో, కమిషనర్‌తో మాట్లాడతానని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. ప్రజల కోరిక మేరకు ఇక్కడ యూ టర్న్ వుండేలా అధికారులతో మాట్లాడతానని గద్దె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, అడపా శేషు, నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొడాలి సాయిబాబు, చింతా వెంకటేశ్వరరావు, గోగుల రమేష్, వేముల దుర్గారావు, పి.అన్నారావు, జనసేన డివిజన్ అధ్యక్షుడు జి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కె.రంగరాజన్, అడపా శేషు, పూజలు నిర్వహించిన గద్దె క్రాంతికుమార్

అన్నదాన కార్యక్రమం

రాణిగారితోట, సెప్టెంబరు 14: కృష్ణలంక ద్వారకానగర్ 3వ లైన్‌లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ మాజీ డీజీఎం కె.రంగరాజన్, కార్పొరేటర్ అడపా శేషు ప్రారంభించారు. 1000 మంది అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● రాణిగారితోట 17వ డివిజన్‌లో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు వై.సిద్ధార్థ పాల్గొన్నారు.

చవితి పందిరిలో గద్దె క్రాంతి పూజలు

కృష్ణలంక: కృష్ణలంకలోని నిర్మలా శిశుభవన్ వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన చవితి పందిరిలో శనివారం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాదర్ల నాని, చింతపల్లి వంశీ, కంచర్ల అవినాష్, నాగవరపు బాబ్జీ, పోదూరు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పటమట: 14వ డివిజన్ దర్శిపేట రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, 15వ డివిజన్ రఘురోడ్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ ప్రారంభించారు. దేవస్థాన కమిటీ సభ్యులు అప్పారావు, అంబటి సతీష్, శీతాల మురళీకృష్ణ, ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.



వేడుకల్లో నాగుల్‌మీరా

ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవం

భవానీపురం : 44వ డివిజన్ నాలుగు స్థంభాల సెంటర్లోని నాగేంద్ర బాలభక్త సమాజం ఆధ్వర్యంలో గణేశ్ మహరాజ్ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి వైభోవోపేతంగా నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాల నడుమ, యువత కోలాటంతో ఉత్సవమూర్తి పురవీధుల్లో ఊరేగారు. అనంతరం కృష్ణానదీలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు బడుగు గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు.



ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

లబ్బీపేట, సెప్టెంబరు 14: సిద్ధార్థ మహిళా కళాశాలలో గత 9రోజుల నుంచి కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఏటీఏఎల్) అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంప్లిమెంటింగ్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఐవోటీ ఇన్ ఏఐ రీసెంట్ ట్రెండ్స్ అనే అంశంపై ఒక వీక్ ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ వారం రోజులు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన, ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజు పలు కళాశాలల నుంచి అధ్యాపకులు, పీజీ విద్యార్థులు 67మంది హాజరయ్యారని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు టెక్నాలజీలో నైపుణ్యత సాధించడానికి ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.మాధవి, మెహనరూప, వి.సంధ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

● ట్రాఫిక్ సీఐ రామారావు

పటమట, సెప్టెంబరు 14 : కార్పొరేట్ కళాశాలలు తమ విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సుల విషయంలో కచ్చితమైన నియమ, నిబంధనలు పాటించాలని 4వ పట్టణ ట్రాఫిక్ సీఐ రామారావు కోరారు. పటమటలో శనివారం బస్సు డ్రైవర్లుకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, సరైన అర్హతా పత్రాలను కలిగి ఉండాలని, వాహనాల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు బస్సులను నడపరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామారావు హెచ్చరించారు.

ఘనంగా గాడిచర్ల జయంతి

పటమట, సెప్టెంబరు 14 : గ్రంథాలయ, వయోజన ఉద్యమాల నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 141వ జయంతి కార్యక్రమం గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్‌లోని శ్రీ సర్వోత్తమ భవనంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రా లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ డి ప్రసాద్, గాడిచర్ల ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, గ్రంథాలయ సంఘ సభ్యులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మైగ్రేన్ తలనొప్పిపై అవగాహన సదస్సు

పటమట: మైగ్రేన్ తలనొప్పిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.లక్ష్మి అనూష పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె మాట్లాడుతూ వైద్యుల సలహాలతోనే మందులుతీసుకోవాలన్నారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.



మల్లేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళం

వన్‌టౌన్, సెప్టెంబరు 14: ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర ఆలయ అభివృద్ధి నిమిత్తం దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ బాబు కుటుంబ సభ్యులు శనివారం ఆలయానికి విచ్చేసి అధికారుల ద్వారా లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.

భారతీయులను ఏకం చేసే ఏకైక భాష హిందీ

గాంధీజీ మహిళా కళాశాల హిందీ విభాగాధిపతి వసుంధరాదేవి



వన్‌టౌన్, సెప్టెంబరు 14: భారతీయులందరినీ ఏకం చేసే భాష హిందీ మాత్రమేనని గాంధీజీ మహిళా కళాశాల హిందీ విభాగాధిపతి కె. వసుంధరాదేవి అన్నారు. శనివారం కళాశాలలో హిందీభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమయంలో హిందీ ఎంతగానో ఉపయోగపడిందని చెప్పారు. మహాత్మాగాంధీ దక్షిణ భారతీయులకు హిందీ నేర్పించే ఉద్దేశ్యంతో మద్రాసులో దక్షిణ భారత హిందీ ప్రచార సభను ఏర్పాటు చేశారన్నారు. హిందీని దేశభాషగానే కాకుండా రాజభాషగా కూడా గుర్తించారన్నారు. ఏటా సెప్టెంబరు 14న హిందీ దినోత్సవాన్ని జరుపుకుంటూ దాని ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రజలలో హిందీ భాష వ్యాప్తిని చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కె.వి.పిచ్చియ్య, కార్యదర్శి, కరస్పాండెంట్ సి.ఎల్.కాంతారావు, కళాశాల ప్రిన్సిపాల్ రమణశ్రీ పాల్గొన్నారు.

వీణాపాణి అలంకారంలో బాలగణపతి స్వామి



వన్‌టౌన్, సెప్టెంబరు 14: స్థానిక పూలబావి వీధిలోని బాలగణపతి స్వామి ఆలయంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్వామివారు శనివారం భక్తులకు వీణాపాణి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు స్వామికి ప్రత్యేకంగా అలంకారం చేసి పూజలు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మిడ్‌టౌన్ సౌజన్యంతో కోలాటం పోటీలు జరిగాయి. నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గ్రంధి శ్రీనివాసరావు, సెక్రటరీ మామిడి కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ ఆతుకూరి రామనరసింహారావు, ట్రెజరర్ మండేపూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం

● రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ సమరం



ఎన్‌సీసీ కేడెట్స్‌తో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం

లబ్బీపేట, సెప్టెంబరు 14: ప్రతి ఒక్కరికీ ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన ఉండాలని, సీపీఆర్ ఎలా చేయాలో తెల్సుకోవడం వలన ప్రాణాలు నిలబెట్టవచ్చని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ సమరం అన్నారు. వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా నలంద డిగ్రీ కళాశాలలో శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సెప్టెంబరులో వచ్చే రెండో శనివారం వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే గా జరుపుకుంటామని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా అందించాల్సిన ప్రాథమిక చికిత్స అందరికి తెలియడం ఎంతో ఉపయోగం అని అన్నారు. ఈ సందర్భంగా వరద బాధితులకు సహాయ సహకారం అందించిన ఎన్‌సీసీ కేడెట్లను యూత్ రెడ్‌క్రాస్ తరఫున అభినందించారు. రెడ్‌క్రాస్ సభ్యులైన రాధిక విద్యార్థులకు ప్రాక్టికల్‌గా సీపీఆర్ ఏవిధంగా చేయాలో చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్

మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.



క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్ ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.

దిక్సూచి
DIKSUCHI

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా



శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

నవ్య | చిత్రజ్యోతి

సమంతకు అరుదైన గౌరవం



నటి సమంతకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) ఉత్సవం అవార్డ్స్ కార్యక్రమం ఈ నెల 27న దుబాయ్‌లో జరగనుంది. కార్యక్రమంలో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో సన్మానించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. "ఈ తరానికి చెందిన ఉత్తమ నటుల్లో సమంత ఒకరు. తన వైవిధ్యమైన పాత్రలతో అభిమానులను నిరంతరం ఆకట్టుకునే ఆమెకు ఈ అవార్డును అందజేయటం ఆనందంగా ఉంది" అని ఐఫా నిర్వాహకులు తెలిపారు. "ఐఫా ఉత్సవం నాకెల్లప్పుడూ ప్రత్యేకమే. దక్షిణాది సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు తెలియజెప్పే ఈ వేదికపై పాల్గొనడానికి నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని సమంత పేర్కొన్నారు.

150 మంది ఫైటర్లు... 300 మంది జూనియర్స్



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌ను అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ చిత్రీకరణంలో 150 మంది ఫైటర్లు, 300 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. సినిమాకు ఈ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాఘవ లారెన్స్ 25వ సినిమా



'రాక్షసుడు', 'ఖిలాడీ' చిత్రాల తర్వాత నిర్మాత కోనేరు సత్యనారాయణ మరో భారీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించనున్నారు. ఇది ఆయనకు 25వ సినిమా కావడం గమనార్హం. ప్యాన్ ఇండియా రేంజ్‌లో తెర కెక్కనున్న ఈ సినిమాకు రమేశ్ వర్మ దర్శకుడు. ఆయనతో కోనేరు సత్యనారాయణ తీస్తున్న మూడో చిత్రం ఇది. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సినిమా గురించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

దేవర సినిమాను కలిసి చూద్దాం

అభిమానికి ఎన్టీఆర్ వీడియో కాల్





బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ శనివారం పరామర్శించారు. కౌశిక్ బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆ అభిమానితో దాదాపు 10 నిమిషాలు ఎన్టీఆర్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. "నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావు. ధైర్యంగా ఉండు. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకో. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి. త్వరలోనే కలుద్దాం. 'దేవర' సినిమాను ఇద్దరం కలసి చూద్దాం. ట్రీట్‌మెంట్ ఖర్చులకు సాయపడతాను" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. అలాగే కౌశిక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ వీడియో కాల్‌లో కౌశిక్ మాట్లాడుతూ "అన్నా. మిమ్మల్ని అస్సలు అనుకోలేదు" అని అన్నారు. దానికి బదులుగా ఎన్టీఆర్ "భలే వాడివే. నీతో మాట్లాడకుంటే ఎలా" అని అన్నారు. ఇటీవలే కౌశిక్ తల్లి ఓ వీడియో ద్వారా కుమారుడి ఆరోగ్య పరిస్థితి, జూనియర్ ఎన్టీఆర్ పట్ల తన కుమారుడికి ఉన్న అభిమానాన్ని తెలిపారు. దీంతో స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, తిరుపతికి చెందిన తమ అభిమానసంఘం కన్వీనర్ కృష్ణయాదవ్‌ను బెంగళూరుకు పంపించారు. తనతో మాట్లాడించాలని సూచించారు. దీంతో కృష్ణయాదవ్‌తో పాటు అభిమానసంఘం కన్వీనర్‌లు మాణిక్యం, బసవ కిద్వాయ్ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విజయ్‌కి ఇదే ఆఖరి చిత్రమా?



అగ్రహీరో విజయ్ నటించే తదుపరి చిత్రాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. 'విజయ్69' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. మరో అగ్రహీరో అజిత్ కుమార్‌కు 'నెర్కొండ పార్వై' 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందించిన హెచ్.వినోద్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ సినిమాలో పూజా హెగ్డే, సిమ్రాన్, మమిత బైజులను ఎంపిక చేయగా, విలన్ పాత్రను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పోషిస్తున్నారు. కెమెరా: సత్యన్ సూరియన్. ఈ చిత్రానికి సంబంధించి విడుదల చేసిన పోస్టరులో 'త్వరలోనే ప్రజాస్వామ్యానికి వెలుగు చూపే వ్యక్తి రాక..' అంటూ ఆంగ్లంలో రాయగా, ఒక చేతితో టార్చిను పట్టుకుని కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రం తర్వాత విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పి.. పూర్తిస్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఆయన 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

యుద్ధం నేపథ్యంలో ప్రేమకథ





సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. జనవరిలో సినిమాను మేకర్స్ ప్రకటించిన మేకర్స్. వచ్చే ఏడాది క్రిస్‌మస్‌కు సినిమాను విడుదల చేస్తున్నట్లు మొదట తెలిపారు. అయితే, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని మార్చారు. 2026లో మార్చి 20న రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ ఎపిక్ లవ్ డ్రామా కథేంటేంటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సినిమా కథను మేకర్స్ ప్రకటించకున్నా.. ఇది యుద్ధం నేపథ్యంలో జరిగే ప్రేమకథ అని టాక్ వినిపిస్తోంది. అదే రోజున షారుక్ ఖాన్ నటించిన క్రైమ్ డ్రామా 'కింగ్' సినిమా విడుదలవుతోంది. కాగా, సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోనే 'సావరియా' చిత్రంతో రణ్‌బీర్ సినీ రంగ ప్రవేశం చేశారు.

విడుదలకు ముందే అరవై అవార్డులు

ఇన్ ప్రోగ్రెస్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకురాలు హరిత గోగినేని రూపొందిస్తున్నారు. సుజాత రెడ్డితో కలసి ఏ.ఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అరవైకి పైగా అవార్డులు పొంది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. 'ఫియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు ప్రభు దేవా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

కమ్ బ్యాక్ ఫిల్మ్



'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి', 'అన్నయ్య', 'ప్రేమ కోసం', 'శివరామరాజు' తదితరులు చిత్రాల్లో నటించిన హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'హరుడు'. హెబ్బా పటేల్, సలోని, నటషా, అలీ ఇతర ముఖ్య పాత్రధారులు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు చెప్పారు. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

కౌన్ బనేగా కరోడ్‌పతిలో.. పవన్‌పై ప్రశ్న



పవన్‌కల్యాణ్‌కు ఇండియా వైడ్ ఉన్న క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం మరోసారి రుజువైంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 16కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అమితాబ్ బచ్చన్.. కంటెస్టెంట్‌ను ఓ ఆసక్తికర ప్రశ్నను అడిగారు.. జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా భాద్యతలు స్వీకరించిన వ్యక్తి ఎవరు? అని. ఇందుకు కంటెస్టెంట్ ఆడియన్స్ పోల్ ఎంచుకున్నారు. ఆడియన్స్‌లో 50శాతం మంది పవన్ అని జవాబు చెప్పారు. దీంతో ఈ సమాధానాన్ని లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ. లక్ష అరవై వేలు గెలుచుకుని మరో ప్రశ్నకు వెళ్లారు.

ఎంత గౌరవమో!



తెలుగుజాతి గర్వించదగ్గ నటుడు నందమూరి తారకరామారావు. చిత్ర పరిశ్రమలో తను ఎదుగుతూ మరెందరికో అవకాశాలు కల్పించి ఆదుకున్న మంచి వ్యక్తిగా ఎన్టీఆర్‌కు పేరుంది. అలా ఆయన ఆశీస్సులతో తన కెరీర్‌ను చక్కగా మలుచుకున్న పాత తరం హీరోల్లో కాంతారావు ఒకరు. తొలి సినిమా 'ప్రతిజ్ఞ' తర్వాత సరైన అవకాశాలు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోదామనుకున్న ఆయన్ని పిలిచి తన సొంత చిత్రం 'జయసింహ'లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. అలాగే 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కూడా ఎన్టీఆర్ గట్టి రికమండేషన్‌తోనే కాంతారావుకు దక్కింది. అలా ఎన్నోసార్లు తనని ఆదుకొన్న ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో అభిమానం, గౌరవం. కాంతారావు సొంత సినిమా పూజా కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరైన అరుదైన దృశ్యం ఇది. ఇందులో హీరోయిన్ జయంతి కూడా ఉన్నారు.

ఆదివారం

సంబరం

ఓనమ్‌కు 'కసావు' కళ

లేతపసుపు... శ్వేతవర్ణం మిళితమైన చేనేతపై బంగారపు అంచు అద్దుకొని... మగువకు వన్నెలద్దుతుంది కేరళ సంప్రదాయ చీర 'కసావు'. కళాకారుల అద్భుతమైన పనితనం... రెండు వందల ఏళ్లకు పైబడిన చరిత్ర గల ఈ చీరను నిత్యనూతనంగా నిలుపుతోంది. 'ఓనమ్ చీర'గా కూడా ఖ్యాతికెక్కిన 'కసావు' కళాత్మకతకు మళయాళ ప్రాంతంలోనే కాదు... దేశవిదేశాల్లోనూ అభిమానులున్నారు. ఈ చీర అంతటి అపురూపం ఎందుకైంది..! ఓనమ్ సందర్భంగా ఒకసారి ఆ కథలోకి వెళదాం.



ఒక్క ఓనమ్‌నాడే కాదు... కేరళలో ఏ పర్వదినమైనా మహిళలు కసావు చీరలో మెరుస్తారు. ఇది అక్కడ తరతరాలుగా అనుసరిస్తున్న వారసత్వం. రెండు వందల ఏళ్లనాటి ఈ కళ కాలక్రమంలో ఎన్నో హంగులు, వర్ణాలు సంతరించుకుంది. కానీ పండుగల, ప్రత్యేక సందర్భాలప్పుడు ఐవరీ (దంతం) కలర్ కాటన్ వస్త్రంపై... అందంగా బంగారు పోగులు పేర్చిన చీరదే నేటికీ అగ్రస్థానం. దీనికి భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

'కసావు' అనేది కేరళలో ఒక పురాతన చేనేత పద్ధతి. ఆ పేరుతోనే ఈ చీరలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఈ పద్ధతిలో అతిసున్నితమైన బంగారం, వెండి దారాలతో అంచును నేస్తారు. ఇదే సాంకేతిక విధానంతో 'ముండు' (ధోవతీ)పై కూడా అంచులు వేస్తారు. దీన్ని వారు 'కసావు ముండు' అంటారు. అంతేకాదు... కేరళలో జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ సాధించిన మొట్టమొదటి చేనేత కళ ఇది. ప్రధానంగా ఆ రాష్ట్రంలోని బలరామపురం, చెండమంగళం, కుతమ్‌పుల్లి గ్రామాలు ఈ నేతకు ప్రసిద్ధి.

ట్రావెన్‌కోర్ రాజవంశీయుల కాలంలో 'కసావు' చీరలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. మహారాజా బలరామ వర్మ... తమిళనాడులోని వల్లియూర్ నుంచి సాలియా సామాజిక వర్గానికి చెందిన చేనేత కళాకారుల కుటుంబాలను బలరామపురానికి తీసుకువచ్చారు. కేవలం తమ రాజవంశీయులకు సంబంధించిన వస్త్రాలు నేసేందుకు వారిని ఉపయోగించుకున్నారు. బలరామపురం చీరలు బ్లీచింగ్, డైయింగ్ లేని సహజసిద్ధమైన కాటన్ (కోరా)తో రూపొందిస్తారు. వేసవిలో కేరళ ఉక్కపోత వాతావరణానికి ఇవి సరిగ్గా సరిపోతాయి. కాలక్రమంలో మోటిఫ్స్, జరీతో టెంపుల్ బోర్డర్స్ వంటివి చీరపై సింగారించుకున్నాయి. పుతమ్‌పుల్లి కళాకారులను కొచీ మహారాజు ప్రోత్సహించారు. వందల ఏళ్లు గడిచినా ఈ చీరల సొగసులానే... వాటిపై మనసు పడే మగువలు అంతకంతకూ పెరుగుతున్నారే కానీ... ఇసుమంతైనా తగ్గలేదు. అదే కసావు కళ ప్రత్యేకం.

అలాంటి పాటలు రాసేందుకు ఇష్టపడతా!

దాదాపు 100 సినిమా పాటలు.. 750కి పైగా సీరియల్స్‌కి పాటలు రాసిన గీత రచయిత ఆయన. ఇటీవలే 'ఇండియా ఫైల్స్' చిత్రం కోసం ఆయన రాసిన 'తిరిగి చూడు తిరిగి చూడు తిరుగుతున్న భూవిని... కలిసి చూడు కలిసి చూడు మనిషిలోని మనిషి' పాట అనేక మంది హృదయాలను గెలుచుకుంది. సాహిత్య విలువలు ఉన్న పాటలు రాయడానికి ఇష్టపడే ఆ రచయిత మౌనశ్రీ మల్లిక్. "ఇండియా ఫైల్స్" చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఆయనతో 'నవ్య' ముచ్చటించింది.

మీ సాహిత్య ప్రయాణం ఎలా మొదలైంది?

మాది వరంగల్‌లోని వర్ధన్నపేట. నాకు చిన్నప్పటి నుంచి సాహిత్యం అంటే ఎంతో ఇష్టం.



ఎప్పటికైనా సినీ పాటల రచయితగా మారాలనే సంకల్పంతో రచనలు చేసేవాడిని. జర్నలిస్టుగా కొన్నాళ్లు పనిచేశాను. నేను రాసిన 'దిగంభర', 'గరళం', 'తప్తస్పృహ' కవితా సంకలనాలకు 30కి పైగా పురస్కారాలు వచ్చాయి. సినిమా పాటలు రాయాలని ఇండస్ట్రీకి వచ్చి.. మొదట సీరియల్స్‌కు పని చేశాను. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ప్రోత్సాహంతో 'కోయిలమ్మ' అనే సీరియల్‌లో 550కి పైగా పాటలు రాశాను. 'కృష్ణ తులసి' అనే సీరియల్‌లో 200కి పైగా భక్తి పాటలు రాశాను. ఆ తర్వాత 2010లో 'చేతిలో చెయ్యేసి' సినిమాలో 'చిలిపి చిలిపి' అనే పాటను రాశాను. ఇప్పటి వరకు దాదాపు 50 సినిమాల్లో.. 100కు పైగా పాటలు రాశాను.

మీకు బాగా గుర్తింపు తెచ్చిన పాటలు...

నేను రాసిన పాటల్లో 'చేతిలో చెయ్యేసి' చిత్రంలోని పాట ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. 'గుడ్ మార్నింగ్' చిత్రంలో నేను రాసిన 'ఎదలో నదిలాగ కదిలిన భావాలు' పాటను ఆలపించినందుకు గీతా మాధురికి నంది అవార్డు వచ్చింది. 'ఐపీసీ సెక్షన్ భార్య బంధు'.. 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్'.. 'చెంబు చిన సత్యం' సినిమాల్లోని పాటలకు సాహితీపరమైన ప్రశంసలు వచ్చాయి. 'ఇండియా ఫైల్స్' చిత్రంలో రాసిన 'తిరిగి చూడు', 'జై ఇండియా' సాంగ్‌కు విశేషమైన స్పందన వస్తోంది.

గుర్తుండిపోయే ప్రశంసలు

నా ఆరాధ్య దైవం..దివంగత గాయకుడు ఎస్.పి.బాలసుబ్రమణ్యం.. సంగీత దర్శకులు ఎమ్.ఎమ్.కీరవాణి, సాలూరి కోటేశ్వరరావు (కోటి)లు నా పాటల్లోని సాహిత్యాన్ని మెచ్చుకోవడం.

నటుడిగానూ కొన్ని సినిమాల్లో చేసినట్లున్నారు....

అవునండీ! నాలుగైదు చిత్రాల్లో నటించాను. అదీ దర్శక నిర్మాతల కోరిక మేరకు.

ఎలాంటి పాటలు రాయడమంటే ఇష్టం?

రచనకు అలాంటి పరిధులు ఏవీ పెట్టుకోలేదు. అవసరానికి తగినట్లు అన్ని రకాల పాటలు రాయాలనుంది. సాహిత్య విలువలు ఉన్న పాటలు రాసేందుకు ఎక్కువ ఇష్టపడతా.

'ఇండియా ఫైల్స్' చిత్రం గురించి చెప్పండి?

దేశంలోనే కల్చరల్ డీ.ఎన్.ఏ సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న మొదటి చిత్రమిది. సామాజిక స్పృహను మేల్కొలిపేలా ఉంటుంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య లు.. వాటి పరిష్కారాలను ఇందులో చూపించాము. బొమ్మకు మురళీ దర్శకత్వ పటిమ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. రాజకీయ నాయకుడు అద్దంకి దయాకర్ కథానాయకుడి పాత్రకు జీవం పోశారు. ఇందులో ఆయన పోషించిన పాత్ర గుర్తుండిపోతుంది.

> **మీరు అభిమానించే సినీ పాటల రచయితలు..?**
>
> సి.నారాయణరెడ్డి. ఆయన రాసిన అనేక సినిమా పాటలతో పాటు 'విశ్వంభర', 'ప్రపంచ పదులు' ఇష్టం. అలాగే వేటూరి సుందరరామ్మూర్తి, ఆచార్య ఆత్రేయ రాసిన పాటలు ఎంతో ఇష్టం.

• మోహన్ వర్మ

కొత్త సినిమాతో పాటు ఇండస్ట్రీలో వినిపించే పదం కాంబినేషన్. హీరోలు, హీరోయిన్లు, దర్శకుల కలయిక గురించి అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త కలయికకు వేదిక సిద్ధమౌతోంది. భిన్న ధ్రువాల్లాంటి దక్షిణాది, ఉత్తరాది చిత్ర పరిశ్రమల కాంబినేషన్ హిట్ ఫార్ములాగా మారుతోంది. పోటీ పడి నష్టపోవటం బదులు రెండు ఇండస్ట్రీలు పరస్పర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్న దృశ్యం ఆవిష్కారమవుతోంది.





హద్దులు చెరిగే... కలయిక కుదిరే

భారతీయ సినిమాకు పెద్దన్న అంటే బాలీవుడ్. కానీ కరోనా తర్వాత కథ మారింది. దక్షిణాది సినిమాలు, ముఖ్యంగా టాలీవుడ్ చిత్రాలు వసూళ్లలో, విజయాల్లో హిందీ సినిమాలతో పోటీ పడడమే కాదు బాలీవుడ్ రికార్డులను బ్రేక్ చేశాయి. తెలుగు చిత్రాలు 'పుష్ప', కార్తికేయ', కన్నడ నుంచి 'కేజీఎఫ్', 'కాంతార', మలయాళ సినిమాలు '2018, ఆడుజీవితం', తమిళం నుంచి 'విక్రమ్, జైలర్' లాంటివి బాలీవుడ్ లో భారీ వసూళ్లను రాబట్టాయి. స్ట్రెయిట్ చిత్రాలు సైతం వాటి ధాటికి నిలవలేకపోయాయి. ఉత్తరాది, దక్షిణాది పరిశ్రమల మధ్య పోటీ అనే అంశం అలా తెరపైకి వచ్చింది. కానీ పరిశ్రమలో మాత్రం అలాంటిదేం కనిపించలేదు. పోటీ భావన మనసులో ఉన్నా దాన్ని పక్కనపెట్టి పరస్పరం సహకరించుకుంటూ ఇరుపక్షాలు లాభపడుతున్నాయి. ఒకరి సినిమాలను మరొకరు ప్రమోట్ చేయడంతో పాటు, ప్రతిభావంతులైన నటీనటులకు కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తున్నారు. దీనివల్ల ఉత్తరాది, దక్షిణాది సినిమా అనే విభజన రేఖ క్రమంగా చెరిగిపోతోందని సినీ విశ్లేషకులు అంటున్నారు. హిందీ, దక్షిణాది పరిశ్రమలు పరస్పర ప్రయోజనాల కోసం పోటీని పక్కనపెట్టాయి. కటౌట్‌ను నమ్ముకుంటే పనికాదని అర్థం చేసుకున్న బాలీవుడ్ సినీ ప్రముఖులు మంచి కంటెంట్ కోసం దక్షిణాది పరిశ్రమతో చేతులు కలుపుతున్నారు. ఈ అవకాశాన్ని సౌత్ పరిశ్రమ అందిపుచ్చుకుంటోంది. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను అందించడం ద్వారా బాలీవుడ్‌లో పాగా వేస్తోంది. ఇలా ఉత్తరాది, దక్షిణాది పరిశ్రమలు కలసి పనిచేయడం తెలివైన వ్యూహం అని రుజువైంది. బాలీవుడ్ ఇండస్ట్రీతో కలవడం ద్వారా తెలుగ సినిమాకు సరికొత్త మార్కెట్ పరిచయమవుతోంది.



మనమంతా ఒక్కటే

అలాగే ఇటీవలే ముంబైలో నిర్వహించిన ఈఫా 2024 వేడుకల సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న రానా వేదికపైన ఉన్న షారూఖ్‌ఖాన్ పాదాలను తాకి నమస్కరించారు. షారూఖ్ వెంటనే రానాను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమంత కూడా కొన్ని రోజుల క్రితం ఓ ప్రచార కార్యక్రమంలో కరణ్ జోహార్ పాదాలను తాకి నమస్కరించారు. ఇలాంటి సంఘటనల వల్ల మనమంతా ఒకటే అనే సందేశం బలంగా జనాల్లోకి వెళ్లి మంచి వాతావరణాన్ని సృష్టిస్తోంది.

దక్షిణాది అందాలకు అందలం

దక్షిణాది హీరోయిన్లకు బాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కుతోంది. సౌత్ నుంచి బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన రష్మిక మందన్న, సమంత అక్కడ కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. 'ది ఫ్యామిలీ మాన్ 2' సిరీస్‌తో హిందీ జనాలకు చేరువయ్యారు సమంత. ఆమె నటించిన 'హనీ-బన్నీ' హిందీ సిరీస్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సమంత విషయంలో ఇది కేవలం ఆమె నటన జీవితానికే పరిమితం కాలేదు. ఆమె విడాకులు తీసుకున్న సమయంలో, అనారోగ్యానికి గురైన సందర్భంలో బాలీవుడ్ వర్గాలు ఆమెకు బాసటగా నిలిచాయి. 'యానిమల్' సినిమా సూపర్‌హిట్ అవ్వడంతో బాలీవుడ్‌లో రష్మిక ప్రభ వెలిగిపోతోంది. అగ్రహీరోల చిత్రాల్లో ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. సల్మాన్‌ఖాన్‌తో 'సికందర్', విక్కీ కౌశల్ సరసన 'ఛావా' చిత్రాల్లో రష్మిక నటిస్తున్నారు. గ్లామర్ పాత్రల్లో రాణించే బాలీవుడ్ హీరోయిన్లకు భిన్నంగా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను పోషిస్తూ, మంచి విజయాలను దక్కించుకుంటున్నారు. అలాగే ఉత్తరాదిలోనూ వసూళ్ల మోత మోగించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం విజయంలో దీపికా పదుకొనే, అమితాబ్‌బచ్చన్ స్టార్‌డమ్ అక్కరకొచ్చిందనే చెప్పాలి.

సత్తా చూపుతున్న దక్షిణాది దర్శకులు

పరాజయాలతో డీలా పడిన బాలీవుడ్ స్టార్స్ హిట్ కొట్టేందుకు దక్షిణాది దర్శకులతో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. షారూఖ్ ఖాన్‌కు తమిళ దర్శకుడు అట్లీ 'జవాన్' చిత్రంతో భారీ విజయాన్ని అందించారు. అలాగే రణ్‌బీర్‌కపూర్‌కు 'యానిమల్' రూపంలో సాలిడ్ హిట్ ఇచ్చారు సందీప్‌రెడ్డి వంగా. అలాగే దక్షిణాది దర్శకులు, హీరోలతో సినిమాలు చేయడం ద్వారా బాలీవుడ్ బాక్సాఫీసు దగ్గర లాభపడుతోంది. హృతిక్‌రోషన్‌తో కలసి వార్ 2 చిత్రంలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. అలాగే రామాయణ్‌లో యష్ నటిస్తున్నారు. పలువురు సీనియర్ బాలీవుడ్ నటులు దక్షిణాది చిత్రాల్లో ప్రతినాయక పాత్రల్లో అలరిస్తున్నారు.

> **దేవరతో జిగ్రా**
>
> 'ఆర్‌ఆర్‌ఆర్' ఘన విజయం తర్వాత జూనియర్ ఎన్టీఆర్ పాన్ ఇండియా మార్కెట్‌పై గురిపెట్టారు. బాలీవుడ్‌లోనూ 'దేవర' ప్రచార కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నారు. అక్కడి సినీ ప్రముఖులు సైతం ఎన్టీఆర్‌కు తమవంతు సాయం చేస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహార్ 'దేవర' ప్రమోషన్స్ కోసం ఓ ఈవెంట్‌ను స్వయంగా నిర్వహించాడు. 'బ్రహ్మాస్త్ర సినిమా విడుదల సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు జూనియర్ ఎన్టీఆర్ ఎంతగానో సహకరించారు. ఆయన ప్రచారం వల్ల మా సినిమాకు వసూళ్ల పరంగా మంచి లబ్ధి చేకూరింది. తారక్ నాకు మంచి ఫ్రెండ్. మా అనుబంధం మున్ముందూ కొనసాగుతుంది' అని కరణ్ చెప్పారు. ఇదే కార్యక్రమంలో అలియాభట్, ఎన్టీఆర్‌ను కలిపి ఇంటర్వ్యూ చేయడం ద్వారా కరణ్ తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన 'జిగ్రా' సినిమాకు ప్రచారాన్ని కల్పించారు.



అలనాటి కథ

అరుదైన రాజకుమారి ఏస్రా!

రాజ కుటుంబాలలో మహిళలు ఎక్కువగా చదువుకోరనే అపోహ చాలా మందిలో కనిపిస్తూ ఉంటుంది. కానీ అది వాస్తవం కాదు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి.. తమ కళాదృష్టితో హైదరాబాద్ సంస్కృతికి మెరుగులు దిద్దినవారెందరో! అలాంటి వారిలో నా ప్రియ స్నేహితురాలు ప్రిన్సెస్ ఏస్రా ప్రథమ స్థానంలో నిలుస్తుంది.



1940, 50 దశకాలలో ప్రపంచంలోనే అత్యంత ధనిక రాజ్యాలలో హైదరాబాద్ ఒకటి. అలాంటి హైదరాబాద్‌ను పరిపాలించే రాజకుటుంబానికి కోడలుగా రావటమంటే సామాన్యమైన విషయం కాదు. అలాంటి సమయంలో- నిజాం మనవడు ప్రిన్సెస్ ముఖరం ఝా - టర్కీకి చెందిన రాజకుమారిని పెళ్లి చేసుకుంటున్నాడనే వార్తలు గుప్పుమన్నాయి. చాలా రోజుల పాటు ఆ యువరాణి ఎవరు? ఎలా ఉంటుంది? అందరితో కలివిడిగా ఉంటుందా? లేదా అనే విషయంపై చర్చించుకున్నట్లు గుర్తు. ఆ రాజకుమారే ఏస్రా. తన పుట్టింది టర్కీలో. 13 ఏళ్ల వయస్సులోనే లండన్‌కు వెళ్లిపోయింది. అక్కడే చదువుకుంది. 18 ఏళ్లకు ఫ్లోరెన్స్ విశ్వవిద్యాలయంలో చేరింది. ఆ సమయంలోనే ముఖరం ఝాను కలిసిందని.. వారిద్దరు ప్రేమలో పడ్డారని.. అయితే నిజాంకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. జవహర్‌లాల్ నెహ్రూ కలగజేసుకున్న తర్వాత నిజాం ఒప్పుకున్నారని చెప్పుకుంటూ ఉండేవాళ్లం. ముఖరం ఝా, ఏస్రాల పెళ్లి లండన్‌లో జరిగింది. నిఖా మాత్రం హైదరాబాద్‌లోనే జరిగింది. ఆ పెళ్లికి కేవలం నిజాం కుటుంబ సభ్యులను మాత్రమే పిలిచారు. నిజాంకు సన్నిహితంగా ఉండే మా కుటుంబాన్ని కూడా పిలిచిన జ్ఞాపకం లేదు. కానీ హైదరాబాద్ అంతా మాత్రం సుమారు వారం రోజులు వేర్వేరు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. అన్నదానాలు చేశారు. ప్యాలెస్‌లను అందంగా ముస్తాబు చేశారు. కొత్త దంపతులకు నిజాం హిల్‌ఫోర్ట్‌పై ఉన్న ప్యాలెస్‌ను కానుకగా ఇచ్చారు. వారు అక్కడ నివసించటం ప్రారంభించారు.

ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. రాజకుటుంబాలలో రాజకుమారిగా బతకటం అంత సులభం కాదు. అందమైన బట్టలు.. విలువైన నగలతో పాటుగా కుటుంబం భారం కూడా వారిపైనే పడుతుంది. స్వేచ్ఛగా బతకాలనుకొనేవారికి ఈ బంధనాలు ఇబ్బంది పెడతాయి. ఏస్రా విషయంలో కూడా అదే జరిగింది. నిజాం కుటుంబంలో నివసించే వారు కొన్ని మర్యాదలను తప్పనిసరిగా పాటించాలి. నిజాం అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదు. సామాన్య ప్రజలతో మాట్లాడకూడదు. ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు- వారికి ఎలాంటి మర్యాదలు చేయాలనే విషయంపై కూడా నిబంధనలు ఉంటాయి. కానీ ఇస్రా వీటిని పట్టించుకోలేదు. తనదైన జీవన విధానంతో హైదరాబాద్‌పై ముద్ర వేసింది. ఆ సమయంలో నేను ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఏజేయూసీ) కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేదానిని. ఇస్రా ఈ సంస్థకు పేట్రన్‌గా ఉండేది. ఇతర రాజకుటుంబీకులతో కలిపి మా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేది. బేగం బషీర్ యార్ జంగ్, బేగం ఫజులిద్దీన్ ఖాన్, మసూమా బేగం మొదలైన వారు ఈ సమావేశాల్లో పాల్గొనేవారు. ఈ సమావేశాల్లో పాల్గొనే మహిళలందరూ- చీర కొంగును తలపై కప్పుకొనేవారు. ఇస్రా మాత్రం అలాంటి ఆచారాలను పాటించేది కాదు. అందరితో కలిసిపోయేది. ఒక రోజు తను నాకు హఠాత్తుగా ఫోన్ చేసి- "నేను తిరుపతి వెళ్లాలను కుంటున్నాను" అంది. నాకు షాక్ కొట్టినట్లు అయింది. నిజాం కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లటమనేది జీర్ణించుకోలేకపోయా. నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. "నువ్వు నమ్మితే వెళ్లు" అన్నా. "వేల మంది దేవుడిని అక్కడికి వెళ్తున్నప్పుడు నేను ఎందుకు వెళ్లకూడదు?" అంది. నాకు మూసీకి వరదలు వచ్చిన సమయంలో మహబూబ్ ఆలీ పాషా హారతి ఇచ్చిన సందర్భం గుర్తుకు వచ్చింది. తను తిరుపతి వెళ్లి వచ్చిన తర్వాత నన్ను కలిసింది. "నువ్వు ఒక పెద్ద సాహసం చేశావు" అన్నా. తను నవ్వి ఊరుకుంది. తను విపరీతంగా పుస్తకాలు చదువుతుంది. ఈ విషయంలో మా ఇద్దరికీ అనేక పోలికలు ఉన్నాయి. మేమిద్దరం కలిసి పారిస్‌కు హాలిడేకు వెళ్లినప్పుడు- అక్కడకు అనేక పుస్తకాలు తీసుకువచ్చేది. పారిస్ నుంచి తిరిగి వచ్చే లోపులో వాటిని పూర్తి చేసేసేవాళ్లం. మేమిద్దరం నూర్ మహల్ గార్డెన్లో కూర్చుని టీ తాగిన అనేక సందర్భాలు నాకు ఇంకా గుర్తున్నాయి.



ఇక చౌమల్లా ప్యాలెస్, ఫలక్‌నామా ప్యాలెస్‌లకు పునర్వైభవాన్ని తీసుకురావటంలో ఆమె పాత్ర మరచిపోలేనిది. టాటా గ్రూపునకు ఫలక్‌నామా ప్యాలెస్‌ను లీజుకు ఇచ్చిన తర్వాత 10 ఏళ్ల పాటు వారితో కలిసి పనిచేసింది. ఆ ప్యాలెస్ ఓపినింగ్‌కు నేను కూడా వెళ్లా. నిజాం ముఖరం ఝా సహా అనేక మంది పాత స్నేహితులను కలిసా. ఈ రోజు ఆ ప్యాలెస్‌లకు ప్రపంచ వ్యాప్తంగా అంత పేరు ప్రఖ్యాతులు రావటంలో ఇస్రా పోషించిన భూమిక అపూర్వమనే చెప్పాలి. ఇప్పుడు కూడా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు నన్ను కలుస్తూ ఉంటుంది. మొదటి పరిచయంలో ఎంత ప్రేమను, అభిమానాన్ని చూపించిందో.. ఈ రోజుకు అదే ప్రేమాభిమానాలు చూపిస్తుంది. తన వ్యక్తిత్వం ద్వారా అనేక మందికి స్ఫూర్తిగా నిలిచిన ఇస్రా చాలా అరుదైన రాజకుమారి!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			**జియో సినిమా**		
కలినరీ క్లాస్ వార్స్	కొరియన్ సిరీస్	సెప్టెంబర్ 17	అమెరికన్ సొసైటీ ఆఫ్ మాజికల్ నీగ్రోస్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 15
ట్విలైట్ ఆఫ్ ది గాడ్స్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	దుర్గ	హిందీ సిరీస్	సెప్టెంబర్ 16
మాన్‌స్టర్స్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	**జో తేరా హై వో మేరా హై**	హిందీ చిత్రం	సెప్టెంబర్ 20
హిజ్ త్రీ డాటర్స్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 20	ది పెంగ్విన్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 20
ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో 2	టాక్ షో	సెప్టెంబర్ 21			
అమెజాన్ ప్రైమ్			**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్**		
ఎ వెరీ రాయల్ స్కాండల్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	అన్ ప్రిజన్డ్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 16
జీ 5			అగాథ	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 17
నుణక్కుళి	మలయాళ చిత్రం	సెప్టెంబర్ 15	ది జడ్జ్ ఫ్రమ్ హెల్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 21





గ్యాంగ్‌వార్

అధికారం కోసం అండర్ వరల్డ్ గ్యాంగ్‌ల మధ్య జరిగే అంతర్యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన సిరీస్ 'పెంగ్విన్'. క్రెయిగ్ జోబెల్ దర్శకత్వం వహించారు. గోతం సిటీలో వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఓస్వాల్డ్ అనే యువకుడు మాఫియా ప్రపంచంపై పై చేయి సాధించేందుకు వేసే ఎత్తుల నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రత్యర్థుల మధ్య పోరాటంలో సామాన్య ప్రజానీకం ఎలా నలిగిపోయిందనేది మనసుకు హత్తుకునేలా తెరకెక్కించారు.



కార్లపై భారీ డిస్కౌంట్లు

పండగ సీజన్‌లో రాయితీలు, ప్రోత్సాహకాలతో కస్టమర్లకు గాలం.. విక్రయాలు తగ్గడమే కారణం



న్యూఢిల్లీ: కార్ల కంపెనీలు కస్టమర్లకు భారీగా డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నాయి. గడిచిన కొద్ది నెలలుగా మార్కెట్లో కార్ల విక్రయాలు మందగించడంతో పాటు డీలర్ల వద్ద వాహన నిల్వలు ఆందోళనకర స్థాయికి పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. దాంతో కంపెనీలు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలతో కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో ఉన్నాయి. మారుతి సుజుకీ, టాటా మోటార్స్, హ్యుండయ్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా కార్స్ ఈ విషయంలో మిగతా కంపెనీల కంటే ముందున్నాయి. గత నెలలో వాహన సగటు విక్రయ ధరపై 10-12 శాతం వరకు రాయితీ కల్పించిన కంపెనీలు.. ఈ నెలతో పండగ సీజన్ కూడా ప్రారంభం కావడంతో డిస్కౌంట్ స్థాయిని 12-14 శాతం వరకు పెంచాయి. కొన్ని మోడళ్లపై క్యాష్ డిస్కౌంట్, కార్పొరేట్ ప్రయోజనాలు కలిపి రూ.3 లక్షలకు పైగా లబ్ధి కల్పిస్తున్నాయి. ఉదాహరణకు, గత నెలలో స్కార్పియో క్లాసిక్ ఎస్‌యూవీపై రూ.20,000కు పైగా రాయితీ కల్పించిన మహీంద్రా ఈ నెలలో డిస్కౌంట్‌ను ఏకంగా రూ.లక్ష వరకు పెంచింది.

రూ.3 లక్షల వరకు ప్రయోజనాలు: గత ఏడాది పండగ సీజన్‌లో రూ.25,000 నుంచి రూ.లక్ష వరకు రాయితీలు అందించిన కార్ల కంపెనీలు.. ఈసారి రూ.20,000 నుంచి రూ.3.15 లక్షల స్థాయిలో డిస్కౌంట్లు, ఇతర ప్రయోజనాలను ఆఫర్ చేస్తున్నాయి. టాటా మోటార్స్ తన హైయెస్ట్ సెల్లింగ్ ఎలక్ట్రిక్ మోడల్ నెక్సాన్ ఈవీపై రూ.3 లక్షల వకు డిస్కౌంట్ ప్రకటించింది. పంచ్ ఈవీపై రూ.1.20 లక్షలు, టియాగో ఈవీపై రూ.40,000 రాయితీ కల్పిస్తోంది. అక్టోబరు 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. అంతేకాదు, టాటా మోటార్స్ తన అన్ని మోడళ్ల పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ వెర్షన్లకూ భారీగానే ప్రోత్సాహకాలను అందిస్తోంది. టియాగోకు రూ.65,000 స్థాయి డిస్కౌంట్‌తో మొదలుకొని సఫారీపై రూ.1.80 లక్షల వరకు రాయితీ కల్పిస్తోంది. హోండా కార్స్ కూడా తన మోడళ్లపై రూ.1.15 లక్షల వరకు ప్రయోజనాలందిస్తోంది.

మోడల్	ప్రయోజనాలు (రూ.వరకు)	మోడల్	ప్రయోజనాలు (రూ.వరకు)
మారుతి సుజుకీ		**మహీంద్రా**	
ఆల్టో కే 10	61,000	బొలెరో	86,500
వ్యాగన్ ఆర్	63,000	బొలెరో నియో	1.34 లక్షలు
స్విఫ్ట్	57,000	థార్	1.55 లక్షలు
బ్రెజ్జా	42,000	స్కార్పియో క్లాసిక్	1.15 లక్షలు
బాలెనో	57,000	స్కార్పియో ఎన్	50,000
ఫ్రాంక్స్	40,000	**హోండా**	
గ్రాండ్ విటారా	1.23 లక్షలు	ఎలివేట్	75,000
హ్యుండయ్		సిటీ	1.14 లక్షలు
ఐ10 నియోస్	48,000	**ఫోక్స్‌వేగన్**	
ఆరా	43,000	టైగున్	1.20 లక్షలు
ఐ20	45,000	వర్టిస్	లక్ష
ఎక్స్‌టర్	33,000	**రెనో**	
వెన్యూ	70,000	ట్రైబర్	50,000
టాటా మోటార్స్		క్విడ్	40,000
నెక్సాన్	80,000		
నెక్సాన్ ఈవీ	3 లక్షలు		
హారియర్	1.60 లక్షలు		
సఫారీ	1.80 లక్షలు		

గమనిక: కార్ల కంపెనీలు అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్రం, నగరాన్ని బట్టి మారుతుంటాయి. పైన పేర్కొన్నవి సగటు ప్రయోజనాలు.

డీలర్ల వద్ద భారీగా నిల్వలు

ఆటోమొబైల్ డీలర్ల వద్ద కార్ల నిల్వలు భారీగా పేరుకుపోయాయి. గత నెల చివరి నాటికి డీలర్ల వద్ద నిల్వలు 7.80 లక్షల యూనిట్లకు చేరుకున్నాయని, వాటి విలువ రూ.77,800 కోట్ల స్థాయిలో ఉంటుందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ఈ మధ్యనే వెల్లడించింది. ఈ నిల్వలు 70 రోజులకు సరిపోతాయి. ఒకవైపు విక్రయాలు మందగించడం.. మరోవైపు నెలనెలా వాహన నిల్వలు పెరుగుతూ పోతుండటంతో డీలర్ల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఫాడా పేర్కొంది. పండగ సీజన్ ప్రోత్సాహకాలతోనైనా ఈ సమస్యకు కొంత ఉపశమనం లభిస్తుందని డీలర్లు ఆశావహంగా ఉన్నారు.

ఐపీఓకు ఎల్‌జీ ఇండియా!

రూ.12,500 కోట్లు సమీకరించే ఆలోచన

ముంబై: దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఇండియా వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ 150 కోట్ల డాలర్ల (రూ.12,500 కోట్లు) వరకు సమీకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా కంపెనీ 1,300 కోట్ల డాలర్ల స్థాయి మార్కెట్ విలువ దక్కే అవకాశం ఉంది. ఐపీఓ నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది.

బంధన్ బిజినెస్ సైకిల్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బిజినెస్ సైకిల్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులు, రిస్క్‌లకు అనుగుణంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు *24*. ఈ ఫండ్ కనీస పెట్టుబడి *రూ.1,000*.

ఇన్వెస్కో ఇండియా టెక్నాలజీ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇండియా టెక్నాలజీ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది పూర్తిగా టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఐటీ టీఆర్‌ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి *రూ.1,000*. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో కనీసం *రూ.500* ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల *17*.

1,500 ఎకరాల్లో ఏరోసిటీ ప్రాజెక్టులు

ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాల్లో అభివృద్ధి

జీఎంఆర్ గ్రూప్ సన్నాహాలు

ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తున్న జీఎంఆర్ గ్రూప్.. పెద్దఎత్తున రియల్టీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ మూడు విమానాశ్రయాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో ఏరోసిటీ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఈ ఏరోసిటీ ప్రాజెక్టుల్లో ఇండస్ట్రియల్, కమర్షియల్, హాస్పిటాలిటీ సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. ఢిల్లీ విమానాశ్రయంలో హోటల్స్, హాస్పిటల్స్, ఆఫీస్ స్పేస్‌తో పాటు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సీనియర్ లివింగ్, కో-లివింగ్ సదుపాయాలు సహా కార్యాలయ స్థలాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు గోవా విమానాశ్రయంలో రిటైల్ డిస్ట్రిక్ట్, హోటల్స్, గోల్ఫ్ కోర్స్‌తో పాటు విల్లాలను నిర్మించాలని చూస్తోంది. అయితే హైదరాబాద్ విమానాశ్రయంలో తొలుత పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలని జీఎంఆర్ గ్రూప్ భావిస్తోంది. కాగా విమానాశ్రయాల్లో సమీకృత కమర్షియల్ ప్రాజెక్టులను ఏరోసిటీ బ్రాండ్ కింద జీఎంఆర్ గ్రూప్ అభివృద్ధి చేస్తోంది. ఢిల్లీ ఏరోసిటీ.. గ్రూప్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా ఉంది. ఢిల్లీ ఏరోసిటీని అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో జీఎంఆర్ గ్రూప్ పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. జీఎంఆర్‌తో పాటు భారతి రియల్టీ, ప్రెస్టీజ్ గ్రూప్ కూడా విమానాశ్రయాల్లో కమర్షియల్ ఆఫీస్ స్పేస్, రిటైల్, హోటల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాయి.

హైదరాబాద్‌కు ఆర్థిక చోదకశక్తిగా..

కాగా హైదరాబాద్ విమానాశ్రయంలో తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ఏరోసిటీ ప్రాజెక్ట్.. ఉద్యోగాల కల్పన, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి సారించింది. ఇప్పటికే ఈ ఏరోసిటీలో ఏవియేషన్, ఇండస్ట్రియల్ సెజ్‌లను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 50,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించటమే కాకుండా హైదరాబాద్ ఆర్థికాభివృద్ధికి కీలకంగా ఉంటుందని జీఎంఆర్ గ్రూప్ అంచనాగా ఉంది. మరోవైపు ఈ విమానాశ్రయంలో స్కూల్స్, యూనివర్సిటీ క్యాంపస్‌లు, హోటల్స్‌ను మరింతగా విస్తరించాలని భావిస్తోంది. ఇదే సమయంలో వాణిజ్య, ఐటీ పార్కులు, హెల్త్‌కేర్ ప్రాజెక్ట్‌ను కూడా డెవలప్ చేయాలని చూస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,890 ▲	68,650 ▲	97,000 ▲
ముంబై	73,044 ▲	66,908 ▲	86,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	123
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	122
కర్నూలు	115	నెల్లూరు	122
విశాఖపట్నం	106	అనంతపురం	122
గోదావరి	123		

జీఎస్‌టీలో కొత్తగా వచ్చిన మార్పులేమిటంటే?

ఇటీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ చట్టంలో ఇటీవల కొన్ని ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ వివరాలేమిటంటే..

మొదటిది జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ తమ బ్యాంక్ ఖాతా వివరాలు కచ్చితంగా తెలపాలి. ఈ నిబంధన సెప్టెంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కామన్ పోర్టల్ ద్వారా బ్యాంక్ వివరాలు నమోదు చేయాలి. ఒకవేళ ఈ వివరాలు ఇవ్వకుంటే ఆగస్టు నెలకు సంబంధించిన జీఎస్‌టీఆర్-1 లేదా ఐఎఫ్ఎఫ్ గానీ దాఖలు చేయలేరు. కాబట్టి జీఎస్‌టీలో నమోదైన అందరూ ఈ విషయాన్ని గమనించాలి.

ఇక రెండోది, రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద పన్ను చెల్లిస్తూ.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే వారి సౌలభ్యం కోసం ఒక కొత్త స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టారు. కొన్ని రకాల సర్వీస్‌లు లేదా గూడ్స్ కొనుగోలు చేసినప్పుడు అమ్మకందారుడు కాకుండా కొనుగోలుదారుడే ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. దీనినే ఆర్‌సీఎంగా వ్యవహరిస్తారు. ఆర్‌సీఎం కింద చెల్లించే పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా కాకుండా క్యాష్ ద్వారా చెల్లించాలి. ఈ విధంగా ఆర్‌సీఎం కింద చెల్లించిన పన్నును.. అర్హతను బట్టి తిరిగి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద తీసుకోవచ్చు. అయితే, ఇందులో ఒక్కోసారి కొంత గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ఆర్‌సీఎం కింద చెల్లించిన పన్నులకు, తీసుకున్న క్రెడిట్‌కు కొన్ని సందర్భాల్లో వ్యత్యాసం ఉండవచ్చు. దీనికి కారణాలు అనేకం. ఒక నెలలో పన్ను చెల్లించి, మరొక నెలలో క్రెడిట్ తీసుకోవచ్చు లేదా ఇతర కారణాలు కావచ్చు. ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా ఆర్‌సీఎం లయబిలిటీ/ఐటీసీ స్టేట్‌మెంట్ అనే స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టటం జరిగింది. తద్వారా పన్ను చెల్లింపుదారులు ఈ స్టేట్‌మెంట్‌లోని ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో తగు వివరాలు నింపవచ్చు. అంటే ఆర్‌సీఎంకి సంబంధించి ఇప్పటి వరకు తాము చెల్లించిన పన్ను కంటే తక్కువ క్రెడిట్ తీసుకుంటే ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో ఆ మొత్తాన్ని పాజిటివ్ విలువ కింద చూపాలి. ఒకవేళ చెల్లించిన మొత్తం కంటే తీసుకున్న క్రెడిట్ ఎక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని నెగటివ్ విలువ కింద చూపాలి. నెలవారీ రిటర్నులు దాఖలు చేసే వారు 2024 జూలై వరకు, త్రైమాసిక రిటర్నులు దాఖలు చేసే వారు 2024 జూన్ వరకు చెల్లించిన పన్ను, తీసుకున్న క్రెడిట్‌ను లెక్కించి పైన చెప్పిన విధంగా ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో చూపించాలి. క్రెడిట్‌ను లెక్కించటానికి తమకు అర్హత ఉన్న క్రెడిట్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి సరఫరాదారుడు తగు ఇన్వాయిస్ వివరాలతో జీఎస్‌టీఆర్-1 రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇలా నమోదు చేసిన వివరాలలో ఏవేనీ తేడాలు ఉంటే వాటిని ముందుగానే తెలుసుకోవటానికి ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎంఎస్) అనే కొత్త డాష్‌బోర్డ్‌ను కూడా ప్రవేశపెట్టింది. ఇది కొనుగోలుదారులకు చాలా సౌలభ్యం. ఈ కొత్త మార్పుల గురించి జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ తీసుకున్న వ్యక్తులు అవగాహన కలిగి ఉండటం మంచిది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్



కార్తీక్ జోడీకి ఐటీఎఫ్ టైటిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ యువ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి కైవసం చేసుకున్నాడు. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన ఫైనల్లో కార్తీక్-బాట్రోవ్ బోగ్దాన్ (రష్యా) జోడీ 6-2, 6-4తో స్కాలియా మాథ్యూ (ఫ్రాన్స్)-ఓజిక్ జాకుబ్ (అమెరికా) జంటపై నెగ్గి టైటిల్ విజేతగా నిలిచింది.

హర్మన్ డబుల్.. పాక్ ఢమాల్

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మరో గెలుపు

హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత జట్టు అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటికే సెమీఫైనల్ స్థానం ఖాయం చేసుకున్న మనోళ్లు..చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పైనా అదే జోరు కొనసాగించారు. శనివారం జరిగిన ఆఖరి లీగ్ పోరులో భారత్ 2-1తో పాకిస్థాన్‌ను ఓడించింది. అద్భుత ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (13, 19 ని)తో దుమ్ము రేపాడు. అహ్మద్ నదీమ్ (8వ) పాకిస్థాన్ తరపున గోల్ సాధించాడు. ఆరు జట్లు తలపడుతున్న రౌండ్ రాబిన్ లీగ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు ఇది వరుసగా ఐదో విజయం కావడం విశేషం. మరోవైపు పాకిస్థాన్‌పై 2016 నుంచి చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని మనోళ్లు కొనసాగించారు. చివరిసారి ఆసియా క్రీడల్లో తలపడినప్పుడు 10-2తో పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చేసిన విషయం తెలిసిందే. ఆసియాడ్‌కు ముందు చెన్నైలో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలోనూ మనోళ్లు 4-0తో గెలుపొందారు. ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్న పాకిస్థాన్‌కు ఈసారి టోర్నీలో ఇది తొలి ఓటమి. కాగా, సోమవారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనాతో పాక్, కొరియాతో భారత్ తలపడనున్నాయి.



పాక్ ఆటగాడి మొరటు ప్రవర్తన..

మ్యాచ్ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పాక్ ఆటగాడు అష్రాఫ్ వహీద్ రాణా మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం చోటు చేసుకుంది. భారత సర్కిల్‌లోపల జుగ్‌రాజ్‌ను అష్రాఫ్ భుజంతో బలంగా ఢీకొన్నాడు. ఆ ధాటికి కిందపడిపోయిన జుగ్‌రాజ్ నొప్పితో విలవిల్లాడాడు. దాంతో హర్మన్‌తోపాటు జర్మన్‌ప్రీత్..రాణా వద్దకు వెళ్లి నిలదీశారు. ఈక్రమంలో వారిమధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. వీడియో ఫుటేజ్ ద్వారా రాణా ప్రవర్తను పరిశీలించిన అంపైర్లు..ఎల్లో కార్డుతో అతడిని బయటకు పంపేశారు.

జులియన్‌దే 100

ఒలింపిక్ చాంపియన్‌కే డైమండ్ లీగ్ టైటిల్

షకారి రిచర్డ్‌సన్‌కు 8వ స్థానం



జులియన్ అల్ఫ్రెడ్

బ్రసెల్స్: స్ప్రింట్ క్వీన్ జులియన్ అల్ఫ్రెడ్ మరోసారి తన సత్తా చాటింది. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్లలో చాంపియన్‌గా నిలిచిన ఈ సెయింట్ లూసియా స్టార్.. ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌లోనూ అంతే దూకుడుగా పరిగెత్తింది. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో వంద మీటర్ల టైటిల్ నెగ్గి ఈ సీజన్‌ను ఘనంగా ముగించింది. ఇక్కడ జరిగిన ఫైనల్ రేసులో జులియన్ 10.88 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని స్ప్రింట్‌లో తనకు తిరుగులేదని నిరూపించుకుంది. ఇక, జులియన్‌కు పోటీ ఇస్తుందనుకున్న వరల్డ్ చాంపియన్, అమెరికన్ సంచలనం షకారి రిచర్డ్‌సన్ ఇక్కడ తేలిపోయింది. పోడియం ఫినిష్ కూడా చేయలేక 11.23 సెకన్ల టైమింగ్‌తో ఏకంగా ఎనిమిదో స్థానంలో నిలిచింది. బ్రిటన్ రేసర్ దినా అషర్ స్మిత్ (10.92 సె) రెండోస్థానంతో రన్నరప్‌గా నిలిచింది. ఐవరీ కోస్ట్‌కు చెందిన మేరీ జోసీ (11.05 సె)కి మూడోస్థానం దక్కింది. పురుషుల 100 మీటర్లలో జమైకా అథ్లెట్ అకీమ్ బ్లేక్ 9.93 సెకన్లతో విజేతగా నిలిచాడు. అమెరికా అథ్లెట్లు క్రిస్టియన్ కోల్‌మన్ (10.00 సె), ఫ్రెడ్ కెర్లీ (10.01 సె) 2, 3 స్థానాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల పోల్‌వాల్ట్‌లో స్వీడన్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ అదరగొట్టాడు. 6.11 మీటర్ల ప్రదర్శనతో అతను ప్రపంచ రికార్డు నెలకొల్పి విజేతగా నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ విజేత కూడా అయిన డుప్లాంటిస్.. ఈ ఏడాది వరల్డ్ రికార్డును బ్రేక్ చేయడం ఇది మూడోసారి కావడం విశేషం.



సబ్లేకు తొమ్మిదో స్థానం

భారత అథ్లెట్ అవినాశ్ సబ్లే డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నిరాశపరిచాడు. 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ ఈవెంట్‌లో పోడియం ఫినిష్ చేయడంలో విఫలమయ్యాడు. శుక్రవారం 30వ బర్త్‌డే సెలెబ్రేట్ చేసుకున్న అవినాశ్.. ఫైనల్స్‌లో 8 నిమిషాల 17.09 సెకన్ల టైమింగ్‌తో 9వ స్థానంలో నిలిచాడు. మొత్తం పది మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో చివరి నుంచి రెండోస్థానం దక్కించుకోవడం గమనార్హం. కెన్యా స్టార్ అమోజ్ సెరెమ్ (8 నిమిషాల 6.90 సెకన్లు) టైటిల్ దక్కించుకోగా, మొరాకోకు చెందిన ఒలింపిక్, వరల్డ్ చాంప్ సోఫినె (8 నిమిషాల 8.60 సె) రెండు, ట్యూనీషియా అథ్లెట్ మహ్మద్ అమిన్ (8 నిమిషాల 9.68 సె) మూడు స్థానాల్లో నిలిచారు.



'ఎర్రమట్టి'తో చెక్ పెట్టాలని!

పేస్ పిచ్ సిద్ధం

జోరుగా భారత బౌలర్ల ప్రాక్టీస్

19 నుంచి బంగ్లాతో తొలి టెస్టు

చెన్నై: ఆరు నెలల తర్వాత టీమిండియా టెస్టు ఫార్మాట్ బరిలోకి దిగబోతోంది. దీంట్లో భాగంగా ఈనెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు కోసం పకడ్బందీగా వ్యూహాలు రచిస్తోంది. ఎందుకంటే పాకిస్థాన్‌తో ఇటీవలే ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లా క్లీన్‌స్వీప్ చేసింది. అదే ఊపులో పటిష్ఠ టీమిండియాకు కూడా షాక్ ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. అయితే తమకన్నా బలహీన జట్టయినా బంగ్లాను రోహిత్‌సేన తక్కువగా చూడడం లేదు. అందుకే అద్భుతంగా రాణిస్తున్న వారి బౌలర్లకు ముకుతాడు వేసేందుకు చెపాక్‌లో ఎర్రమట్టితో కూడిన పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. అటు బంగ్లాలో కూడా బంక మట్టి ఎక్కువగా ఉండే నల్లమట్టి పిచ్‌లపైనే ఆడతారు. ఆరంభం నుంచే ఇవి స్పిన్నర్లకు అనుకూలిస్తుంటాయి. అందుకే బంగ్లా బౌలర్లకు అవకాశం ఇవ్వకూడదనే ఆలోచనతో ఎర్రమట్టి పిచ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇందులో క్లే తక్కువగా ఉంటుంది కాబట్టి ఆరంభంలో బౌన్స్ రాబడుతూ పేసర్లు చెలరేగుతారు. అంతేకాకుండా ఈ ఏడాది చివర్లో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించాల్సి ఉంది. అక్కడి పిచ్‌ల దృష్ట్యా కూడా ఈ మార్పులు చేసినట్టు సమాచారం. అయితే నెట్స్‌లో గంభీర్, మోర్కెల్ ఆధ్వర్యంలో భారత స్పిన్నర్లు నల్లమట్టి.. పేసర్లు ఎర్రమట్టి పిచ్‌లపై సాధన చేస్తున్నారు.

పేసర్ గుర్నూర్ బ్రార్‌తో.. నెట్స్‌లో భారత బ్యాటర్లకు బంతులు వేసేందుకు ఆరున్నర అడుగుల పంజాబీ పేసర్ గుర్నూర్ బ్రార్‌ను ప్రత్యేకంగా రప్పించారు. బంగ్లా జట్టులో కూడా ఇదే ఎత్తుతో పేసర్ నహీద్ రాణా ఉన్నాడు. పాక్‌తో జరిగిన రెండో టెస్టులో నహీద్ 5 వికెట్లతో చెలరేగాడు. అతడి బౌన్స్‌ను భారత్ దీటుగా ఎదుర్కొనేందుకే బ్రార్‌ను ఎంపిక చేశారు. తొలి టెస్టు మొదలయ్యేదాకా అతడు జట్టుతో పాటు ఉంటాడు.




నాది చిన్న పాత్రే: మోర్కెల్

భారత క్రికెట్ అభివృద్ధి కోసం కొత్తగా ఎవరూ ఏమీ చేయాల్సిన అవసరం లేదని, తనంతట తానుగా ముందుకు వెళ్లే వ్యవస్థ ఏర్పాటైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్కెల్ అభిప్రాయపడ్డాడు. ఈక్రమంలో జట్టు మరింత పటిష్ఠంగా తయారయ్యేందుకు ఏం చేయగలనో అదే చేస్తానని చెప్పాడు. ఏరకంగా చూసినా ఇందులో నాది చిన్నపాత్రేనని తెలిపాడు. రోహిత్, విరాట్, జడేజా, అశ్విన్, బుమ్రాలాంటి సూపర్ సీనియర్లు జట్టును ముందుండి నడిపిస్తారని, సహాయక సిబ్బందిగా వారికి అవసరమైన సలహాలు ఇవ్వడం కోచ్‌లుగా తమ బాధ్యతని స్పష్టం చేశాడు.

తిలక్ సెంచరీ

పట్టుబిగించిన ఇండియా 'ఎ'

దులీప్ ట్రోఫీ



తిలక్ వర్మ (111 నాటౌట్)

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): యువ బ్యాటర్ తిలక్ వర్మ (111 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కగా..ఓపెనర్ ప్రథమ్ సింగ్ (122) కూడా సెంచరీతో చెలరేగడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పట్టుబిగించింది. ఓవర్‌నైట్ 115/1తో శనివారం, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'ఎ' 380/3తో డిక్లేర్ చేసింది. దాంతో ఆ జట్టుకు ఓవరాల్‌గా 487 పరుగుల ఆధిక్యం లభించింది. ప్రథమ్, తిలక్ రెండో వికెట్‌కు 104 రన్స్ జోడించారు. అనంతరం రావత్ (64 నాటౌట్) జతగా తిలక్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 116 రన్స్ జత చేశాడు. ఆపై 488 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'డి' మూడోరోజు ఆఖరికి 62/1 స్కోరుతో నిలిచింది. రికీ భుయ్ (44), యశ్ దుబే (15) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 290, ఇండియా 'డి' 183 పరుగులు చేశాయి.

ఫాలోఆన్ ప్రమాదంలో ఇండియా 'బి'

కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (143 బ్యాటింగ్) సెంచరీతో నిలిచినా..యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ (5/66) ఐదు వికెట్లతో వెన్ను విరవడంతో ఇండియా 'సి'తో మ్యాచ్‌లో ఇండియా 'బి' ఫాలోఆన్ ప్రమాదంలో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 124/0తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' కాంబోజ్ ధాటికి ఆట ముగిసేసరికి 309/7 స్కోరుతో నిలిచింది. మరో ఓపెనర్ జగదీశన్ (70) మినహా ఇతర బ్యాటర్ల నుంచి ఈశ్వరన్‌కు సహకారం అందలేదు. ప్రత్యర్థి మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు 216 రన్స్ వెనుకంజలో నిలిచిన ఇండియా 'బి' ఫాల్ ఆన్ తప్పించుకోవాలంటే ఇంకో 66 రన్స్ చేయాలి. చేతిలో 3 వికెట్లే ఉన్నాయి. ఈశ్వరన్‌కు తోడుగా రాహుల్ చాహర్ (18) క్రీజులో ఉన్నాడు. ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోరు సాధించింది.

రెండో టీ20లో ఇంగ్లండ్ విజయం

కార్డిఫ్: ఆస్ట్రేలియాతో రెండో టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్ 3 వికెట్లతో గెలిచింది. లివింగ్‌స్టోన్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 87; 2/16) అటు బంతితో.. ఇటు బ్యాట్‌తోనూ అదరగొట్టాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-1తో పోటీలోకి వచ్చింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 193 పరుగులు చేసింది. మెక్‌గర్క్ (50), ఇన్‌గ్లిస్ (42), హెడ్ (31) రాణించారు. కార్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 194/7 స్కోరు చేసి గెలిచింది. బెథెల్ (44), సాల్ట్ (33) ఆకట్టుకున్నారు. మాథ్యూ షార్ట్ ఐదు వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. నిర్ణాయక ఆఖరి టీ20 ఆదివారం జరుగుతుంది.

తొలిరోజు నిరాశ

సింగిల్స్‌లో బాలాజీ, రామ్‌కుమార్ ఓటమి

స్వీడన్‌తో భారత్ డేవిస్‌కప్ పోరు

స్టాక్‌హోమ్: స్వీడన్‌తో డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్1ను భారత టెన్నిస్ జట్టు ఓటములతో ఆరంభించింది. శనివారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ ఓడడంతో స్వీడన్‌కు 2-0 ఆధిక్యం దక్కింది. ముందుగా శ్రీరామ్ బాలాజీ 4-6, 2-6తో ఎలియాస్ ఎమర్ చేతిలో ఓడాడు. అయితే రెండో సింగిల్స్‌లో రామ్‌నాథన్ రామ్‌కుమార్ జట్టును పోటీలో నిలుపుతాడని ఆశించినా.. 603వ ర్యాంకర్ లియో బోర్గ్ చేతిలో 3-6, 3-6తో ఓటమిపాలయ్యాడు. ఇక ఆదివారం జరిగే డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లోనూ నెగ్గితేనే భారత్ వచ్చే ఏడాది క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. డేవిస్ కప్ చరిత్రలో రెండుసార్లు మాత్రమే భారత్ 0-2తో వెనుకంజలో నిలిచి పుంజుకుంది.



వరద ముంపునకు గురైన కండ్రికలోని ఇంటిని, వస్తువులను శుభ్రం చేసుకుంటున్న కుటుంబ సభ్యులు



ప్రకాశ్‌నగర్ పోలీసు స్టేషన్ వద్ద వస్త్ర దుకాణంలోకి నీరు చేరడంతో తడిచి నానిపోయిన దుస్తుల కట్టలను బయటపెడుతున్న దుకాణదారు



వైఎస్సార్ కాలనీలోని ఇంట్లో తడిచిపోయిన పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న చిన్నారులు



వైఎస్సార్ కాలనీలోని కిరాణా దుకాణాన్ని వరద ముంచేయడంతో పాడైపోయిన బియ్యం, పప్పు బస్తాలను బయట పడేసిన దృశ్యం

జగన్ పాలనే పెద్ద విపత్తు

- విపక్షనేత బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు
- విపత్తు వేళ రాజకీయ విమర్శలా?
- మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ చేసిన అయిదేళ్ల పాలనే రాష్ట్రానికి పెద్ద విపత్తు అని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి అనుకోని విపత్తు వచ్చిన వేళ ప్రజలను మానవత్వంతో ఆదుకోవాల్సిన విపక్ష నాయకుడు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అప్పుడప్పుడు బయటకు వచ్చి మేన్ మేడ్ ఫ్లడ్ అనడం జగన్‌కు అలవాటయిపోయిందని మండిపడ్డారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడం కంటే మేన్ మేడ్ డిజాస్టర్ మరోకటి ఉండదన్నారు. వైసీపీ సృష్టించిన విపత్తు వల్ల పాలనా వ్యవస్థలు ధ్వంసమైపోయాయని ఆరోపించారు. వైసీపీ నాయకుడు గానీ, ఆ పార్టీ నాయకత్వం కనీసం క్షేత్రస్థాయిలో దిగి ఒక్క రూపాయి కూడా బాధితులకు సాయం చేసిన పాపాన పోలేదని, కానీ, విపత్తు వేళ రాజకీయ విమర్శలు చేయడాన్ని బట్టి ఆ పార్టీ నైజమేమిటనేది ప్రజలు గ్రహించారని తెలిపారు. స్పందించే గుణం లేని జగన్‌కు ఈ విపత్తు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సీఎం చంద్రబాబు పది రోజుల పాటు వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసా కల్పించారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత నిధులను రూ.4కోట్లు వరద ప్రభావిత పంచాయతీలకు ఇవ్వడంతో పాటు రెండు రాష్ట్రాలకు రూ.2కోట్లు అందించారని గుర్తుచేశారు. ఏలేరు ఆధునికీకరణ ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తే- వర్షాలు కురిశాయి కనుక పనులు చేయలేదని జగన్ తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ధోరణిలో మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. జగన్ సొంతజిల్లాలో వైసీపీ వాళ్ల ఇసుక దోపిడీ కారణంగా అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోతే 12రోజులకు తర్వాత తీరిగ్గా బాధితుల పరామర్శకు ముఖ్యమంత్రి హోదాలో జగన్ వెళ్లారని గుర్తుచేశారు. ప్రాజెక్టు కింద భాగంలో ఇసుకను తోడుకునేందుకు నీరు దిగువకు వదలకుండా ప్రాజెక్ట్ కొట్టుకుపోయేలా చేసిన ఘన కార్యమే నిజమైన మేన్ మేడ్ డిజాస్టర్ అని జగన్ తెలుసుకోవాలన్నారు. పంటల బీమా విషయంలో జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. జగన్ హయాంలో బీమా సొమ్ములు ఎవరికీ ఇవ్వలేదని, క్షేత్రస్థాయిలో బీమా అందిన దాఖలాలు లేవన్నారు. బాధ్యత లేని వ్యక్తిగా జగన్ మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సాయం అందేలా చూస్తున్నామని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.

‘బోటు’ రూటు మారింది!

- పూర్తిగా నదిలోకి మునిగిపోయిన బోటు
- లాగేకొద్దీ రోప్, క్రేన్‌పై పెరుగుతున్న బరువు
- బ్యారేజీ వద్ద నుంచి 10అడుగులు ముందుకు
- ఒక్కో బోటు 100టన్నుల బరువుండే చాన్స్

విజయవాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ వద్ద ఇప్పటి వరకు పైకి కనిపించిన బోటు కృష్ణానదిలోకి దిగిపోయింది. భారీ ఇనుప రోప్‌లను మెలికవేసి క్రేన్‌తో లాగుతుంటే కొంచెం కొంచెం మాత్రమే కదులుతోంది. లాగుతున్న కొద్దీ రోప్, క్రేన్‌పై బరువు పెరుగుతోంది. బ్యారేజీ వద్ద మొత్తం మూడు బోట్లు ఉన్నట్టు బెకెమ్ కంపెనీ ఇంజనీర్లు, అబ్బులు టీం గుర్తించిన విషయం తెలిసిందే. వీటిలో ఒక్కో బోటును తొలగించడానికి నిపుణులు వేస్తున్న ప్రణాళికలు ఫలించడం లేదు. ఆక్సీ ఆర్క్ కటింగ్ ద్వారా పైకి కనిపిస్తున్న బోటును రెండు ముక్కలు చేస్తే తొలగింపు సులువుగా ఉంటుందని భావించారు. ఈ ప్లాన్ కాస్తా రివర్స్ అయింది. బోటులోకి నీరు ప్రవేశించడంతో ఆసాంతం కిందికి దిగిపోయింది. బోటును యథాస్థితికి తీసుకొచ్చినప్పటికీ దాన్ని లాగడం కష్టతరమవుతోంది. బ్యారేజీ గేటు వద్ద నీళ్లలో మునిగిపోయిన బోటు ఐదు నుంచి పది అడుగుల ముందుకు వచ్చినట్టు కార్మికులు చెబుతున్నారు. బోటు బరువు 40 టన్నులు ఉంటుందని తొలుత భావించారు. తాజా పరిణామాలను బట్టి ఒక్కో బోటు 100 టన్నుల వరకూ బరువు ఉంటుందని అబ్బులు టీం గుర్తించింది. ఈ బోటులో 250 టన్నుల ఇసుకను లోడ్ చేయవచ్చని నిర్ధారించారు. ఇందులో లోడ్ పూర్తిగా ఉంటే మొత్తం బరువు 350 టన్నులు. బోటు ఎత్తు 3.8 మీటర్లు, వెడల్పు 7, పొడవు 35 మీటర్లు ఉన్నట్టు తేలింది.

పూర్తికాని కటింగ్

బోటుకు అడుగు భాగాన ఆక్సీ ఆర్క్ కటింగ్ ద్వారా కట్ చేయాలని భావించారు. ఇందుకోసం వైజాగ్‌కు చెందిన సీ లయన్ కంపెనీ డైవర్లు రంగంలోకి దిగారు. నీళ్లలో ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో బోటు అడుభాగాన్ని పూర్తిగా కట్ చేయలేకపోయారు. ప్రవాహ ఉధృతితో డైవర్లు ఇబ్బంది పడ్డారు. అవకాశం ఉన్న మేరకు కట్ చేశారు. ఈ రంధ్రాల నుంచి లోపలకు నీరు ప్రవేశించి బోటు మునిగిపోయిందని భావిస్తున్నారు. భారీ ఇనుప రోప్‌ను ఘాట్ మీద నుంచి ఒక క్రేన్ లాగుతోంది. ఇక్కడ ప్రాంగణం విశాలంగా లేకపోవడంతో క్రేన్ కొంతదూరం వరకు రోప్‌ను లాక్కుని వెళ్లి మళ్లీ ముందుకు రావాల్సి వస్తోంది. మళ్లీ రోప్‌ను అక్కడి నుంచి లాక్కుని వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలావరకు సమయం క్రేన్‌కు రోప్‌ను కట్టడం తోనే సరిపోతోంది. ప్రకాశం బ్యారేజీ స్లూయిజ్ గేటుకు వెనుక వైపున ఒక చిన్న గోడను నిర్మించారు. బోటు కదులుతున్న సమయంలో ఈ గోడను ఢీ కొడుతున్నట్టు అనుమానిస్తున్నారు.

నేడు ‘వాటర్ లోడింగ్’ ప్లాన్

ఎన్ని ప్రయత్నాలు చేసినా బోటు కొంతమేరకు మాత్రమే ముందుకు కదులుతుండటంతో ఆదివారం వాటర్ లోడింగ్ ప్లాన్ అమలు చేయాలని అబ్బులు టీం నిర్ణయించింది. ఈ బోట్లను లాగడానికి గొల్లపూడి నుంచి ఆరేడు కార్గో బోట్లను రప్పించారు. వీటిలో రెండింటిని పూర్తిగా నీటితో నింపి, మునిగి ఉన్న బోటుతో లాక్ చేస్తారు. ఇలా చేయడం వల్ల ఆ బోట్లు నీళ్లలోకి దిగుతాయి. తర్వాత వాటిలో ఉన్న నీటిని తోడేస్తారు. దీంతో అవి పైకి వచ్చే సమయంలో మునిగిన బోటు కూడా పైకి లేస్తుందని భావిస్తున్నారు. ఈ ప్రణాళిక సత్ఫలితాలను ఇస్తుందని అబ్బులు టీం భావిస్తోంది. నీళ్లలో మునిగిన ఓడలను పైకి లేపడానికి బెలూన్ టెక్నాలజీ ఉన్నా అది ఇలాంటి చోట్ల పని చేయదని అబ్బులు తెలిపారు.

ఏలేరుకు మళ్లీ వరద

- ఆందోళన కలిగిస్తున్న ఇన్‌ఫ్లో

పిఠాపురం, సెప్టెంబరు 14: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్‌లోకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో ఆందోళన కలిగిస్తోంది. ఇన్‌ఫ్లోకు అనుగుణంగా కాలువలకు వరద నీరు విడుదల చేస్తున్నారు దీంతో ఏలేరు కాలువల్లో వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఏలేరు రిజర్వాయర్‌లో 3రోజులుగా పెరుగుతూ వస్తున్న ఇన్‌ఫ్లో శనివారం 6,107 క్యూసెక్కులకు చేరుకుంది. ప్రాజెక్టు నీటిమట్టం 85.80 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటినిల్వలు 22.56 టీఎంసీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రిజర్వాయర్ నుంచి వరద నీటి విడుదలను 5,875 క్యూసెక్కులకు పెంచారు. కాకినాడ జిల్లాలోని కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి తదితర మండలాల పరిధిలో కాలువలకు భారీగా గండ్లుపడ్డాయి. ప్రస్తుతం వీటిని నుంచి వరద నీరు మళ్లీ పొలాల్లోకి చేరుతోంది. ఇంకా సుమారు 5,700 ఎకరాలు ముంపులో కొనసాగుతున్నాయి. దీంతో అక్కడక్కడా మిగిలిన కొద్దిపాటి పంటలు చేతికందకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలానికి తగ్గిన ఇన్‌ఫ్లో

డ్యాంలో 210 టీఎంసీ నిల్వ



శ్రీశైలం, సెప్టెంబరు 14: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 55,465 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 17,916 క్యూసెక్కుల వరద వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 75,895 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు, పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.00 అడుగులు, నీటి నిల్వ 210.0320 టీఎంసీలుగా నమోదైంది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,094 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కులను విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నారు.

పరిశ్రమలకు నష్టం

రూ.350 కోట్లకుపైనే

వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న పరిశ్రమలు

- ఆదుకునేందుకు ముందుకొచ్చిన ప్రభుత్వం
- నష్టాన్ని ఎన్యుమరేషన్ చేస్తున్న పరిశ్రమల శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయవాడ నగరంలో భారీ వర్షాలు, వరదలతో పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నష్టం రూ.350 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, భవానీపురం, పైపులరోడ్డు తదితర ప్రాంతాల్లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు నీట మునిగిపోవడంతో అపార నష్టం వాటిల్లింది. ఆటోమొబైల్స్, ప్రింటింగ్, ఫర్నిచర్, ప్లైవుడ్ తదితర పరిశ్రమల్లోని అత్యంత విలువైన యంత్ర పరికరాలు వరద నీటిలో మునిగి పనికిరాకుండా పోయాయి. ఆయా పరిశ్రమల్లో కోట్ల రూపాయల విలువైన ముడి సరుకు వరద పాలైంది. ఉత్పత్తి చేసిన ఫినిష్డ్ గూడ్స్ మొత్తం నీట మునిగి పనికిరాకుండా పోయాయని పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ఐరన్, సిమెంట్ తదితరాలను నిల్వ చేసే గొడౌన్లు నీట మునగడంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. పరిశ్రమలు నీట మునిగిపోవడంతో వాటిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఆ పరిశ్రమలను పునరుద్ధరించడానికి ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితుల్లో కార్మికులంతా పనులు లేక.. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నష్టాన్ని లెక్కిస్తున్న బృందాలు

భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న పరిశ్రమలు తిరిగి కోలుకునేవరకు అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ ముంపు ప్రాంతాల్లో పది రోజులపాటు నీట మునిగి.. రూ.కోట్లలో నష్టపోయిన పారిశ్రామికవేత్తలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గి, ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశ్రమలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసేందుకు రెండు రోజులుగా ఎన్యుమరేషన్ జరుగుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఇండస్ట్రీస్ ఫీల్డ్ ఆఫీసర్లను విజయవాడ రప్పించి.. వారితో ఎన్యుమరేషన్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీట మునిగిన పరిశ్రమల పరిస్థితి, నష్టంపై ఎన్యుమరేషన్ బృందాలు నివేదికలను సిద్ధం చేస్తున్నాయి. ఆ వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో నమోదు చేస్తున్నాయి. మరోవైపు పరిశ్రమలకు వాటిల్లిన నష్టాలను ఏవిధంగా భర్తీ చేయాలనే అంశంపై పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. వరదల వల్ల కుదేలైపోయిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

వరద సహాయక చర్యలపై 95% ప్రజల సంతృప్తి

- పంట నష్టపోయిన ప్రతిరైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ: మంత్రి అచ్చెన్న

టెక్కలి, సెప్టెంబరు 14: ఇటీవలి వరదలకు సంబంధించి ప్రభుత్వ సహాయక చర్యలపై 16 సర్వేలు నిర్వహించగా, అన్నింటిలోనూ 95శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితుల సహాయక చర్యలపై వైసీపీ నేతల్లో కూడా సంతృప్తి ఉందని, అయితే వారు బయటపడడం లేదని అన్నారు. ఈ వరదల్లో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించిందని, ప్రజలు చంద్రబాబు ప్రభుత్వంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అయితే, వరద ప్రాంతాల పర్యటనలోనూ జగన్ వెకిలి నవ్వులు మానలేదని.. చావుకూ అవే నవ్వులు, వరద ముంపునకూ అవే నవ్వులా? అని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా అంటూ రైతులకు నాలుగేళ్ల పాటు ఇన్సూరెన్స్ కట్టకుండా మోసగించారని ఆరోపించారు. రబీ పంటకైతే జగన్ ప్రభుత్వం ఇన్సూరెన్సే చెల్లించలేదని, ఇప్పుడేమో జగన్ ఇన్సూరెన్స్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో వరదలు, తుఫాన్‌లతో పంటలు నష్టపోయిన రైతులకు 2014-19 మధ్యకాలంలో హెక్టారుకు రూ.20వేల పెట్టుబడి సహాయం అందిస్తే జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత హెక్టారుకు రూ.16వేలకు తగ్గించాడని గుర్తుచేశారు. ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు.. హెక్టారుకు రూ.25వేల పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామన్నారు. నష్టపోయిన రైతుల జాబితాను గ్రామసభలో యాప్ ద్వారా వెల్లడిస్తామన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖలపై జగన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని, ఆ వ్యక్తికి బుద్ధి, జ్ఞానం, తెలివి ఉందా? అని అచ్చెన్నాయుడు ఆగ్రహించారు. రెడ్‌బుక్ అమలుచేస్తే ఒక్కరోజైనా రాష్ట్రంలో జగన్‌గానీ, ఆ పార్టీ నేతలు గానీ తిరగగలరా అని ప్రశ్నించారు.

ఎస్.. ఏలేరు వరద నష్టం.. జగన్ మేడ్ మిస్టేక్

- ఇప్పుడు ప్రభుత్వ అప్రమత్తతోనే భారీ నష్టం తప్పింది: సోమిరెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద నష్టం మ్యాన్ మేడ్ మిస్టేక్ అని జగన్ అంటున్న మాట వాస్తవమేనని, అయితే ఆ మ్యాన్ జగన్ మోహన్‌రెడ్డే అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏలేరు వరదకు కారణమైన కాలువలో ప్రవాహ స్థాయిని 10వేల క్యూసెక్కుల నుంచి 70వేలకు పెంచేందుకు 2019లో టీడీపీ ప్రభుత్వం రూ.292 కోట్లతో టెండర్లు పిలిచిందని గుర్తు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చి, రివర్స్ టెండరింగ్ పేరుతో కాలువ విస్తరణ పనులను మూలనపెట్టేసిందన్నారు. జగన్ చేసిన మిస్టేక్ కారణంగా ఈ రోజు వరద నష్టం సంభవించిందని మండిపడ్డారు. వరదల సమయంలో ప్రజలకు అండగా నిలవడంలో చంద్రబాబు దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచారన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌ను వదిలి ఏనాడు బయటకు రాని జగన్ 13 కేసులతో, రూ.లక్షల కోట్లు దోచుకోవడంలో రోల్‌మోడల్‌గా నిలిచారని అన్నారు.

ప్రమాద రహిత రాష్ట్రమే లక్ష్యం: మంత్రి రాంప్రసాద్

ధర్మవరం, సెప్టెంబరు 14: ప్రమాద రహిత రాష్ట్రమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలో ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని, మృతుల కుటుంబాలను భవిష్యత్తులో ఆదుకుంటామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోందని తెలిపారు. గత 20ఏళ్లలో జరిగిన ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని, బ్లాక్‌స్పాట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే 600 బస్సులు తెచ్చామని, త్వరలో మరో వెయ్యి బస్సులు తీసుకొస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని త్వరలోనే కల్పిస్తామన్నారు. రాష్ట్రానికి ఎలక్ట్రికల్ బస్సులు తీసుకువస్తున్నామని, ఆ ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. పేదల ఆకలిని తీర్చడానికి ఇప్పటికే 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని, మరో పది రోజుల్లో ఇంకో వంద అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

జెత్వానీ ఫిర్యాదుతో

విద్యాసాగర్‌పై కేసు

(మొదటి పేజీ తరువాయి)

చేర్చారు. విద్యాసాగర్‌పై క్రైం నంబర్ 469/2024తో 192, 211, 218, 220, 354(డీ), 467, 420, 469, 471, రెడ్‌విత్ 120(బీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇవి కాకుండా 66(ఏ) ఆఫ్ ఐటీ యాక్ట్ 2000ను చేర్చారు. కాగా కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలు బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక్ సురక్ష సంహిత), బీఎస్ఏ(భారతీయ సాక్ష్యా అధినియం)లను అమలు చేస్తోంది. ఇబ్రహీంపట్నం పోలీసులు మాత్రం ఐపీసీ సెక్షన్లు చేర్చారు. ఎఫ్ఐఆర్ కింద మాత్రం అండర్ సెక్షన్స్ 173 బీఎన్ఎస్ అని టైపు చేసి ఉంది. ఈ నేరం జూలైకు ముందు జరిగింది కాబట్టి అన్నీ ఐపీసీ సెక్షన్లే వర్తిస్తాయని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఇదీ ఫిర్యాదు

"ముంబై జుహూలోని గుల్‌మొహర్ రోడ్డులో ఉన్న ఐడియల్ అపార్ట్‌మెంట్స్‌లో ఏ 602 ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నాను. మోడలింగ్ నా వృత్తి. నా తండ్రి నరేంద్రకుమార్ జెత్వానీ రిటైర్డ్ నేవీ మర్చెంట్ ఆఫీసర్. తల్లి ఆశా జెత్వానీ ఆర్బీఐ రిటైర్డ్ ఉద్యోగి. నా సోదరుడు అంబరీశ్ జెత్వానీ దంతవైద్యుడు. ప్రస్తుతం దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. విద్యాసాగర్ మోడలింగ్ కో-ఆర్డినేటర్‌గా ఉన్నప్పుడు 2009 నుంచి అతడితో పరిచయం ఉంది. అతడిని మొదటిసారి హైదరాబాద్‌లో కలిశాను. నా ప్రయాణం, వసతి ఏర్పాట్లను విద్యాసాగర్ చూసేవాడు. అప్పటి నుంచి అతడు ఖరీదైన గిఫ్ట్‌లు ఇస్తూ ఎర వేశాడు. నేను 2009లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత నటన వైపు వెళ్లాను. హిందీ, మలయాళం చిత్రాల్లో నటించాను. 2011-12లో హౌస్‌సర్జన్ పూర్తి చేశాను. ఆ సమయంలో విద్యాసాగర్ నిరంతరం ఫోన్లు, మెసేజ్‌లు చేసేవాడు. 2013లో విద్యాసాగర్ భార్య విడాకుల నోటీసులు ఇచ్చింది. ఆ తర్వాత నాతో మరింత స్నేహంగా వ్యవహరించేవాడు. నాకు రూ.10వేలు, రూ.20వేలు, రూ.30వేలు పంపి గిఫ్ట్‌లు కొనుక్కోమనేవాడు. తల్లిదండ్రులను హోటళ్లకు డిన్నర్లకు తీసుకెళ్లమనేవాడు. ముంబైలో మా ఇంటికి తరచుగా వచ్చి మా కుటుంబంతో కలిసి డిన్నర్ చేసేవాడు. నా తల్లిదండ్రులకు ఖరీదైన గిఫ్ట్‌లు ఇవ్వడంతో పాటు వారి అకౌంట్స్‌లోకి డబ్బులు పంపేవాడు. 2013లో విద్యాసాగర్ భార్య విడాకుల కేసు గురించి తెలుసుకున్నాను. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పి పుట్టిన తేదీ, జాతక వివరాలను పంపాడు. 2014లో తన ఖర్చులతో విజయవాడకు తీసుకొచ్చాడు. ఇక్కడే ఒక హోటల్‌లో వసతి ఏర్పాటు చేశాడు. విజయవాడ, హైదరాబాద్‌లో విద్యాసాగర్ ఇళ్లు ఎక్కడో తెలియదు. అతడి స్వగ్రామం కోసూరు అని మాత్రం తెలుసు. ఆ గ్రామానికి నేను ఎప్పుడూ వెళ్లలేదు. విద్యాసాగర్ భార్య విడాకుల ప్రొసీడింగ్స్‌ను 2015లో చదివాను. అప్పుడు అతడి ప్రవర్తన, భార్యను ఏవిధంగా వేధించాడు, వివాహేతర సంబంధాల గురించి తెలుసుకున్నాను. ఓ కళాశాల యువతిని గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడు. ఈ విషయాలు తెలిసిన తర్వాత అతడితో సంబంధాలను తెంచుకున్నాను. ముంబైలో 2015లో ఓ హోటల్‌లో మరో మహిళతో ఉండడం చూశాను. 2016 జనవరిలో విద్యాసాగర్‌ను చివరిసారిగా చూశాను. నేను అతడిని దూరం పెట్టడంతో దాన్ని చెడుగా తీసుకున్నాడు. తనతో ఉండమని గిఫ్ట్‌లు, డబ్బులు ఆఫర్ చేశాడు. రకరకాల మెసేజ్‌లు పంపి హింసించేవాడు. 2018లో తన మొబైల్ నుంచి అసభ్యకరమైన ఫొటోను నాకు పంపాడు. సోషల్ మీడియాలో ఉన్న నా ప్రొఫైల్ ఫొటోలు, డీపీలను 2009 నుంచి సంపాదించి క్రూరంగా వేధించేవాడు. మేము (కుటుంబం) 2017 డిసెంబరులో అహ్మదాబాద్‌కు వెళ్లిపోయాం. అక్కడ 2019 వరకు ఉన్నాం. 2020 జనవరి 30న ముంబైలో ఫ్లాట్ కొనుగోలు చేశాం. అయితే ఈ ఫ్లాట్‌ను 2018లో కొనుగోలు చేసినట్టు తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేశారు. అప్పటికి ఈ అపార్ట్‌మెంట్‌ను కనీసం నిర్మించలేదు. 2020 జూలైలో ఆధార్‌కార్డుపై ఉన్న అహ్మదాబాద్ చిరునామాను ముంబైకి మార్చుకున్నాం. విద్యాసాగర్ అతడికి సంబంధించిన వ్యక్తులు ఈ డాక్యుమెంట్లను నకిలీవిగా తయారు చేశారు. విద్యాసాగర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేకుండా చేయడానికి నా సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. కొంతమంది సివిల్ దుస్తుల్లో వచ్చి నా దగ్గర ఉన్న వస్తువులను లాక్కున్నారు. ఐదు సెల్‌ఫోన్లు, ఐప్యాడ్‌ను తీసుకుని మమ్మల్ని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత నన్ను అరెస్టు చేసిన విషయాన్ని కుక్కల విద్యాసాగర్‌కు తెలియజేశారు. నన్ను జుహూ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడ నుంచి మేజిస్ట్రేట్ ఇంటికి తీసుకెళ్లారు. నన్ను, నా తల్లిని వేర్వేరు కార్లలో ఎక్కించారు. అరెస్టు చేసే సమయంలో ఏ పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చారో చెప్పలేదు. ఎలాంటి గుర్తింపు కార్డులు, వారెంట్లు చూపించలేదు. నేను పోలీసులకు ఎలాంటి వాంగ్మూలం ఇవ్వలేదు. నా తండ్రిని అదే రోజు సాయంత్రం ఇంటి వద్ద ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌తో కూడిన 10-12 మంది పోలీసులు అరెస్టు చేశారు. మా ఇంట్లో మమ్మల్ని దారుణంగా హింసించారు. ముంబై కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచేటప్పుడు కారులో మహిళా పోలీసులు కొట్టారు. అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా, ఎస్ఐ షరీఫ్‌కు ఫోన్ చేసి మమ్మల్ని అరెస్టు చేశారా లేదా అని తెలుసుకున్నారు. నన్ను, తల్లిదండ్రులను వేర్వేరుగా ఉంచమని చెప్పారు. నవీ ముంబై దాటిన తర్వాత అర్ధరాత్రి మమ్మల్ని ఏపీకి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. నన్ను ఒక కారులో, తల్లిదండ్రులను మరో కారులో తీసుకొచ్చారు. విజయవాడకు తీసుకువస్తున్న సమయంలో పోలీసులు మానసికంగా వేధించారు. కేసు నమోదు చేసిన మరుసటి రోజే ఎలాంటి పేపర్ వర్క్ పూర్తి చేయకుండా ముంబైకి వచ్చారు. ఆ మరుసటి రోజు రాత్రి జైలుకు తీసుకెళ్లిన తర్వాత ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుని చదివాను. నాపై తప్పుడు కేసు బనాయించారని అప్పుడు అర్థం చేసుకున్నాను. అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, పోలీసు కమిషనర్ కాంతిరాణా, డీసీపీ విశాల్‌గున్నీతో ఈ ఆపరేషన్ చేయించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పూర్తి చేయడానికి విశాల్‌గున్నీని డిప్యూటేట్ చేశారు" అని ఫిర్యాదులో కాదంబరి పేర్కొన్నారు.

స్నేహపూర్వక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

- పోడియం ఎత్తివేత... కుర్చీ ఎత్తు తగ్గింపు
- ప్రజలకు సౌకర్యవంతంగా కుర్చీలు
- అందుబాటులో తాగునీరు... కుదిరితే కాఫీ/టీ
- పన్నులు కడుతున్న ప్రజలకు గౌరవ మర్యాదలు
- మెమో జారీ చేసిన ఆర్పీ సిసోడియా

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇక నుంచి ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. సబ్‌రిజిస్ట్రార్లు కూర్చునే కుర్చీ ఎత్తు తగ్గించడమే కాకుండా, వారి ముందుండే పోడియంను ఎత్తేయాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ ముందు ఉండే పోడియం చెక్కతో ఉంటుంది. దాని చుట్టూ ఎరుపు రంగు వస్త్రం ఉంటుంది. సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ, ఆ వ్యక్తి ముందుండే టేబుల్ చుట్టుపక్కల ఉన్న ఫ్లోరింగ్ కంటే కొంచెం ఎత్తులో ఉంటాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు వారి కంటే ఎత్తులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పోడియం ముందు నిలబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ విధానం అమర్యాదరకరంగా ఉందని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెంచేలా ఉందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి పన్నులు కడుతున్న ప్రజలకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని పేర్కొంటూ శనివారం ఆయన ఒక మెమో జారీ చేశారు. తక్షణమే సబ్‌రిజిస్ట్రార్ ముందుండే చెక్క, ఎర్రని వస్త్రంతో ఉన్న పోడియంను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాల్లోనూ తొలగించాలని ఆదేశించారు. సబ్‌రిజిస్ట్రార్ కుర్చీని కూడా ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉండాలని పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ ముందు సరిపడా కుర్చీలు అందుబాటులో ఉంచడం ద్వారా రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు కూర్చుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సబ్‌రిజిస్ట్రార్‌కి ప్రజలకు మధ్య టేబుల్‌తప్ప మరేమీ అడ్డంగా ఉండకూడదని చెప్పారు. ప్రజలు వేచిచూడాల్సి వస్తే వారు కూర్చోవడానికి సరైన ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, కుదిరితే కాఫీ/టీలు ఇవ్వాలని సిసోడియా ఆదేశాలు జారీచేశారు. ఇటీవల సిసోడియా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి సత్యప్రసాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ ముందు ప్రజలు నిలబడి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేసి, ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఖజానాకు వేలకోట్ల ఆదాయం సమకూర్చుతున్న వారికి తగిన గౌరవ మర్యాదలు దక్కాలని ఆ మెమోలో పేర్కొన్నారు.

కృష్ణానది ఒడ్డున ఆక్రమణలు తొలగించండి

- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలు తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వరద ప్రభావిత ప్రాంతాలను వీడియో తీసి కొండవీటి వాగు, బుడమేరు వాగు ప్రవాహాలకు అవరోధంగా ఉన్న ఆక్రమణల తొలగింపుకు ఉత్తర్వులు ఇవ్వాలని ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు నాతాని భూపతిరావు ఈ పిల్‌లో అభ్యర్థించారు. వరదను ఎదుర్కోవడంతో పాటు బాధితులకు పునరావసం కల్పించడం, ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వరద విపత్తుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వరదకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల వైఖరిని నేరపూరిత చర్యగా ప్రకటిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఆపరేషన్ బుడమేరు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు, బాధితులకు అండగా ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి అధికారుల వరకు పదిరోజుల పాటు నిలబడటం, ఆర్మీ సహకారంతో గండ్లు పూడ్చివేయడం.. వరద నష్టాలను చాలా వరకు తగ్గించింది. ఈ నేపథ్యంలో బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారంగా 'ఆపరేషన్ బుడమేరు'ను రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా వాగు పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణల తొలగించనున్నారు. వాటిని ఆక్రమించినవారినీ, తెలియక ఆ ప్రాంతంలో స్థలాలు కొన్నవారిని పిలిపించి మాట్లాడి సామరస్యంగా ఈ సమస్యకు ముగింపు పలకాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో బుడమేరు గట్ల వెంట ఇష్టారాజ్యంగా ఇసుకను, మట్టిని తోడి అమ్ముకున్న నాయకుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కూడా భావిస్తోంది. ఇక.. పటిష్ఠ చర్యల్లో భాగంగా ఈ వాగు ప్రవాహం సాఫీగా సాగేందుకు ఎక్కడికక్కడ కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నారు. బుడమేరు గండ్ల పటిష్ఠతకు అన్ని చర్యలు తీసుకోనున్నారు. ఈ క్రమంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. విజయవంతంగా గండ్లను పూడ్చివేయడంతోపాటు, అక్కడ గట్టు ఎత్తును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఒకదశ వరకు ఆర్మీ సహకారం కలిసివచ్చినా.. చివరిదాకా మంత్రులే గట్ల మీదే నిలబడి గండ్ల పని పూర్తిచేశారు. ఆ వెంటనే ఎత్తును కూడా పెంచారు. అయినా... బుడమేరు వరదను శాశ్వతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన తక్షణ, దీర్ఘకాలిక చర్యల విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు.. జలవనరుల శాఖను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. బుడమేరుకు వచ్చే వరద నీరు 15 వేల క్యూసెక్కులుగా ప్రభుత్వం అంచనా వేస్తోంది. అసాధారణ రీతిలో భారీ వర్షాలు పడటంతో ఈసారి మాత్రమే బుడమేరకు రికార్డుస్థాయిలో 45 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో బుడమేరుకు దాదాపు 37వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా తట్టుకునేలా విస్తరణ పనులు మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికోసం డీపీఆర్ రూపొందించాలని నిర్దేశించారు. బుడమేరులో బలహీనంగా ఉన్న గట్లను ముందుగా గుర్తించాలన్నారు. వాగుకు గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని ఆదేశించారు.



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో ప్రతిమ ఇన్‌ఫ్రా నిల్వ చేసిన ఇసుక

ప్రతిమ ఇన్‌ఫ్రాకు 18.7 కోట్లు జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

కట్టబెట్టింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ప్యాకేజీ-1 కింద ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక సరఫరా చేసేందుకు అనుమతి ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా నాలుగు నెలల ముందు ఫిబ్రవరిలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్‌కు రెండేళ్ల కాలపరిమితికి ఇసుక కాంట్రాక్టు అప్పగించింది. సదరు సంస్థ పర్యావరణ అనుమతులు రాకుండానే రాజమండ్రిలో గాయత్రి-10 రీచ్‌లో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి డిపోలకు ఇసుకను తరలించింది.

డిమాండ్ నోటీసు జారీ

ప్రతిమ ఇన్‌ఫ్రా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెలాఖరు వరకు 91,714 మెట్రిక్ టన్నుల ఇసుకను రాజమండ్రి నుంచి అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలోని గబ్బాడ డిపోకు తరలించింది. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవని తేల్చిన మైనింగ్ అధికారులు గత నెల ఎనిమిదో తేదీన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్‌కి షోకాజ్ నోటీసు జారీచేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినందుకు చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో 15 రోజుల్లోగా తెలియజేయాలని నోటీస్‌లో పేర్కొన్నారు. అందుకు ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థ ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని మైనింగ్ అధికారులు రూ.18,70,96,560 జరిమానా విధిస్తూ సదరు సంస్థకు ఈ నెల 12న డిమాండ్ నోటీసు జారీచేశారు.

స్పీకర్ ఆదేశాలతో విచారణ

గబ్బాడ డిపోలో 63 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేసింది ఎవరో తేల్చాలని, అప్పటివరకూ ఇసుక అమ్మకాలు ఆపాలని స్పీకర్, స్థానిక శాసనసభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లా మైనింగ్ శాఖలో కదలిక వచ్చింది. రాజమండ్రి మైనింగ్ శాఖకు లేఖ రాసి వివరాలు సేకరించారు. ఇసుక తవ్వకాలు జరిపిన ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థకు పర్యావరణ అనుమతులు లేవని తేల్చారు. గత మూడు నెలలుగా నర్సీపట్నంలో ఇసుక లభ్యత లేకపోవడంతో గృహ నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.9 వేలు పెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చింది. తాజాగా ఇసుక వివాదం తేలిపోవడంతో ఇసుక సరఫరాకు మార్గం సుగమం అయింది.

అవినీతి దందాకు ఆయనే దాదా!

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. కానీ నాడు, నేడు 'ఆంధ్రజ్యోతి' రాసిన వార్తలే అక్షరసత్యాలని ఏసీబీ విచారణలో తేలిపోయింది. ఒకటా, రెండా...వెంకటరెడ్డి చేసిన అరాచకాలు, అక్రమాలకు అంతే లేదని ఏసీబీ నివేదిక చెబుతోంది. వెంకటరెడ్డి ఓ ప్రభుత్వ అధికారిని అన్న సంగతి మరచి ప్రైవేటు కంపెనీల ప్రతినిధిగా, వాటి కొమ్ముకాస్తూ పనిచేశారని ఏసీబీ అక్షరాలా నిగ్గుతేల్చింది. మూడున్నరేళ్ల ఇసుక కాంట్రాక్టులో 2,566.82 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని వెల్లడించిన ఏసీబీ, ఇందులో తొలి నిందితుడు వెంకటరెడ్డియేనని ప్రకటించింది. ఇసుక అక్రమాలపై జరిపిన విచారణ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికలోని అంశాలు వెంకటరెడ్డి మూడో కంటికి తెలియకుండా చేసిన ఘనకార్యాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. అందులోని కీలకాంశాలు..

ఇసుక దోపిడికి రాచబాటలు..

గత జగన్ ప్రభుత్వంలో 2021-23(మే) వరకు, 2023 నవంబరు11 నుంచి కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చేవరకు ఇసుక విక్రయాలు జరిగాయి. తొలుత జేపీ వెంచర్స్‌కు కాంట్రాక్ట ఇచ్చారు. ఆ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి నెల 1, 16 తేదీల్లో బిడ్ విలువ చెల్లించాలి. అలాగే, 1,528 కోట్ల కాంట్రాక్టు విలువపై 15 శాతం జీఎస్టీ, ఇసుక అమ్మకంపై వచ్చే 5 శాతం జీఎస్టీ సర్కారుకు చెల్లించాల్సి ఉంది. ఇసుక కాంట్రాక్టుకు సంబంధించి జేపీ వెంచర్స్ 120 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. అయితే, జేపీ వెంచర్స్ ఈ ఒప్పందంలోని అంశాలేవీ పాటించలేదు. బిల్లులు చెల్లించలేదు. అయినా వెంకటరెడ్డి ఆ సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా, అనేక రకాల ఉల్లంఘనలకు కంపెనీ పాల్పడినా నోరుమెదపలేదు. గనుల శాఖతో కుదిరిన ఒప్పందాన్ని జేపీ వెంచర్స్ రిజిస్ట్రేషన్ చేయాలి. అదీ జరగలేదు. ఒప్పందం ప్రకారం సబ్‌కాంట్రాక్ట్ ఇవ్వడానికి వీల్లేదు. కానీ జేపీ సంస్థ... టర్న్‌కీ అనే కంపెనీకి సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చింది. ఈ కంపెనీనే 120 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ ప్రభుత్వానికి చెల్లించింది. జేపీ సంస్థ 30.58 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించలేదు. అయినా వెంకటరెడ్డి దానిపై ఏ చర్యలూ తీసుకోలేదు. ఇసుక అమ్మకాలకు సంబంధించి ఒప్పందం ప్రకారం ఆన్‌లైన్ పర్మిట్లు,ఆన్‌లైన్ లావాదేవీలు జరగాలి. కానీ జేపీ సంస్థ మాన్యువల్ లావాదేవీలు అంటే క్యాష్ అండ్‌క్యారీ నడిపింది. ఇది తీవ్రమైన ఉల్లంఘన. జేపీ సంస్థ ఇసుక మైనింగ్ చేసేందుకు ఏపీఎండీసీ నిధులను ఉపయోగించి అనేక కరకాల అనుమతులు, లీజు పర్మిట్లు తీసుకున్నారు. అందుకు అవసరమైన ఫీజులను జేపీ వెంచర్స్ నుంచి వెంకటరెడ్డి రాబట్టలేకపోయారు. ఇది ఆ సంస్థకు వెంకటరెడ్డి చేసిన ఆర్థిక మేలు. బిడ్ విలువ 1528 కోట్లపై జీఎస్టీ రూ.233 కోట్లు జేపీ సంస్థ చెల్లించలేదు. దీని వసూలుకు వెంకటరెడ్డి ఏ చర్య తీసుకోలేదు. దీని వల్ల ప్రభుత్వం నష్టపోయింది.

పైసా కట్టని కంపెనీకి ఎదురు కట్నాలు..

జేపీ గ్రూప్‌నకు ఇసుక టెండర్ ఇచ్చేనాటికి ఏపీఎండీసీ నియంత్రణలో 130.73 కోట్ల విలువైన 14.3 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. దాన్ని కూడా జేపీ వెంచర్స్‌కే అప్పగించారు. దాన్ని ఆ సంస్థ అమ్మేసుకుంది. కానీ రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించలేదు. ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న 8.26 లక్షల టన్నుల ఇసుకను జేపీ వెంచర్స్ అమ్ముకుంది. దీనిపై 39 కోట్లు ఎండీసీకి చెల్లించనేలేదు. ఈ డబ్బును రాబట్టేందుకు వెంకటరెడ్డి చర్యలు తీసుకోలేదు. ఏపీఎండీసీ ఇసుక అమ్మకాలు చేపట్టినప్పుడు పెద్దఎత్తున వెయింగ్ బ్రిడ్జిలు, సీసీటీవీ కెమెరాలు, కంప్యూటర్లు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంది. జేపీకి టెండర్ ఇచ్చినప్పుడు ఆ టెక్నాలజీని అప్పగించింది. కానీ ఆ సంస్థ ఏ ఒక్కదాన్ని వెనక్కి ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం 27.35 కోట్లు నష్టపోయింది. రెండున్నర సంవత్సరాల వ్యవధిలో జేపీ వెంచర్స్ సరిగ్గా వాయిదాలు చెల్లించకపోయినా ఏనాడు పెనాల్టీ విధించలేదు. జేపీ వెంచర్స్ ప్రభుత్వానికి భారీగా బకాయిలు చెల్లించాలి. అయినా, ప్రభుత్వానికి తెలియకుండా, ఎలాంటి ఫైలు నడపకుండానే 120 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్‌ను గత మార్చి 28న విడుదల చేయించారు. ఆ సంస్థ తమకు బకాయి లేదని నేరుగా బ్యాంకుకు మెయిల్ చేశారు. ఎన్నికల కోడ్ వచ్చాక ఈ సొమ్మును విడుదల చేశారు. జేపీ వెంచర్స్ కాంట్రాక్టు గడువు 2023, మే నెలతో ముగిసిపోయింది. అయినా ఆ సంస్థకు ఆ ఏడాది నవంబరు నెలవరకు కొనసాగింపు ఇచ్చారు. కోర్టు ఆదేశాలతో గనుల శాఖ అధికారులు ఇసుక రీచ్‌లను తనిఖీ చేయగా జేపీ వెంచర్స్ అక్రమ తవ్వకాలు చేసినట్లు తేలింది. రీచ్‌ల పరిధి దాటి తవ్వారు. ఒప్పందానికి విరుద్ధంగా, పర్యావరణాన్ని దెబ్బతీసేలా భారీ యంత్రాలను ఉపయోగించి తవ్వకాలు జరిపారు. ఫలితంగా ఆ సంస్థకు 896.47 కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చారు. జేపీ సంస్థ నుంచి వెంకటరెడ్డి ఆ డబ్బు వసూలు చేయలేకపోయారు.

యంత్రాలు వాడి తవ్వినా...

2023, డిసెంబరు 11న 26 జిల్లాలకు కలిపి ఇసుక టెండర్లు నిర్వహించి 1,3 ప్యాకేజీలు ప్రతిమ ఇన్‌ఫ్రాకు, 2వ ప్యాకేజీ జీసీకేసీ సంస్థకు కట్టబెట్టారు. ఈ సంస్థలు కూడా ఒప్పందాలను రిజిస్టర్ చేసుకొని రూ. 30.68 కోట్లు ప్రభుత్వానికి స్టాంప్‌డ్యూటీ చెల్లించాలి. కానీ అవి రూపాయి కూడా చెల్లించలేదు. అయినా, వెంకటరెడ్డి మిన్నకుండిపోయారు. ఒప్పందం ప్రకారం ఆ రెండు కంపెనీలు కూడా ప్రతీ నెల 1, 16 తేదీల్లో బిడ్ విలువలో వాయిదాలు చెల్లించాలి. కానీ అవి ఆ నిబంధన పాటించలేదు. సొమ్ము చెల్లించకున్నా కాంట్రాక్ట్ కొనసాగేలా వెంకటరెడ్డి ఆ కంపెనీలతో చేతులు కలిపి ప్రభుత్వ ప్రయోజనాలు దెబ్బతీశారు. జీసీకేసీ సంస్థ అక్రమ తవ్వకాలకు పాల్పడుతోందని రూ.717.32 కోట్ల పెనాల్టీ వేశారు. ఆ సొమ్మును రాబట్టలేకపోయారు. భారీ యంత్రాలతో రీచ్‌ల పరిధి దాటి ఇసుక తవ్వకాలు చేస్తున్నాయని జిల్లా స్థాయి అధికారులు నివేదించినా వెంకటరెడ్డి వాటిని కట్టడిచేయలేదు. ఒప్పందం ప్రకారం భారీ యంత్రాలు ఇసుక తవ్వకాలకు వాడకూడదు. కానీ అవి భారీ యంత్రాల వినియోగంతో పాటు, రీచ్‌లకోసం భారీ రహదారులను కూడా నిర్మించినా కన్నెత్తిచూడలేకపోయారు. ఇలా ఇసుకలో రూ.2,566 కోట్లపైనే అవినీతి, అక్రమాలు జరిగాయని ఏసీబీ తననివేదికలో పేర్కొంది.

వెంకటరెడ్డి సర్వంతర్యామి

ఇసుకలో మూడున్నరేళ్లపాటు నిర్విరామంగా అక్రమాలు సాగడంలో గనుల వెంకటరెడ్డి పాత్రే కీలకమని ఏసీబీ తేల్చింది. ఇన్ని అక్రమాలు, అవినీతి కుట్రలకు ఆయనే ప్రధాన నిందితుడని పేర్కొంది. అనుమానితుల జాబితాలో జేపీ వెంచర్స్ కంపెనీ ప్రతినిధి అనిల్ ఆత్మారామ్ కామత్, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధి పి. అనిల్‌కుమార్, జీసీకేసీ ప్రతినిధి ఆర్. వెంకటకృష్ణారెడ్డితోపాటు జేపీ వెంచర్స్, ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీలను చేర్చింది.

తెలియదు.. సంబంధం లేదు.. గుర్తులేదు

(మొదటి పేజీ తరువాయి)



విచారణకు హాజరైన మాజీమంత్రి జోగి రమేశ్

తలశిల రఘురాం, మాజీ మంత్రి జోగి రమేశ్, వైసీపీ నేత దేవినేని అవినాశ్, న్యాయవాది ఒగ్గు గవాస్కర్ తమ పాస్‌పోర్టులను 48 గంటల్లో దర్యాప్తు అధికారులకు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసుల విచారణకు సహకరించాలని, దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిచినా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని మంగళగిరి రూరల్ పోలీసులు వైసీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు. ముందుగా ఒగ్గు గవాస్కర్ పోలీసు స్టేషన్‌కు చేరుకోగా, దర్యాప్తు అధికారులు గంటకుపైగా విచారణ జరిపారు. అనంతరం 3:35 గంటలకు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, 4:10 గంటలకు దేవినేని అవినాశ్, ఆ తరువాత 5:05 గంటలకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాత్రి 7:55 గంటలకు జోగి రమేశ్ వచ్చారు. తమ పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారికి సరెండర్ చేశారు. కేసు దర్యాప్తు అధికారి అయిన మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు విచారణలో భాగంగా పలు ప్రశ్నలను సంధించారు. అయితే, వైసీపీ నేతల నుంచి విచారణకు ఎలాంటి సహకారం లభించలేదని.. 'తెలియదు, సంబంధం లేదు, గుర్తులేదు' అనే సమాధానాలు మాత్రమే వచ్చినట్టు సమాచారం. మంగళగిరి సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి వరకూ విచారణ కొనసాగింది. కేసు విచారణ సందర్భంగా మంగళగిరి పోలీసు స్టేషన్ వద్ద ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విచారణకు హాజరయ్యే వ్యక్తిని మాత్రమే లోపలకు అనుమతించారు.

సరైన సమాధానం చెప్పలేదు

విచారణకు హాజరైన ఎమ్మెల్సీలు, వైసీపీ నేతలు తమకు సహకరించలేదని గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ, కేసు దర్యాప్తు అధికారి సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. వైసీపీ నేతల విచారణ ముగిసిన అనంతరం స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, గవాస్కర్‌లు పాస్‌పోర్టులు అందజేశారని చెప్పారు. తనకు పాస్‌పోర్టు లేదని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారన్నారు. చంద్రబాబు నివాసంపై దాడి కేసులో మాజీమంత్రి జోగి రమేశ్ పాస్‌పోర్టు ఈ ఏడాది మేతో కాలం చెల్లిందని, అయినా దానిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విచారణలో భాగంగా అడిగిన ప్రశ్నలకు వారి నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. దాడి జరిగిన సమయంలో వారు వినియోగించిన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేయాలని అడిగినా ఇవ్వలేదన్నారు. రెండు కేసుల్లోనూ నిందితులు ఇచ్చిన సమాధానాలను క్రాస్ చెక్ చేసుకుని మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పారు.

మీడియాకు నో ఎంట్రీ

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు విచారణలో భాగంగా పోలీసులు మీడియాపై ఆంక్షలు విధించారు. తాలూకా ప్రాంగణాన్ని పూర్తిగా మూసివేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన ద్వారం వెలుపల మొక్కుబడిగా ఓ టెంటు వేసి మీడియా పాయింట్ అంటూ బోర్డు తగిలించారు. వివిధ కేసుల నిమిత్తం పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లకు వచ్చే కక్షిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొత్త వైద్య కళాశాలలపై బహిరంగ చర్చకు రావాలి: మంత్రి సత్యకుమార్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14: 'రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలపై జగన్మోహన్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలి. గతంలో సీఎంగా పనిచేసిన జగన్ వచ్చినా, వైద్య శాఖ మంత్రిగా పనిచేసినవారు వచ్చినా చర్చకు సిద్ధంగా ఉన్నాం. ధైర్యం ఉంటే చర్చకు రావాల్సిందిగా హోదాలేని ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసురుతున్నాం' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "వైసీపీ పాలనలో ఏం జరిగిందో... కూటమి ప్రభుత్వం వచ్చాక ఏమి చేస్తున్నామో... కారణం ఎవరో... ఆధారాలతో చూపించడానికి సిద్ధంగా ఉన్నాం. మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఆలోచన గత ప్రభుత్వం చేయలేదు. సూపర్ స్పెషాలిటీలో 95 మంది శాంక్షన్ స్ట్రెంగ్త్ ఉంటే 28 ఖాళీలు ఉన్నాయి. ప్రొఫెసర్లు లేకుండా అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకుండా, ఫ్యాకల్టీ, ట్యూటర్లు లేకుండా ఏవిధంగా వైద్య విద్యాబోధన చేస్తారో జగన్‌కే తెలియాలి. ఇంట్లో... లేకుంటే బెంగళూరులో కూర్చుని అప్పుడప్పుడూ విహారయాత్రకు వచ్చినట్టు రాష్ట్రానికి రావడం... చేతులు ఊపడం, నేరస్తులను పరామర్శించడానికి జైలుకు వెళ్లడం తప్ప ఆయన చేస్తున్నది ఏమిటి? ఆయన చేసిన తప్పులను మాపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు రూ.2,500 కోట్ల బకాయిలు పెట్టి మాపై విమర్శలు చేస్తున్నారు. రెండు నెలల్లోనే రూ.652 కోట్లు చెల్లించాం. జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. అబద్ధాలు చెప్పడం, బురద చల్లి పారిపోవడం సరైన పద్ధతి కాదు. మీరు రండి ప్రతిదానిపైనా చర్చ చేద్దాం" అని సత్యకుమార్ సవాల్ విసిరారు.

ఆర్‌ఈ పెట్టుబడులకు అవకాశం

» గుజరాత్ సదస్సుకు హాజరుకానున్న సీఎం చంద్రబాబు: విజయానంద్

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'గుజరాత్ గాంధీనగర్‌లో 16 నుంచి 18వ తేదీ వరకూ 4వ ప్రపంచ పునర్వినియోగ ఇంధన పెట్టుబడిదారుల సదస్సు, ప్రదర్శన (4th RE Invest) జరుగుతుంది. దానికి గౌరవ అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. సీఎం చంద్రబాబు ఈ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు' అని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం. రాష్ట్రంలో 38.5 గిగావాట్ సోలార్ విద్యుత్తు, 123.34 గిగావాట్ల పవన విద్యుత్తు, 43.89 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు ప్లాంట్లను స్థాపించేందుకు అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ వేదికగా రాష్ట్రంలో పెట్టుబడుల సాధనపై దృష్టి సారిస్తాం' అని విజయానంద్ వివరించారు.

నేడు పీహెచ్‌సీ వైద్యుల చలో విజయవాడ

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. శుక్రవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో వైద్యులు ముందస్తుగా ఇచ్చిన సమ్మె నోటీసుల ప్రకారం ఆదివారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నుంచి ఎమర్జెన్సీ సేవలకు మినహా డాక్టర్లు హాజరుకావడం లేదు. ఆదివారం ఉదయం చలో విజయవాడ పేరిట డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల వైద్యులు ఈ ర్యాలీలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, సోమవారం నుంచి విజయవాడ ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నారు. పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా మద్దతు తెలిపింది. ఈమేరకు ప్రభుత్వ వైద్యుల సంఘం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. వైద్యుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని జీవో 85ను రద్దు చేయాలని కోరింది. పీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ లేదా ఎంబీబీఎస్ వైద్యులు పని చేసే హక్కును రాజ్యాంగం కల్పించిందని, దీనిని ఎవరూ ప్రశ్నించలేరని పేర్కొంది.

మరోసారి చర్చలు జరుపుతాం: ఆరోగ్యశాఖ

పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు చెప్పిన సమస్యల్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తుందనీ, త్వరలో మరోసారి చర్చలకు పిలుస్తామని ఆరోగ్యశాఖ కమిషనర్ సి.హరికిరణ్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటి వరకూ విధులకు హాజరై ప్రజల ఆరోగ్య సేవలకు విఘాతం కలగకుండా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

ఖర్చు చేశారు.. తాళాలు వేశారు!

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలను విలీనం పేరుతో దెబ్బతీశారు. అవన్నీ ఇప్పుడు కనీసం 20 మంది విద్యార్థులు లేక ఏకోపాధ్యాయ బడులుగా మారాయి. వాటిలో 59 పాఠశాలల్లో ఉన్న రెండు తరగతుల్లోని పిల్లలూ వెళ్లిపోయారు. దీంతో బడులు మూతపడ్డాయి. మూతపడిన ఈ 73 బడులకు సుమారు రూ.5.26కోట్లు ఖర్చు చేశారు. ఆ నిధులన్నీ వృథా అయిపోయాయి. మూతపడినవాటిలో అన్నమయ్య జిల్లాలో కె.వి.పల్లె ఎంపీపీ స్కూల్, గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం పట్లవీడు ప్రాథమిక పాఠశాల (ఎస్.ఎల్.పురం), కడప జిల్లా జమ్మలమడుగులోని జె.రామిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలతోపాటు, కృష్ణా జిల్లా వెంట్రప్రగడలోని శివపురం ప్రాథమికోన్నత పాఠశాల, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చిన్నపుల్లేరు ఎంపీపీ మెయిన్ పాఠశాల, ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని కరోళ్లపాడు ఎంపీపీ స్కూల్ తదితర 73 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 59 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

అన్నీ అరకొర పనులే

విద్యార్థులు తక్కువగా ఉన్నా ప్రాథమిక పాఠశాలల్లో నాడు-నేడు పనులు చేసిన జగన్ ప్రభుత్వం.. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండే ఉన్నత పాఠశాలల్లో పనులు పూర్తిచేసే విషయంలో విఫలమైంది. మూడేళ్లలో పనులు పూర్తిచేస్తామని ప్రకటించిన ప్రభుత్వం 15వేల పాఠశాలల్లోనే పనులు చేసింది. అందులోనూ కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండో విడతలో 22వేల బడుల్లో పనులు ప్రారంభించినా నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్క డి పనులు అక్కడే నిలిచిపోయాయి. రూ.8 వేల కోట్లతో రెండో విడత పనులు ప్రారంభించగా అందులో సగం నిధులే ఖర్చు చేశారు. నాడు-నేడు పేరుతో తీసుకొచ్చిన రుణాలను ఇతరత్రా అవసరాలకు మళ్లించడంతో వాటిని వెనక్కి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కడప జిల్లా వేంపల్లె మండలం అయ్యవారిపల్లె ప్రాథమిక పాఠశాల

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా.. నాడు నేడు పేరిట వైసీపీ ప్రభుత్వం నిధులు దుబారా చేసిందనడానికి ఇదో విదర్శనం. ఇది వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలంలోని అయ్యవారిపల్లె ప్రాథమిక పాఠశాల. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో ఫేజ్‌లో దాదాపు రూ.10లక్షలతో అభివృద్ధి చేశారు. టైల్స్‌తో ఫ్లోరింగ్ వేశారు. టాయిలెట్లు ఆధునికీకరించారు. దెబ్బతిన్న గోడలకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. ప్రహరీ గోడ నిర్మించారు. వేసవి సెలవుల అనంతరం ఈ ఏడాది జూన్‌లో పాఠశాల ప్రారంభమైంది. అయితే ఈ పాఠశాలకు ముగ్గురు మాత్రమే విద్యార్థులు వచ్చారు. దీంతో వీరికి టీసీలు ఇచ్చి వేంపల్లె రాజారెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఇక్కడున్న ఏకోపాధ్యాయుడు భూమిరెడ్డి పురుషోత్తం రెడ్డిని వేంపల్లె పంపించారు. ఆతర్వాత పులివెందులకు బదిలీ చేశారు.

అప్పట్లోనే అనుమానాలు.. అయినా..!

నాడు- నేడు పథకంలో భాగంగా తరగతి గదులు, పాఠశాల ఆవరణలు, గోడలకు పెయింట్లు వేశారు. వాటర్ ప్లాంట్లూ ఏర్పాటుచేశారు. అప్పటికే అంతంతమాత్రంగా విద్యార్థులున్న పాఠశాలల్లోనూ ఈ పను లు చేశారు. నిధులన్నీ వృథా అవుతున్నాయని టీచర్లు ఆందోళన వ్యక్త ం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ బడులను మూ సేయడంపై విమర్శలొస్తున్నాయి.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. కాటసాని మా ప్లాట్లను కబ్జా చేశారు

» సర్వే చేసి మా ప్లాట్లను ఇప్పించండి

» పద్మావతినగర్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): "పైసాపైసా కూడబెట్టి ప్లాట్లు కొన్నాం. మా ప్లాట్ల పక్కనే కర్నూలు జిల్లా పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన భార్య ఉమామహేశ్వరమ్మ భూమి కొనుగోలు చేశారు. ఆ తర్వాత మా ప్లాట్లను కూడా కబ్జా చేశారు. మా ప్లాట్లలోకి మేము వెళ్లకుండా.. ప్రహరీ గోడ కట్టారు" అని అమీన్‌పూర్ ప్రాంతంలోని పద్మావతినగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్లాట్ల యజమానులు మాట్లాడారు. "తీవ్ర మనోవేదనను అనుభవిస్తున్న మాకు.. హైడ్రా రూపంలో ఉపశమనం లభించింది. కాటసాని ఆక్రమించిన ప్రహరీగోడతోపాటు.. కొన్ని కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. మా ప్లాట్లలోకి వెళ్లేందుకు అడ్డంకులు తొలగిపోయాయి" అన్నారు. అయితే.. ఇంకా తమ సమస్య తీరలేదని, సీఎం స్పందించి, తమ ప్లాట్లను తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

కరెంటు ఆపేసి.. ట్రాక్టర్ అడ్డుపెట్టి..

» టీడీపీ వినాయక ఊరేగింపుపై వైసీపీ దాడి

» 12 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

» ధర్మవరంలో వైసీపీ వర్గీయుల బరితెగింపు



గాయపడిన టీడీపీ వర్గీయులు

అద్దంకి, సెప్టెంబరు 14: రాత్రి సమయంలో కరెంటు తీసేసి.. దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను అడ్డుపెట్టి.. టీడీపీ వర్గీయుల వినాయక చవితి ఊరేగింపుపై వైసీపీ వర్గీయులు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన 12 మంది గాయపడ్డారు. దాడి తర్వాత వైసీపీ వాళ్లంతా పరారుకాగా, వారికి చెందిన టిప్పర్లను టీడీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి, బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధర్మవరంలో జరిగిందీ దారుణం. శుక్రవారం రాత్రి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి ఊరేగింపు రైస్‌మిల్ వైపు వెళ్తుండగా.. వైసీపీ వర్గీయులు విద్యుత్ సరఫరా నిలిపివేసి, దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఒక్కసారిగా రాళ్లు, కర్రలతో టీడీపీ వారిపై దాడికి తెగబడ్డారు. ఊరేగింపులో ముందు వచ్చిన వారిని వచ్చినట్టుగా కొట్టారు. డీజే సౌండ్‌తో ఏమి జరుగుతున్నదో తెలిసేలోపే అందరిపైనా దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో చాగంటి సుబ్బయ్య, సుబ్బారావు, యోగేశ్వరరావు, పచ్చవ శ్రీనివాసరావు, సందిపాము దేవదాసు, పచ్చవ లక్ష్మయ్య, శ్రీనివాసరావు, రామాంజనేయులు, బొల్లా కోటయ్య చాగంటి వెంకటరావు, పచ్చవ ప్రభాకర్, చాగంటి దానయ్యతోపాటు మరికొంతమంది మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పచ్చవ లక్ష్మయ్యను విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. చాగంటి సుబ్బయ్య, సుబ్బారావు, యోగేశ్వరరావు, పచ్చవ శ్రీనివాసరావు, సందిపాము దేవదాసును ఒంగోలు కిమ్స్‌లో చేర్చారు. వీరిలో దేవదాసు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ జగదీష్‌నాయక్ పరిశీలించారు.

ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెడతాం: మంత్రి రవికుమార్

ప్రశాంతంగా ఉన్న గ్రామాలను వైసీపీ నేతలు ఫ్యాక్షన్ కేంద్రాలుగా మార్చారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. నిందితులను వదిలే ప్రసక్తే లేదని, బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. వైసీపీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పెడతామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

విజయవాడ ● ఆదివారం 15 సెప్టెంబరు 2024

diksuchi@andhrajyothy.com

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా



హైదరాబాద్, బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ) కోర్సులో ప్రవేశానికి వాక్ ఇన్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి.


అర్హత: అభ్యర్థులు డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించ కూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **వాక్ ఇన్ అడ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 21
- **చిరునామా:** అడ్మిషన్ డెస్క్, రూమ్ నెంబరు 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037
- **వెబ్‌సైట్:** citdindia.org

ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైం రెసిడెన్షియల్ రీసెర్చ్ (ఆర్ఆర్), కంటిన్యూయింగ్ డాక్టోరల్ ప్రోగ్రామ్ (సీడీపీ) కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. సీడీపీని పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, విద్యాసంస్థల ఫ్యాకల్టీకి ఉద్దేశించారు. ఆర్ఆర్ అభ్యర్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంది.



స్పెషలైజేషన్లు: బయోలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్, ఎర్త్ సిస్టమ్స్ సైన్స్, ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ(బేసిక్ సైన్స్)/బీటెక్/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి బీఎస్, బీఎస్-ఎంఎస్ కోర్సులు ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన మేరకు నెట్/గేట్ అర్హత తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సంస్థ నిర్ణయం మేరకు రాత పరీక్ష, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఫెలోషిప్: నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; ఐఐటీలు, ఐసర్లలో చదివినవారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ల్లో రీసెర్చ్ వర్క్ ప్రజెంట్ చేసేందుకు రూ.2 లక్షల వరకు ఫైనాన్షియల్ సపోర్ట్ అందిస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో నాలుగు నుంచి ఆర్నెల్లు రీసెర్చ్ వర్క్ చేసేందుకు గాను 12,500 యూఎస్ డాలర్లు అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 17
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 24 నుంచి 26 వరకు
- **రాత పరీక్ష, ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** నవంబరు 1 నుంచి 20 వరకు
- **వెబ్‌సైట్:** iitgn.ac.in/admissions/phd

అంబేడ్కర్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా

శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసిన వారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీ(మనూ)- యూజీ రెగ్యులర్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన మెరిట్ బేస్డ్ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సీయూఈటీ, నాన్ సీయూఈటీ అభ్యర్థులు; గతంలో అప్లయ్ చేసుకొని అడ్మిషన్ దొరకని వారు కూడా ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-క్యాంపస్‌లు-సీట్లు

- హైదరాబాద్ క్యాంపస్‌లో బీకామ్(ఆనర్స్/రీసెర్చ్) 22 సీట్లు, బీఏ(ఆనర్స్ రీసెర్చ్) 55 సీట్లు; బీఏ జేఎంసీ(ఆనర్స్/రీసెర్చ్) 24 సీట్లు; బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్)లైఫ్ సైన్సెస్ 21 సీట్లు; బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్)ఫిజికల్ సైన్సెస్ 56 సీట్లు; బీఓసీ(ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్) 16 సీట్లు, బీఓసీ(మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ) 16 సీట్లు; బీఓసీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ) 17 సీట్లు ఉన్నాయి.
- భోపాల్ క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 15 సీట్లు ఉన్నాయి.
- దర్భంగా క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 12 సీట్లు ఉన్నాయి.
- హైదరాబాద్ ఫలక్‌నుమా క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 13 సీట్లు ఉన్నాయి.
- లఖ్‌నవూ క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 16 సీట్లు ఉన్నాయి.
- వారణాసి క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 15 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిమిత్తం అభ్యర్థులు సంబంధిత క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 18
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** సెప్టెంబరు 20
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపులు:** సెప్టెంబరు 21 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in



మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్



మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.


వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐఎస్‌డబ్ల్యుబీఎంలో ఎంబీఏ



కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యుబీఎం)- ఎంబీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్

ప్రోగ్రామ్ వివరాలు: ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో ఒక్కోదానిలో తొమ్మిది కంపల్సరీ పేపర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ పేపర్లు, మూడు స్పెషలైజేషన్ పేపర్లు ఉంటాయి. నాలుగో సెమిస్టర్‌లో రెండు కంపల్సరీ పేపర్లు, మూడు స్పెషలైజేషన్ పేపర్లు ఉంటాయి. రెండు, మూడు సెమిస్టర్ల మధ్య సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా డిజర్టేషన్, వైవా ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో నాలుగేళ్ల బీఈ/బీటెక్; మెడికల్ సైన్స్ డిగ్రీ; ఎల్ఎల్‌బీ; ఆనర్స్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/కామర్స్)/డిగ్రీ(బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కంప్యూటర్ అప్లికేషన్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా అర్హులే. క్యాట్ 2024 ఎగ్జామ్‌కు అప్లయ్ చేసి ఉండాలి.

ఎంపిక: క్యాట్ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** డిసెంబరు 20
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు:** 2025 మార్చిలో
- **కొరియర్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఐఐఎస్‌డబ్ల్యుబీఎం, మేనేజ్‌మెంట్ హౌస్, కాలేజ్ స్క్వేర్ వెస్ట్, కోల్‌కతా-700073
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

రైల్వేలో గ్రాడ్యుయేట్ పోస్టులు

ఖాళీలు **8,113**

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టుల వివరాలు

1. కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: **1,736 పోస్టులు**
2. స్టేషన్ మాస్టర్: **994 పోస్టులు**
3. గూడ్స్ రైలు మేనేజర్: **3,144 పోస్టులు**
4. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **1,507 పోస్టులు**
5. సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **732 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.


ప్రారంభం వేతనం: నెలకు రూ.29,200 నుంచి రూ.35,400

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, ఈబీసీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/



జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

ఖాళీలు **1,511**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్..రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెలివరీ: **187 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఇన్‌ఫ్రా సపోర్ట్ అండ్ క్లౌడ్ ఆపరేషన్స్: **412 పోస్టులు**
3. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- నెట్‌వర్కింగ్ ఆపరేషన్స్: **80 పోస్టులు**
4. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఐటీ ఆర్కిటెక్ట్: **27 పోస్టులు**
5. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ: **7 పోస్టులు**
6. అసిస్టెంట్ మేనేజర్(సిస్టమ్)- **798 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 30 నాటికి డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు డిప్యూటీ మేనేజర్లకు రూ.64,820 - రూ.93,960. అసిస్టెంట్ మేనేజర్‌లకు రూ.48,480 - రూ.85,920.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.


దరఖాస్తు రుసుము: రూ.750(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది).

పోస్టింగ్ స్థలం: నవీ ముంబయి/హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 4


వెబ్‌సైట్: https://sbi.co.in/


క్యూఆర్ కోడ్ గ్రామం!




చైనాలో జిలిన్‌షూ అనే గ్రామం ఉంది. ప్రపంచంలో ఏ గ్రామానికి లేని ప్రత్యేకత జిలిన్‌షూకు ఉంది. ఈ గ్రామానికి చెందిన ప్రజలు- 1.30 లక్షల చెట్లతో ఒక క్యూఆర్ కోడ్‌ను సృష్టించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను విమానం నుంచి స్కాన్ చేస్తే ఆ గ్రామానికి చెందిన టూరిజం వెబ్‌సైట్ వస్తుంది.

7 తేడాలను కనిపెట్టండి







సరైన నీడను గుర్తించండి





డైలీ సుడోకు - 410

				9	8			1
			7			5	4	
	8		1					
	3			5			8	
	6	9	8		4	3	7	
	4			3			2	
					6		1	
	5	8			9			
9			4	8				

సుడోకు - 409 సమాధానం

5	8	6	9	2	3	4	7	1
9	4	1	8	7	6	5	3	2
7	2	3	5	4	1	6	9	8
2	6	4	7	1	8	9	5	3
1	3	5	6	9	4	2	8	7
8	7	9	3	5	2	1	4	6
3	9	8	2	6	5	7	1	4
6	1	7	4	8	9	3	2	5
4	5	2	1	3	7	8	6	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.